Follow: @ANNTELUGU
ANN తెలుగు
16-10-2026
# మహా పత్రిక
శుక్రవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 254 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



ఏపీలో
## ఎన్నికల జోరు

- మున్సిపల్ పోరుకు వైసీపీ అభ్యర్థులు ఖరారు
- మేయర్, ఛైర్మన్ అభ్యర్థుల పూర్తి జాబితా విడుదల
- సీట్లపై కూటమి ఎడతెగని చర్చలు

**అమరావతి, మహా :** ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న మున్సిపల్ ఎన్నికల సమరానికి వైసీపీ పూర్తిస్థాయిలో సిద్ధమైంది. ఓ వైపు కూటమి పార్టీ సీట్లపంపకాల్లో ఎడతెగని చర్చలు చేస్తుండగానే, వైసీపీ పార్టీ అందరికంటే ముందుగా అభ్యర్థులందరినీ ప్రకటించేసి స్పష్టతనిచ్చేసింది. వైసీపీ పార్టీ అధ్యక్షుడు జగన్ ఆదేశాల మేరకు మున్సిపల్ కార్పొరేషన్లకు మేయర్ అభ్యర్థులను, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు ఛైర్మన్ అభ్యర్థులను ఖరారు చేశారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం అధికారికంగా పత్రికా ప్రకటన ద్వారా అభ్యర్థుల పూర్తి

మిగతా 3వ పేజీలో

టాప్ న్యూస్

## కూటమి సీట్ల ఖరారు



- జనసేనకు 4, బీజేపీకి 2 కార్పోరేషన్లు
- తిరుపతి సహా 11కార్పోరేషన్లలో టీడీపీ పోటీ
- జనసేనకు విజయవాడ, కాకినాడ, ఏలూరు, శ్రీకాకుళం

03

## జైలర్ 2 అదుర్స్ రజనీ మ్యాజిక్




- ఇంటర్వెల్ బ్లాక్‌తో థియేటర్లలో గూస్‌బంప్స్
- దసరా సీజన్‌లో తొలి హిట్‌గా జైలర్-2

03

## న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరు



- రాహుల్ సహా ఇండీ కూటమి నేతలకు సుప్రీం నోటీసులు
- సుప్రీంకోర్టు వరకు విపక్ష నేతలు చేపట్టిన పాదయాత్రపై అభ్యంతరం వ్యక్తం చేసిన న్యాయస్థానం
- న్యాయవ్యవస్థపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలను అంగీకరించబోమని స్పష్టం

02




# ఇక గడ్డుపరిస్థితే

## కరెంట్.. నీళ్ళకు కష్టమే

- అడుగంటుతున్న కృష్ణా.. గోదావరి బేసిన్ లు
- కృష్ణా బేసిన్‌లో నీటి నిల్వలు 72 శాతం తక్కువ
- యాసంగిలో వరి పంట వేయొద్దు
- ఈ సీజన్‌లో పంటలు పండించటాన్ని వాయిదా వేసుకోండి
- పది నెలలు నీటిని పొదుపుగా వాడుకుందాం
- రైతులకు, ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి
- మార్చిలో ఉండే ఎండలు అక్టోబర్‌లోనే
- నేడు అఖిలపక్ష సమావేశం.. కేంద్రం ఆదుకోవాలని వినతి



**హైదరాబాద్, మహా :** ఎల్‌నినో విపత్తు ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలను వణికిస్తోందన్న సీఎం రేవంత్ రెడ్డి శాస్త్రవేత్తలు ఊహించినట్లుగానే పరిస్థితులు చేయిదాటి పోయేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో నీరు, విద్యుత్ కొరతను తీవ్రంగా ఎదుర్కోబోతున్నామని హెచ్చరించారు. అక్టోబర్‌లో ఈ స్థాయి విద్యుత్ వినియోగం చరిత్రలో ఎప్పుడూ లేదని, మార్కెట్‌లో విద్యుత్ ఏ ధరకు దొరికినా కొనేందుకు

మిగతా 3వ పేజీలో

## అవినీతిపై చర్చకు సిద్ధం సీఎం రేవంత్ రెడ్డి

**ఈ దొంగల్ని పట్టుకునే విద్యనాకు తెలుసు ముఖానికి నాట్లేసుకుని మారువేషంలో తిరుగుతుండు**

**హైదరాబాద్, మహా :** నాపై ఆరోపణ చేసిండు. నేను విచారణకు సిద్ధంగా ఉన్నా. అవినీతిపై ఎలాంటి చర్చకైనా తాను సిద్ధంగా ఉన్నానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కల్వకుంట్ల దొంగల్ని పట్టుకునే విద్య తనకు మొదటి నుంచే తెలుసన్నారు. డ్రగ్స్ విషయంలో బుకాయించిండు. ఫామ్‌హౌస్‌లు బుకాయించిండు. 22ఏ భూములపై బుకాయించిండు. స్టార్ హోటళ్ల వ్యవహారాలపై బుకాయిస్తే బట్టలుడదీసి రోడ్ పైన పండబెట్టినా. ఇప్పుడు ముఖానికి బొగ్గు పూసుకుని,మొహానికి నాట్లు వేసుకొని మారువేషంలో తిరుగుతుండు. అంటూ సీఎం ఫైర్ అయ్యారు.


కాప్రా చెరువు నుండి ఉధృతంగా ప్రవహించే అలుగు


నాలాపైన నిర్మిస్తున్న బహుళ అంతస్థుల నిర్మాణం

# నాలా దురాక్రమణ..!

## నాలాపై బహుళ అంతస్తుల నిర్మాణం ..! | అడ్డదారిలో హెచ్ఎండీఏ అనుమతుల..!

ముడుపుల మత్తులో ఇరిగేషన్, రెవెన్యూ ఎన్‌వోసీలు..!

ఇరిగేషన్ చట్టాలు అక్రమార్కులకు చుట్టాలుగా మారిన వైనం..

- ఇరిగేషన్ చట్టాలకు తూట్లు పొడుస్తున్న ఇంటి దొంగలు..!
- రెవెన్యూ అధికారుల వక్రబాష్యం...!
- బిల్డర్లతో కుమ్మక్కైన అధికార యంత్రాంగం...!
- నాలాల కబ్జాతో నగర భవిష్యత్తుకు ముప్పు..!
- హైడ్రా స్పందిస్తేనే అక్రమార్కులకు చెక్...!

02


నాలాపైన నిర్మిస్తున్న బహుళ అంతస్థుల నిర్మాణం

సహజ సిద్ధంగా ప్రవహించే నాలాలను ఆక్రమించి బిల్డర్లు దురాక్రమణకు తెగబడ్డారు.. కొద్దిపాటి వర్షానికే పొంగి ప్రవహించే నాలాలు తన సహజ ఉనికిని కోల్పోయి అక్రమార్కుల కబంధ హస్తాల్లో చిక్కి శల్యమవుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.. ఉధృతంగా ప్రవహించే నాలాలను మళ్ళించి ఆ నాలాలపైనే బహుళ అంతస్తుల నిర్మాణాలు యదేచ్ఛగా కొనసాగిస్తూ అధికార యంత్రాంగానికే సవాల్ విసురుతున్నారు. ఇరిగేషన్ చట్టాలను చుట్టాలుగా మార్చుకున్న అక్రమార్కులు నిబంధనలను తుంగలో తొక్కుతూ, వరద నీటి ప్రవాహానికి జీవనాడిగా ఉన్న నాలాలను పూడ్చి వేసి, కుదించి, సహజ ప్రవాహాన్ని మళ్లించి యదేచ్ఛగా నిర్మాణాలు సాగిస్తున్నారనే బహిరంగ ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.. లక్షలాది రూపాయలు చేతులు మారడంతోనే నిబంధనలకు విరుద్ధంగా ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు అడ్డదారిలో జారీ చేసిన ఎన్‌వోసీలతో, హెచ్ఎండీఏ అనుమతులు పొందరనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.. హెచ్ఎండీఏ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే, కేవలం ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల నివేదికల ఆధారంగానే, ఏసీ గదుల్లో కూర్చొని అనుమతులు ఎలా జారీ చేస్తారని స్థానికులు సూటిగా ప్రశ్నిస్తున్నారు..




## ఢిల్లీలో సీజేపీ నిరసన అడ్డుకోలేమన్న హైకోర్టు

02

## అక్రమ షెడ్డును కూల్చేదెన్నడు...!

తూంకుంటలో యథేచ్ఛగా కొనసాగుతున్న భారీ షెడ్డు నిర్మాణ పనులు...!

- నోటీసులతో సరిపెడుతున్న టౌన్ ప్లానింగ్ అధికారులు...!
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం...!
- పత్తాలేని టౌన్ ప్లానింగ్ అధికారులు...!
- ప్రారంభానికి సిద్ధమవుతున్న అక్రమ షెడ్డు...!
- ఎంఎంసీ కమిషనర్ స్పందనేదీ...!

02



## పాకిస్థాన్‌లో ఘోర విషాదం

- పాఠశాల పైకప్పు కూలి 28 మంది చిన్నారులు మృతి
- భారీ వర్షా లకు కూలిన రెండంతస్తుల స్కూల్ భవనం
- 47 మందికి గాయాలు
- శిథిలాల కింద మరికొందరు చిక్కుకున్నట్లు అనుమానం

02









### మీడియా అక్రిడిటేషన్ కార్డుల గడువు నవంబర్ 25 వరకు పొడిగింపు..

# తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు

**హైదరాబాద్, అక్టోబర్ 15:** తెలంగాణలో 2023లో జారీ చేసిన మీడియా అక్రిడిటేషన్ కార్డుల గడువును అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు 2026 నవంబర్ 25 వరకు పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. అయితే, ప్రస్తుతం అక్రిడిటేషన్ కార్డులు లేని కొత్త దరఖాస్తుదారులకు ఈ మధ్యంతర ఉపశమనం వర్తించదని స్పష్టం చేసింది.

హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పి. సామ్ కోషి, జస్టిస్ ఎస్. చలపతి రావులతో కూడిన డివిజన్ బెంచ్ గురువారం ఈ ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (TUWJF)తో పాటు ఇతరులు దాఖలు చేసిన పలు పిటిషన్లపై విచారణ సందర్భంగా ఈ నిర్ణయం తీసుకుంది.

తెలంగాణ మీడియా అక్రిడిటేషన్ రూల్స్-2025 కింద రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సవరించిన అర్హత నిబంధనలను పిటిషనర్లు హైకోర్టులో సవాల్ చేశారు. ఈ నిబంధనలకు వ్యతిరేకంగా దాఖలైన ప్రధాన పిటిషన్లపై తుది విచారణను నవంబర్ 25కు కోర్టు వాయిదా వేసింది.

**కొత్త అక్రిడిటేషన్ నిబంధనలపై న్యాయపోరాటం**

2016 నిబంధనల స్థానంలో తెలంగాణ ప్రభుత్వం 2025 డిసెంబర్‌లో కొత్త మీడియా అక్రిడిటేషన్ రూల్స్‌ను ఆమోదించింది. 2025 డిసెంబర్ 22న జీఓ ఎంఎస్ నంబర్ 252 ద్వారా వీటిని జారీ చేయగా, 2026 జనవరి 24న జీఓ ఎంఎస్ నంబర్ 103 ద్వారా సవరణలు చేసింది.

కొత్త నిబంధనల ప్రకారం తొలిసారిగా డిజిటల్ న్యూస్ ప్లాట్‌ఫామ్‌లను కూడా అక్రిడిటేషన్ వ్యవస్థలోకి తీసుకొచ్చారు. అదే సమయంలో వివిధ మీడియా విభాగాలకు అర్హత ప్రమాణాలను కఠినతరం చేశారు. ప్రింట్ మీడియా సంస్థలకు రోజుకు కనీసం 2,000 కాపీల సర్క్యులేషన్ ఉండటంతో పాటు ప్రెస్ రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా వద్ద రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేశారు. డిజిటల్ న్యూస్ సంస్థలు గత ఆరు నెలల కాలంలో ప్రతి నెల కనీసం ఐదు లక్షల యూనిక్ విజిటర్లను కలిగి ఉండాలని నిబంధన విధించారు. రాష్ట్రవ్యాప్తంగా డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లకు ఇచ్చే అక్రిడిటేషన్ కార్డుల సంఖ్యను 10కు పరిమితం చేశారు.

ఈ నిబంధనలను సవాల్ చేసిన TUWJF, ఇతర జర్నలిస్టు సంఘాలు.. సర్క్యులేషన్, ఆదాయ పరిమితులు, ప్రసార సమయం, డిజిటల్ విజిటర్ల సంఖ్య ఆధారంగా అర్హతలను నిర్ణయించడం ఏకపక్షంగా, చట్టవిరుద్ధంగా ఉందని పిటిషన్లలో పేర్కొన్నాయి.

**గతంలోనూ పలుమార్లు గడువు పొడిగింపు**

2026 ఫిబ్రవరిలో ఇదే డివిజన్ బెంచ్ ప్రస్తుతం చెల్లుబాటులో ఉన్న అక్రిడిటేషన్ కార్డుల గడువును ఏప్రిల్ 30 వరకు పొడిగించాలని ఆదేశించింది. పిటిషన్లపై సమాధానం దాఖలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి సమయం ఇచ్చింది.

అయితే గడువులోగా కార్డుల పునరుద్ధరణ ప్రక్రియ పూర్తికాకపోవడంతో మే నెలలో ఈ అంశం వెకేషన్ బెంచ్ ముందుకు వచ్చింది. అక్రిడిటేషన్ కార్డుల పునరుద్ధరణలో జాప్యం కారణంగా వర్కింగ్ జర్నలిస్టులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని TUWJF కోర్టుకు వివరించింది.

దీనిపై స్పందించిన అడిషనల్ అడ్వకేట్ జనరల్, ప్రస్తుతం ఉన్న కార్డుల గడువును జూన్ 16 వరకు పొడిగిస్తామని కోర్టుకు హామీ ఇచ్చారు. ఆ హామీని కచ్చితంగా అమలు చేయాలని హైకోర్టు ఆదేశించింది.

తాజాగా 2023లో జారీ చేసిన అక్రిడిటేషన్ కార్డుల గడువును అర్హులైన జర్నలిస్టులకు నవంబర్ 25, 2026 వరకు పొడిగిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త నిబంధనలపై న్యాయపోరాటం కొనసాగుతున్న నేపథ్యంలో ఈ మధ్యంతర పొడిగింపు అమల్లోకి వచ్చింది.

**నవంబర్ 25న ప్రధాన పిటిషన్లపై తుది విచారణ**

ప్రస్తుతం అక్రిడిటేషన్ కార్డులు కలిగి ఉన్న అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు మాత్రమే ఈ ఉత్తర్వులు వర్తిస్తాయని హైకోర్టు స్పష్టం చేసింది. కొత్తగా దరఖాస్తు చేసుకునేవారికి, ప్రస్తుతం అక్రిడిటేషన్ కార్డులు లేని వారికి ఈ ఉపశమనం వర్తించదని పేర్కొంది.

తెలంగాణ మీడియా అక్రిడిటేషన్ రూల్స్-2025ను సవాల్ చేస్తూ దాఖలైన ప్రధాన పిటిషన్లపై నవంబర్ 25, 2026న తుది విచారణ జరగనుంది. ఈ విచారణలో కొత్త నిబంధనలు, వాటి కింద నిర్దేశించిన అర్హత ప్రమాణాలపై న్యాయస్థానం పరిశీలన జరపనుంది.

# నాలా దురాక్రమణ..!

**మహా, సిటీ బ్యూరో:** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్, కాప్రా సర్కిల్ లో రియల్టర్ల అరాచకం పెట్రేగిపోతుంది. వివరాలలోకి వెళితే రాజరాజేశ్వరి కాలనీ, కాప్రా చెరువు అలుగు పక్కనే నాలా నిబంధనలను తుంగలో తొక్కుతూ ఉధృతంగా ప్రవహించే నాలాలను సైతం ఆక్రమించి, సహజ వరద నీటి ప్రవాహాన్ని మళ్ళించి అరాచకాన్ని సృష్టిస్తున్నారు. నాలాలపై యధేచ్చగా నిర్మిస్తున్న బహుళ అంతస్తుల నిర్మాణాల తీరు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గతంలో పనిచేసిన కాప్రా తహసీల్దార్ ఇది అక్రమం అని తేల్చి నిర్మాణ పనులు నిలిపి వేశారు. కానీ ప్రస్తుత తహసీల్దార్ అక్రమ నిర్మాణదారులకు కొమ్ముకాస్తూ భారీ మొత్తంలో ముడుపులు ముట్టడంతోనే క్లీన్‌చిట్ ఇచ్చినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.



వందల ఏళ్ల చరిత్ర కలిగిన కాప్రా చెరువు నుండి ప్రవహించే నాలా అక్రమార్కుల దురాక్రమణకు గురయి నేడు వెలవెలబోతోందని బహిరంగ ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. చట్టాలలోని లొసుగులను వాడుకుంటూ, అధికారులను ముడుపుల మత్తులో ముంచుతూ, ఏకంగా 15 మీటర్ల వెడల్పున్న నాలా 4 అడుగులకు కుదించి నాలా స్థలంలోనే బహుళ అంతస్తుల నిర్మాణం చేపడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**అందిన కాడికి దండుకుని అడ్డదారిలో నుమతులు జారీ**

కావాల్సిన ముడుపులు ముట్టజెప్పేసరికే క్షేత్రస్థాయి పరిశీలన లేకుండా, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు జాయింట్ సర్వే నిర్వహించకుండానే ఎన్‌ఓసీలు జారీ చేశారనే వాదనకు ప్రస్తుత పరిస్థితులే అద్దం పడుతున్నాయి. హెచ్‌ఎండిఏ పరిధిలో ఏవైనా అనుమతుల జారీ చేయాలంటే రెవెన్యూ-ఇరిగేషన్ శాఖల జాయింట్ సర్వే అత్యంత కీలకం. నాలా అసలు పరిమితులు ఏమిటి..? నిర్మాణాలు నాలా పరిధిలోకి వచ్చాయా లేదా..? సర్వే లేకుండానే సంబంధిత అధికారులు కేవలం దస్త్రాల ఆధారంగా అనుమతులు ఇచ్చేసారా..? వాస్తవ పరిస్థితులను క్షేత్ర స్థాయిలో పరిశీలించకుండానే గుడ్డిగా నిర్మాణ అనుమతులు జారీ చేసారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా నాలా ఉనికిపైనే తీవ్ర వివాదం కొనసాగుతుండగా జాయింట్ సర్వే రిపోర్టును బహిర్గతం చేస్తే వాస్తవాలు బట్టబయలు అవుతాయని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల అనుమానాలను నివృత్తి చేయాలంటే అనుమతుల జారీకి ముందు నిర్వహించిన పరిశీలనలు, సర్వే నివేదికలు, సంబంధిత శాఖల అభిప్రాయాలను బహిరంగపరచాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

**ఇరిగేషన్ చట్టాలకు తూట్లు..!**

నీటి వనరులను కంటికి రెప్పలా కాపాడాల్సిన ఇరిగేషన్ అధికారులు ఇరిగేషన్ చట్టాలను తుంగలో తొక్కుతున్నారనే బహిరంగ ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. నాలాలు, వాగులు, చెరువులు వంటి జలవనరులను రక్షించేందుకు ప్రభుత్వం స్పష్టమైన చట్టాలు, మార్గదర్శకాలు అమలు చేస్తోంది. ముఖ్యంగా సహజ నీటి ప్రవాహ మార్గాలను అడ్డుకోవడం, మళ్లించడం, ఆక్రమించడం చట్టవిరుద్ధం. అయినప్పటికీ కాప్రా నాలా విషయంలో ఈ నిబంధనలు ఎంతవరకు అమలయ్యాయన్నది ప్రశ్నార్థకంగా మారింది. నాలా ఉనికిని గుర్తించకుండా, దాని పరిమితులను కాపాడకుండా నిర్మాణాలకు అనుమతులు జారీ వెనుక భారీ స్థాయిలో ముడుపులు ముట్టడం వల్లనే ఇరిగేషన్ శాఖ నుంచి అభ్యంతరాలు లేకుండా అక్రమార్కులు బహుళ అంతస్థుల నిర్మాణాలు కొనసాగిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు.

**ప్రజల ప్రాణాలతో చెలగాటమా..?**

సహజ నీటి ప్రవాహ మార్గాలను ధ్వంసం చేయడం వల్ల కలిగే నష్టం ఒక్కరోజులో బయటపడదు. కానీ భవిష్యత్ తరాలకు ఇది శాపంగా మారనుంది. భారీ వర్షాలు కురిసిన సమయంలో దాని ప్రభావం తీవ్రంగా ఉంటుందని పర్యావరణ వేత్తలు ఆక్షేపిస్తున్నారు. నీరు తన సహజ మార్గాన్ని కోల్పోతే అది సమీప కాలనీలు, రోడ్లు, నివాస ప్రాంతాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని, ఇప్పటికే హైదరాబాద్‌లో గతంలో జరిగిన వరదల నుంచి పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం ఉన్నప్పటికీ కొందరు స్వలాభాల కోసం నిబంధనలను గాలికొదిలేసి సహజ వనరులను నాశనం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ప్రయోజనం ఏముంటుందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**హైడ్రా ఉక్కుపాదం మోపాలంటున్న స్థానికులు..!**

కాప్రా చెరువు నాలా దురాక్రమణలు, ఇరిగేషన్, రెవెన్యూ ఎన్‌వోసీల జారీ, హెచ్‌ఎండీఏ అనుమతుల వ్యవహారంపై హైడ్రా క్షేత్రస్థాయిలో బహిరంగ విచారణ జరిపి, నాలా అసలు స్వరూపాన్ని గుర్తించి ఆక్రమణలను తొలగించడంతో పాటు, నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు జారీ చేసిన అధికారులు, అక్రమ నిర్మాణాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలలో చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూముల ఆక్రమణల విషయంలో రాజీ లేకుండా వ్యవహరిస్తున్న హైడ్రా.. కాప్రా సర్కిల్ రాజరాజేశ్వరినగర్ కాలనీ కాప్రా చెరువు అలుగు పక్కన జరుగుతున్న నాలా దురాక్రమణలపై కూడా అదే స్థాయిలో ఉక్కుపాదం మోపాలని స్థానికులు ముక్తకంఠంతో విజ్ఞప్తి చేస్తున్నారు. రానున్న వర్షాకాలానికి ముందే ఆక్రమణలను తొలగించి సహజ నీటి ప్రవాహాన్ని పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# ఢిల్లీలో సీజేపీ నిరసనఅడ్డుకోలేమన్న హైకోర్టు

**ఢిల్లీ, మహా** : ఎన్నికల అక్రమాల ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) తలపెట్టిన నిరసనకు ఢిల్లీ హైకోర్టు అనుమతించింది. అక్టోబర్ 16 (శుక్రవారం) ఢిల్లీ నడిబొడ్డున ఉన్న కన్నాట్ ప్లేస్ సెంట్రల్ పార్క్‌లో జరగనున్న ఈ ఆందోళనను నిలువరించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. నిరసనను చట్టప్రకారం నియంత్రించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఢిల్లీ పోలీసులు ఇచ్చిన హామీని కోర్టు నమోదు చేసుకుంది. దసరా పండుగ సీజన్‌లో ఈ నిరసన వల్ల తమ వ్యాపారాలు దెబ్బతింటాయని, తద్వారా తీవ్రంగా నష్టపోతామని ఓ వీధి వ్యాపారి హైకోర్టును ఆశ్రయించారు. కన్నాట్ ప్లేస్ నిరసనలకు వేదిక కాదని, ఈ ఆందోళనను నిలిపివేయాలని ఆయన తరపు న్యాయవాది వాదించారు. అయితే, సీజేపీ కార్యకలాపాలను నియంత్రించేందుకు ఇప్పటికే తగిన చర్యలు తీసుకున్నామని అదనపు సొలిసిటర్ జనరల్ చేతన్ శర్మ కోర్టుకు విన్నవించారు. ఈ వాదనలు విన్న తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నితిన్ వాసుదేవ్ సాంబ్రే, జస్టిస్ సంజయ్ శర్మలతో కూడిన ధర్మాసనం, నిరసనను నిలిపివేయడానికి నిరాకరించింది. మరోవైపు, సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే గురువారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఎన్నికల అక్రమాలపై గళమెత్తుతున్న విద్యార్థులు, యువతను పోలీసులు ఈడ్చిపారేస్తున్నారని ఆరోపించారు. వారికి మద్దతుగా వచ్చిన రాహుల్ గాంధీ, మమతా బెనర్జీ, అరవింద్ కేజ్రీవాల్ వంటి ప్రతిపక్ష నేతలను సైతం నిర్బంధించారని విమర్శించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను ప్రధాని మోదీ వెనకేసుకొస్తున్నారని ఆయన ఆరోపించారు.

# అక్రమ షెడ్డును కూల్చేదెన్నడు...!

**శామీర్‌పేట, (మహా):** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, శామీర్‌పేట మండలం, కీసర సర్కిల్, తూంకుంట డివిజన్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా, ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న ఓ భారీ అక్రమ షెడ్డు వ్యవహారం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. హైదరాబాద్-కరీంనగర్ రాజీవ్ రహదారికి ఆనుకుని అంబేద్కర్ విగ్రహం పక్కనే సుమారు ఎకరం విస్తీర్ణంలో వాణిజ్య సముదాయం కోసం ఈ షెడ్డు నిర్మిస్తున్నారని పలుమార్లు స్థానికులు ఫిర్యాదు చేసినప్పటికీ, వార్త పత్రికలలో కథనాలు వెలువడినప్పటికీ, నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుని, అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు కేవలం నామమాత్రపు నోటీసులిచ్చి కాలం వెళ్ళదీస్తున్నారని స్థానికులు మండి పడుతున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారుల కనుసన్నల్లోనే ఈ అక్రమ షెడ్డు నిర్మాణం నడుస్తోందని వారు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు .



**డీ-మార్ట్ పేరుతో ప్రచారం..**

**జీరో పర్మిషన్‌తో నిర్మాణం!**

భారీ వాణిజ్య కార్యకలాపాల కోసం (డీమార్ట్ లేదా ఇతర రిటైల్ సంస్థల కోసం) ఈ షెడ్డును నిర్మిస్తున్నట్లు స్థానికంగా జోరుగా ప్రచారం జరుగుతోంది. అయితే, ఈ భారీ వాణిజ్య నిర్మాణానికి ప్లాన్ అప్రూవల్, ల్యాండ్ యూజ్ (భూ వినియోగం) మార్పిడి, ఇతర చట్టబద్ధమైన అనుమతులు ఏవీ తీసుకోకుండానే 'జీరో పర్మిషన్'తో నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

**ముడుపుల మత్తులో టౌన్ ప్లానింగ్ యంత్రాంగం...?**

చిన్నపాటి ఇళ్ల నిర్మాణాలు జరిగితేనే అనుమతుల పేరుతో హడావుడి చేసే టౌన్ ప్లానింగ్ అధికారులు.. ఇంత పెద్ద వాణిజ్య నిర్మాణం కళ్లెదుట జరుగుతున్నా అటువైపు కన్నెత్తి చూడకపోవడం అనేక సందేహాలకు తావిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిర్మాణదారుల నుంచి భారీగా ముడుపులు ముట్టడం వల్లే టౌన్ ప్లానింగ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ నిర్లక్ష్య ధోరణి కారణంగా ప్రభుత్వానికి రావాల్సిన లక్షలాది రూపాయల అభివృద్ధి ఛార్జీలు, పన్నుల రూపంలో భారీగా ఆదాయానికి గండి పడుతోందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రారంభానికి సిద్ధమవుతున్న భారీ షెడ్డు..!**

గతంలో తూంకుంట మున్సిపాలిటీగా ఉన్న సమయంలో అక్రమ నిర్మాణాలకు కొంతమేర అడ్డుకట్ట పడేదని స్థానికులు పేర్కొంటున్నారు. అయితే మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పడిన తర్వాత తూంకుంట కీసర సర్కిల్ పరిధిలోకి రావడంతో అక్రమార్కుల ఆగడాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోందని వారు ఆరోపిస్తున్నారు.







భారీ షెడ్డు నిర్మాణం తుది దశకు చేరుకుని ప్రారంభానికి సిద్ధమవుతోందని, ఇప్పటికైనా టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించి, అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడంతో పాటు నిర్మాణం పూర్తయిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే, అనుమతులు లేకుండా నిబంధనలను ఉల్లంఘిస్తూ కొనసాగుతున్న అక్రమ షెడ్డు నిర్మాణాన్ని ప్రారంభంలోనే అడ్డుకోవాలని, పనులను నిలిపివేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**ఎంఎంసీ కమిషనర్ స్పందించాలి..!**

తూంకుంటలో కొనసాగుతున్న భారీ షెడ్డు నిర్మాణంపై ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి తక్షణమే స్పందించి, ఈ వ్యవహారంలో టౌన్ ప్లానింగ్ అధికారులు భారీగా ముడుపులు తీసుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో స్పెషల్ టాస్క్‌ఫోర్స్ అధికారులను రంగంలోకి దింపి క్షేత్రస్థాయి విచారణ జరిపించాలని స్థానికులు కోరుతున్నారు. గతంలో వచ్చిన ఫిర్యాదులు, వార్తా కథనాలపై అధికారులు తీసుకున్న చర్యలేమిటో సమీక్షించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కేవలం నోటీసులతో సరిపెట్టకుండా, అక్రమ నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేసి, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ద్వారా అక్రమ షెడ్డును కూల్చివేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# రూ.1.20 లక్షల లంచంతో ఏసీబీకి చిక్కిన విద్యుత్ శాఖ ఏఈ

**రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డ వైనం**

**హైదరాబాద్, మహా :** ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతికి పాల్పడే అధికారులపై ఏసీబీ కొరడా ఝుళిపిస్తోంది. ఈ క్రమంలో హైదరాబాద్‌లోని సంతోష్‌నగర్ సబ్ డివిజన్ పరిధిలో ఉన్న మదన్నపేట సెక్షన్‌కు చెందిన అసిస్టెంట్ ఇంజినీర్ పండల సంధ్య రాకేష్ రూ.1.20 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఏసీబీ సిటీ రేంజ్ II అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫిర్యాదుదారునికి పాత విద్యుత్ మీటర్లు పోయిన స్థానంలో ఆరు కొత్త విద్యుత్ మీటర్లు మంజూరు చేయడంతో పాటు, వాటికి సంబంధించిన ఆన్‌లైన్ దరఖాస్తులను ఆమోదించేందుకు అధికారి రూ.1,20 లక్షల లంచం డిమాండ్ చేశారు. ఈ మొత్తాన్ని స్వీకరిస్తుండగా గురువారం ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. పట్టుబడ్డ అధికారిని నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక న్యాయ స్థానం ముందు హాజరు పరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించే ప్రక్రియ చేపట్టారు.

# పాకిస్థాన్‌లో ఘోర విషాదం

**పెషావర్, మహా** : పాకిస్థాన్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. వాయవ్య పాకిస్థాన్‌లోని పెషావర్ నగరంలో భారీ వర్షాల కారణంగా పాఠశాల పైకప్పు కూలిపోవడంతో 28 మంది చిన్నారులు, ఒక ఉపాధ్యాయుడు ప్రాణాలు కోల్పోయారు. ఈ దుర్ఘటనలో కనీసం 47 మంది పిల్లలు గాయపడినట్లు అధికారులు వెల్లడించారు. శిథిలాల కింద మరికొందరు చిక్కుకుని ఉండవచ్చనే అనుమానంతో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. పెషావర్‌లోని అల్ ఖైర్ పబ్లిక్ స్కూల్ రెండంతస్తుల భవనం పైకప్పు రాత్రంతా కురిసిన భారీ వర్షాలకు బలహీనపడి కూలిపోయింది. స్థానిక రెస్క్యూ సేవల అధికారి బిలాల్ అహ్మద్ ఈ వివరాలను వెల్లడించారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని శిథిలాల కింద చిక్కుకున్న వారిని గుర్తించి బయటకు తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టాయి.



**47 మంది చిన్నారులకు గాయాలు**

ఈ ప్రమాదంలో గాయపడిన కనీసం 47 మంది పిల్లలను చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రులకు తరలించినట్లు పెషావర్‌లోని లేడీ రీడింగ్ ఆసుపత్రి ప్రతినిధి ఆసిమ్ ఖాన్ తెలిపారు. గాయపడిన వారికి వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రమాద తీవ్రత నేపథ్యంలో సహాయక సిబ్బంది శిథిలాలను తొలగిస్తూ బాధితుల కోసం గాలింపు కొనసాగిస్తున్నారు. ప్రమాద స్థలానికి సంబంధించిన వీడియోల్లో ఇరుకైన వీధుల గుండా అంబులెన్సులు వెళ్తుండగా, పాఠశాల భవనం వెలుపల పెద్ద సంఖ్యలో స్థానికులు గుమిగూడిన దృశ్యాలు కనిపించాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు కూడా సహాయక చర్యల్లో పాల్గొన్నారు. అత్యవసర సిబ్బంది కొద్ది నిమిషాల్లోనే అక్కడికి చేరుకున్నట్లు అసోసియేటెడ్ ప్రెస్ పేర్కొన్న ప్రత్యక్ష సాక్షుల కథనాలు వెల్లడించాయి.

**దర్యాప్తునకు అధ్యక్షుడు ఆదేశం**

ఈ ఘటనపై పాకిస్థాన్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదాన్ని హృదయ విదారక విషాదంగా అభివర్ణిస్తూ, ఘటనకు గల కారణాలపై సమగ్ర దర్యాప్తు జరపాలని కోరారు. "ఈ విషాద సమయంలో బాధిత కుటుంబాల దుఃఖంలో దేశం మొత్తం పాలుపంచుకుంటోంది" అని అధ్యక్షుడి కార్యాలయం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పేర్కొంది.

**భవన నిర్మాణ నాణ్యతపై ఆందోళనలు**

పాకిస్థాన్‌లో భవనాలు కూలిపోతున్న ఘటనలు తరచూ చోటుచేసుకుంటుండటం ఆందోళన కలిగిస్తోంది. నిర్మాణ నిబంధనల అమలులో లోపాలు, నాణ్యత లేని నిర్మాణ సామగ్రి వినియోగం వంటి అంశాలు ఇలాంటి ప్రమాదాలకు కారణమవుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. తాజా ఘటనతో పాఠశాల భవనాల భద్రత, నిర్మాణ ప్రమాణాల అమలుపై మరోసారి ప్రశ్నలు తలెత్తాయి. ఇటీవలే పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో జరిగిన అగ్నిప్రమాదంలో కనీసం 14 మంది నవజాత శిశువులు మరణించారు. ఆసుపత్రి మూడో అంతస్తులోని శిశువుల వార్డులో మంటలు చెలరేగి వేగంగా వ్యాపించడంతో, అక్కడ చికిత్స పొందుతున్న 15 మంది శిశువుల్లో ఒక్కరిని మాత్రమే సిబ్బంది రక్షించగలిగినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనపై జరిగిన విచారణలో శిశువుల వార్డులో ఫైర్ అలారం, స్ప్రింక్లర్ వ్యవస్థలు లేవని గుర్తించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే విధానాలు, సిబ్బందికి ఇచ్చిన శిక్షణలోనూ లోపాలు ఉన్నట్లు విచారణలో వెల్లడైంది.

ఇదిలా ఉండగా, ఈ ఏడాది జూలైలో తూర్పు పాకిస్థాన్‌లోని లాహోర్‌లో నిర్మాణంలో ఉన్న ఓ షన్ సెంటర్ పైకప్పు కూలిపోవడంతో కనీసం 14 మంది విద్యార్థులు మరణించారు. వరుసగా చోటుచేసుకుంటున్న ఈ విషాద ఘటనలు పాకిస్థాన్‌లో పాఠశాలలు, ఆసుపత్రులు సహా ప్రజలు వినియోగించే భవనాల భద్రతపై తీవ్ర ఆందోళనలను రేకెత్తిస్తున్నాయి. నిర్మాణ నిబంధనలను కఠినంగా అమలు చేయడంతో పాటు అత్యవసర భద్రతా ప్రమాణాలను పటిష్ఠం చేయాల్సిన అవసరాన్ని ఈ ప్రమాదాలు మరోసారి గుర్తుచేస్తున్నాయి.

# ఏపీలో ఎన్నికల జోరు

( మొదటి పేజీ తరువాయి )

జాబితాను విడుదల చేసింది. మొత్తం 27 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా, సామాజిక సమీకరణాలు, మహిళా ప్రాతినిధ్యానికి పెద్దపీట వేసినట్లు స్పష్టమవుతోంది.

| |
|---|
| **7 కార్పొరేషన్లకు మేయర్ అభ్యర్థులు వీరే** |
| వైసీపీ ప్రకటించిన జాబితా ప్రకారం, ఏడు కీలక నగర పాలక సంస్థలకు మేయర్ అభ్యర్థులను ఖరారు చేశారు. |
| విజయనగరం (అన్‌రిజర్వ్‌డ్ మహిళ): కోలగట్ల శ్రావణి (వైశ్య) |
| విశాఖపట్నం (అన్‌రిజర్వ్‌డ్ మహిళ): వరుదు కల్యాణి (కాపు వెలమ) |
| ఏలూరు (బీసీ): గంటా మోహన్ రావు (తూర్పు కాపు) |
| మచిలీపట్నం (బీసీ మహిళ): లంకా జ్యోతి (తూర్పు కాపు) |
| ఒంగోలు (అన్‌రిజర్వ్‌డ్): కుప్పం ప్రసాద్ (వైశ్య) |
| నెల్లూరు (అన్‌రిజర్వ్‌డ్): ఆనం విజయ్ కుమార్ రెడ్డి (రెడ్డి) |
| కడప (అన్‌రిజర్వ్‌డ్ మహిళ): బండి దీప్తిరెడ్డి (రెడ్డి) |
| మున్సిపాలిటీలు, నగర పంచాయతీల ఛైర్మన్ అభ్యర్థులు: |
| రాష్ట్రవ్యాప్తంగా 14 మున్సిపాలిటీలు, 6 నగర పంచాయతీలకు ఛైర్మన్ అభ్యర్థులను పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. |
| **మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థుల జాబితా:** |
| ఇచ్ఛాపురం (బీసీ మహిళ): పిలక రాజ్యలక్ష్మి (రెడ్డిక) |
| పలాసకాశీబుగ్గ (అన్‌రిజర్వ్‌డ్ మహిళ): తలసు శ్రీ పద్మ (కళింగ వైశ్య) |
| నర్సీపట్నం (బీసీ మహిళ): చింతకాయల అనిత (కాపు వెలమ) |
| యలమంచిలి (అన్‌రిజర్వ్‌డ్ మహిళ): బొద్దపు తులసి (కాపు) |
| తుని (బీసీ మహిళ): పిట్ల రామ తులసి (శెట్టిబలిజ) |
| కొవ్వూరు (అన్‌రిజర్వ్‌డ్ మహిళ): మన్నె పద్మ (కమ్మ) |
| రామచంద్రాపురం (బీసీ): చింతపల్లి నాగేశ్వరరావు (శెట్టిబలిజ) |
| కొండపల్లి (ఎస్సీ మహిళ): నల్లమోతు తేజస్విని (మాదిగ) |
| తెనాలి (అన్‌రిజర్వ్‌డ్): మద్దాలి శేషాచలం (వైశ్య) |
| చీరాల (ఎస్సీ మహిళ): డాక్టర్ ఇస్తార్ల షెర్లీ (మాల) |
| బద్వేల్ (అన్‌రిజర్వ్‌డ్): రాచపూడి వెంకట సాయి కృష్ణ (వైశ్య) |
| ప్రొద్దుటూరు (అన్‌రిజర్వ్‌డ్): పొరెడ్డి నరసింహారెడ్డి (రెడ్డి) |
| పులివెందుల (అన్‌రిజర్వ్‌డ్ మహిళ): వైయస్ ప్రమీలమ్మ (రెడ్డి) |
| మదనపల్లె (బీసీ): జింకా చలపతి (బోయ) |
| **నగర పంచాయతీ ఛైర్మన్ అభ్యర్థులు:** |
| యలేశ్వరం (ఎస్సీ మహిళ): బదిరెడ్డి ఆశాలత (మాదిగ) |
| వుయ్యూరు (ఎస్సీ): పైడముక్కల దివ్య (మాదిగ) |
| గురజాల (అన్‌రిజర్వ్‌డ్): పోలు వీరారెడ్డి (రెడ్డి) |
| కనిగిరి (అన్‌రిజర్వ్‌డ్ మహిళ): పులి శాంతి రెడ్డి (రెడ్డి) |
| బుచ్చిరెడ్డిపాలెం (అన్‌రిజర్వ్‌డ్ మహిళ): షేక్ షకీలా బేగం (ముస్లిం) |
| కమలాపురం (అన్‌రిజర్వ్‌డ్ మహిళ): మార్జుల కవిత (రెడ్డి) |
| |
| పార్టీ విడుదల చేసిన ఈ జాబితాలో మహిళలకు అత్యధిక ప్రాధాన్యం కల్పించారు. మొత్తం 27 స్థానాల్లో 14 స్థానాలు మహిళలకే కేటాయించడం విశేషం. అదేవిధంగా, బీసీ, ఎస్సీ, మైనారిటీ వర్గాలకు కూడా గణనీయమైన సంఖ్యలో అవకాశాలు ఇచ్చారు. ఈ ప్రకటనతో ఆయా నగరాలు, పట్టణాల్లో ఎన్నికల సందడి అధికారికంగా మొదలైంది. పార్టీ ప్రకటించిన అభ్యర్థులు త్వరలోనే నామినేషన్లు దాఖలు చేసి, ప్రచార బరిలోకి దిగనున్నారు. |



# న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరు

**న్యూఢిల్లీ, మహా** : కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నేతృత్వంలో విపక్ష నేతలు చేపట్టిన పాదయాత్రపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. రాజకీయ నిరసనలతో న్యాయస్థానంపై ఒత్తిడి తీసుకురావాలని చూడటం సరికాదని స్పష్టం చేసింది. న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరని వ్యాఖ్యానించింది. ఆ వ్యవహారంలో రాహుల్ గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ సహా సంబంధిత పిటిషనర్లకు నోటీసులు జారీ చేసింది. మరోవైపు, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై విపక్ష నేతలు దాఖలు చేసిన పిటిషన్‌పై ఎన్నికల సంఘం వివరణ కోరింది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ 'మార్చ్ ఫర్ డెమోక్రసీ' పేరుతో అక్టోబర్ 12న ఇండియా కూటమి నేతలు సుప్రీంకోర్టు వరకు పాదయాత్ర చేపట్టారు. ఈ ర్యాలీలో పలువురు విపక్ష నేతలతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం ఓటర్ల జాబితా సవరణలో ఎన్నికల సంఘం వ్యవహరిస్తున్న తీరును సవాల్ చేస్తూ అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై గురువారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా రాజకీయ పాదయాత్రలు న్యాయస్థానం వరకు రావడంపై ధర్మాసనం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇలాంటి చర్యలు ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేసింది. న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరని పేర్కొంది.పిటిషన్‌పై నోటీసులు జారీ చేసినంత మాత్రాన రాజకీయ నేతల ప్రవర్తనను సమర్థించినట్లు కాదని ధర్మాసనం స్పష్టం చేసింది. పాదయాత్ర, నిరసనలకు సంబంధించిన అంశాలపై దాఖలైన పిటిషన్లను విచారించిన సుప్రీంకోర్టు, రాహుల్ గాంధీ, అఖిలేశ్ యాదవ్ సహా సంబంధిత పిటిషనర్ల నుంచి వివరణ కోరింది. పిటిషనర్లలో ఒకరి వ్యవహారశైలిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ప్రత్యేకంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. తదుపరి విచారణ సమయంలో ఆయన తీరుపై ప్రశ్నలు అడుగుతామని తెలిపారు. ఆ పిటిషనర్ తన ప్రవర్తనపై వివరణ ఇచ్చే వరకు ఆయన తరఫున జారీ చేసిన నోటీసును తాత్కాలిక ప్రాతిపదికన పరిగణనలోకి తీసుకుంటామని పేర్కొన్నారు.

**ఈసీకి నోటీసులు**

ఇదిలా ఉండగా, ఓటర్ల జాబితాలో భారీగా పేర్లు తొలగిస్తున్నారంటూ రాహుల్ గాంధీతో పాటు ఇండియా కూటమి నేతలు మరో పిటిషన్ దాఖలు చేశారు. ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయని వారు ఆరోపించారు. ఈ పిటిషన్‌పై స్పందించిన సుప్రీంకోర్టు, ఎన్నికల సంఘం, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషికి నోటీసులు జారీ చేసింది. ఓటర్ల జాబితా నుంచి అర్హులైన వారి పేర్లను తొలగించకుండా చర్యలు తీసుకోవాలని పిటిషనర్లు కోరారు. ఎవరి పేరునైనా తొలగించే ముందు నోటీసు ఇవ్వాలని, తమ వాదన వినిపించుకునే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. తొలగించిన ఓటర్ల వివరాలను బూత్‌ల వారీగా ప్రచురించడంతో పాటు, పేర్లు తొలగించడానికి గల కారణాలను వెల్లడించాలని కోరారు. SIR ప్రక్రియలో జరిగిన మార్పులు, తొలగింపులపై స్వతంత్ర కమిటీతో విచారణ జరిపించాలని ప్రతిపాదించారు. ఈ వ్యవహారంపై తుది నిర్ణయం తీసుకునే వరకు కొనసాగుతున్న సవరణ ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేయాలని కూడా పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, ఎన్సీపీ (శరద్ పవార్) నేత సుప్రియా సూలే, శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ తదితరులు ఉన్నారు.

**జంతర్ మంతర్ విషయంపై విచారణ**

మరోవైపు, దిల్లీలో నిరసనలకు వేదికగా ఉన్న జంతర్‌మంతర్‌ను అధికారిక నిరసన ప్రదేశంగా గుర్తించడాన్ని ఉపసంహరించడంపై దాఖలైన పిటిషన్‌నూ సుప్రీంకోర్టు విచారించింది. ఆ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వానికి, సంబంధిత అధికారులకు నోటీసులు జారీ చేసింది. నిరసనల సందర్భంగా చోటుచేసుకున్న ఘటనలకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలను, సుప్రీంకోర్టు ప్రాంగణంలోని రికార్డింగ్‌లతో సహా భద్రపర్చాలని ఆదేశించింది.

# ఇక గడ్డుపరిస్థితే

(మొదటి పేజీ తరువాయి )

ప్రయత్నిస్తున్నామని తెలిపారు.

**యాసంగిలో వరి పంట వేయొద్దు**

కేంద్రం నుంచి ఎలాంటి సహాయం పొందాలనే అంశంపై చర్చించామని, గతేడాది ఈ సమయానికి 400 టీఎంసీలకు పైగా అందుబాటులో ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ ఏడాది అన్ని రిజర్వాయర్లలో కలిపి 209 టీఎంసీలు మాత్రమే ఉన్నాయని అన్నారు. ఎప్పుడు కరవు వచ్చినా ఈ దేశాన్ని ఆదుకున్నది రైతులు మాత్రమే అని కొనియాడారు. అందుబాటులో ఉన్న నీటినే పొదుపుగా వాడుకోవాలని, నీటి కొరతను దృష్టిలో పెట్టుకుని యాసంగి పంటలు తగ్గించుకోవాలని, ఈ సీజన్‌లో పంటలు పండించటాన్ని వాయిదా వేసుకోవాలని, పెద్ద మనసు చేసుకుని యాసంగిలో వరి పంట వేయొద్దని విజ్ఞప్తి చేశారు. ఉన్న నీటిని తాగునీటి అవసరాలకే వాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, వచ్చే 8, 10 నెలలు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. రైతులను ఆదుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని, కృష్ణా బేసిన్‌లో నీటి నిల్వలు 72 శాతం తక్కువ ఉన్నాయిని, గోదావరి బేసిన్‌లో నీటినిల్వలు 40 శాతం తక్కువ ఉన్నాయని వెల్లడించారు. చలికాలం రాకముందే రిజర్వాయర్లు ఎండిపోతున్నాయని, రిజర్వాయర్ల నుంచి 24వేల గ్రామాలకు తాగునీరు అందించాల్సి ఉందని, నీటి కొరత వల్ల 12 లక్షల ఎకరాల పంటలకు నష్టం జరిగే అవకాశం ఉందని, హైదరాబాద్‌కు నీరు అందించే జలశయాల్లో కూడా నీరు లేదని వివరించారు.




**కేంద్రం ఆదుకోవాలి**

ఎల్‌నినో కష్ట కాలంలో రాష్ట్రాలను కేంద్రం ఆదుకోవాలని, కేంద్ర రాష్ట్ర ప్రాయోజిత పథకాల్లో కేంద్ర నిధుల వాటా పెంచాలని సీఎం కోరారు. కేంద్రం నుంచి అధిక నిధులు పొందే కార్యాచరణ రూపొందించాలని ఆదేశించామని తెలిపారు. రాష్ట్రానికి అదనపు విద్యుత్‌ను ఇవ్వాలని కేంద్రాన్ని కోరారు. విద్యుత్‌పై ఇచ్చే సబ్సీడీలను పెంచాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. కొవిడ్ సమయంలో ప్రధాని మోదీ చెప్పినవి చేశామని, కష్టకాలంలో రాజకీయాలు చేయకుండా ఏం చెప్పినా చేశామని అన్నారు. ఇప్పుడు విపక్షాలు కూడా రాజకీయం చేయకుండా ప్రభుత్వంతో కలిసి రావాలని పిలుపునిచ్చారు. ప్రకృతి విపత్తును జయించడానికి అందరి సహకారం కావాలని, దుష్ప్రచారాలను నమ్మకుండా అందరూ సంయమనంతో ఉండాలని తెలిపారు. యాసంగిలో ఆరుతడి పంటలు మాత్రమే వేసుకోవాలని రైతులకు రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఎండల తీవ్రత వల్ల విద్యుత్ వినియోగం విపరీతంగా పెరిగిందని, సగటుపై అదనంగా 5వేల మెగావాట్ల విద్యుత్ వాడకం పెరిగిందని, మార్చిలో ఉండాల్సిన ఎండలు అక్టోబర్‌లోనే ఉన్నాయని తెలిపారు.

**అఖిలపక్షాలతో నేడు సమావేశం**

ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మంత్రులు, ఉన్నతాధికారులతో రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఎల్‌నినోపై సీఎం సలహాదారు రామకృష్ణారావు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఎల్‌నినో పరిస్థితులపై శుక్రవారం అఖిలపక్షాలతో తెలంగాణ ప్రభుత్వం చర్చించనుంది.

# కూటమి సీట్ల ఖరారు

**అమరావతి, మహా** : ఆంధ్రప్రదేశ్‌లో 2026 మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో అధికార కూటమి పార్టీల మధ్య సీట్ల పంపకానికి సంబంధించిన జాబితా విడుదలైంది.. తెలుగుదేశం పార్టీ (టీడీపీ), జనసేన పార్టీ (జనసేన), భారతీయ జనతా పార్టీ (బీజేపీ)ల మధ్య పట్టణ స్థానిక సంస్థలను పార్టీల వారీగా కేటాయించినట్లు ఈ జాబితాలో పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 17 మున్సిపల్ కార్పొరేషన్లు, 106 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు సంబంధించి ఈ పంపకాల వివరాలను పొందుపరిచారు. మొత్తం స్థానాల్లో జనసేన 4, బీజేపీకి 2 కార్పోరేషన్లు దక్కగా, టీడీపీ మిగతా 11 కార్పోరేషన్లలో పోటీచేయనుంది.




**కార్పొరేషన్లలో పార్టీల వారీగా కేటాయింపులు**

మున్సిపల్ కార్పొరేషన్ల విషయంలో కూటమి పార్టీలు పరస్పర అంగీకారంతో సీట్ల పంపకం చేసుకున్నట్లు జాబితా సూచిస్తోంది. విశాఖపట్నం, విజయనగరం, గుంటూరు, నెల్లూరు, కడప, కర్నూలు, తిరుపతి తదితర కార్పొరేషన్లను తెలుగుదేశం పార్టీకి కేటాయించినట్లు అందులో పేర్కొన్నారు. మరోవైపు విజయవాడ, కాకినాడ, ఏలూరు, శ్రీకాకుళం కార్పొరేషన్లను జనసేన పార్టీకి కేటాయించారు.. ఇక రాజమహేంద్రవరం, అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్లను భారతీయ జనతా పార్టీకి కేటాయించినట్లు జాబితాలో ఉంది. ఈ పంపకాలు అమలైతే రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీల మధ్య పోటీకి సంబంధించిన రాజకీయ సమీకరణాలు మరింత ఆసక్తికరంగా మారనున్నాయి.

**మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లోనూ సీట్ల సర్దుబాటు**

కార్పొరేషన్లతో పాటు మున్సిపాలిటీలు, నగర పంచాయతీల విషయంలోనూ టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య సీట్ల పంపకం జరిగింది.. రాష్ట్రంలోని వివిధ పట్టణాల్లో టీడీపీకి ప్రాధాన్యం కల్పించగా, జనసేనకు కొన్ని కీలక పట్టణాలను, బీజేపీకి మరికొన్ని పట్టణాలను కేటాయించారు..

**జనసేనకు కీలక కార్పొరేషన్లు**

జనసేన పార్టీకి శ్రీకాకుళం, కాకినాడ, ఏలూరు, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్లను కేటాయించారు.. ముఖ్యంగా విజయవాడ, కాకినాడ వంటి కీలక పట్టణాల్లో జనసేనకు అవకాశం కల్పించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ కేటాయింపులు ఆయా ప్రాంతాల్లో పార్టీ బలాన్ని పెంచుకునేందుకు ఎంతవరకు ఉపయోగపడతాయన్నది ఎన్నికల ఫలితాల తర్వాత స్పష్టమవుతుంది.

**బీజేపీకి రాజమహేంద్రవరం, అనంతపురం**

బీజేపీకి రాజమహేంద్రవరం, అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్లను కేటాయించినట్లు జాబితాలో ఉంది. కూటమిలో భాగంగా ఈ రెండు కార్పొరేషన్లను బీజేపీకి కేటాయించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ప్రాంతాల్లో పార్టీ తన రాజకీయ స్థావరాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్సి ఉంటుంది.

**కూటమి పార్టీల మధ్య.. సర్దుబాటు సమస్యలు**

పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్ల పంపకం కూటమి పార్టీల మధ్య సమన్వయానికి కీలకంగా మారనుంది. ఏ పార్టీకి ఏ కార్పొరేషన్ లేదా మున్సిపాలిటీ కేటాయించాలనే అంశం స్థానికంగా ఆయా పార్టీల బలం, నాయకుల ప్రాధాన్యం, ఎన్నికల వ్యూహాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ముఖ్యంగా విజయవాడ, కాకినాడ, ఏలూరు వంటి కార్పొరేషన్లలో జనసేనకు, రాజమహేంద్రవరం, అనంతపురంలో బీజేపీకి కేటాయింపులు ఉన్నట్లు పేర్కొనడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసే అంశంగా మారింది. మొత్తంగా, రాష్ట్రంలోని 17 మున్సిపల్ కార్పొరేషన్లు, 106 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు సంబంధించి కూటమి పార్టీల సీట్ల పంపకంపై జాబితాను ప్రకటించడంతో మున్సిపల్ ఎన్నికల రాజకీయాలు మరింత ఆసక్తికరంగా మారాయి.

# మోడీ సెల్యూట్

**న్యూఢిల్లీ, మహా** : ఆసియా క్రీడల్లో పతకాలతో మెరిసి దేశానికి గర్వకారణంగా నిలిచిన భారత క్రీడాకారులతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం ఢిల్లీలోని మేజర్ ధ్యాన్‌చంద్ స్టేడియంలో ఆత్మీయంగా ముచ్చటించారు. స్వర్ణ పతకాలు సాధించిన పురుషుల, మహిళల క్రికెట్ జట్లతో పాటు వివిధ క్రీడాంశాల్లో పతకాలు గెలిచిన అథ్లెట్లను అభినందించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు తమ విజయాలకు గుర్తుగా సంతకాలతో కూడిన జెర్సీలు, ఇతర జ్ఞాపికలను మోదీకి అందజేశారు. 17 ఏళ్ల యువ ఆర్చరీ క్రీడాకారిణి కుమ్‌కుమ్ మొహోద్ తన విల్లును ప్రధానమంత్రికి బహూకరించింది. అనంతరం భారత క్రీడా బృందంతో కలిసి మోదీ ఫొటోలు దిగారు. ఈ కార్యక్రమంలో క్రీడా సంఘాల ప్రముఖులు, వివిధ క్రీడా సమాఖ్యల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ఛైర్మన్ జై షా కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు.

**140 కోట్ల మంది గర్వించేలా చేశారు**

భారత క్రీడాకారులను ఉద్దేశించి మోదీ మాట్లాడుతూ.. ఆసియా క్రీడల్లో సాధించిన విజయాలు దేశ ప్రజలందరికీ గర్వకారణమన్నారు. భారత క్రీడాకారులు సాధించిన పతకాలు వారి వ్యక్తిగత ప్రతిభకు మాత్రమే కాకుండా దేశ సమష్టి గర్వానికి ప్రతీకలన్నారు. అంతర్జాతీయ వేదికలపై భారత జెండాను ఎగురవేయడం ద్వారా యువతకు స్ఫూర్తిగా నిలిచారని ప్రశంసించారు. “మీరు 140 కోట్ల మంది భారతీయులను గర్వపడేలా చేశారు. త్రివర్ణ పతాకాన్ని ప్రపంచ వేదికపై రెపరెపలాడించడమే అతిపెద్ద విజయం. అందుకే మీ విజయాలు మీకే పరిమితం కావు.. కోట్లాది మంది దేశ ప్రజలకు చెందినవి. దేశం తరఫున మీ అందరికీ అభినందనలు” అని పేర్కొన్నారు.




**మహిళా అథ్లెట్లకు ప్రత్యేక అభినందనలు**

ఆసియా క్రీడల్లో భారత్ సాధించిన 85 పతకాల్లో 38 పతకాలను మహిళా క్రీడాకారులే గెలుచుకున్నారని మోదీ గుర్తుచేశారు. వీటిలో 11 స్వర్ణ పతకాలు ఉండటం విశేషమని పేర్కొన్నారు. మహిళా అథ్లెట్లు చూపిన ప్రతిభ, పట్టుదల దేశానికి గర్వకారణమని అభినందించారు. క్రీడల్లో మహిళలు సాధిస్తున్న విజయాలు భారత క్రీడా రంగంలో వస్తున్న మార్పులకు నిదర్శనమని అన్నారు.

**హాకీ జట్ల విజయాలపై ప్రశంసలు**

భారత పురుషుల, మహిళల హాకీ జట్లు రెండూ స్వర్ణ పతకాలు సాధించడం ప్రత్యేక విజయమని మోదీ అన్నారు. ముఖ్యంగా 44 ఏళ్ల తర్వాత మహిళల హాకీ జట్టు స్వర్ణం గెలవడం దేశానికి చిరస్మరణీయ ఘట్టమని పేర్కొన్నారు. ఈ విజయం యావత్ దేశానికి ఆనందాన్ని కలిగించిందని ప్రశంసించారు. సమావేశంలో మహిళల క్రికెట్ జట్టు విన్నింగ్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ భారత క్రికెట్ జెర్సీని మోదీకి అందజేసింది. ఇతర క్రీడాకారులు కూడా తమ విజయాలకు గుర్తుగా ప్రత్యేక బహుమతులు ఇచ్చారు. ఆసియా క్రీడల్లో భారత పురుషుల క్రికెట్ జట్టు స్వర్ణ పతకాన్ని నిలబెట్టుకోగా, మహిళల జట్టు కూడా స్వర్ణం సాధించింది. యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ సహా క్రికెట్ జట్ల సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**85 పతకాలతో భారత్‌కు నాలుగో స్థానం**

2026 ఆసియా క్రీడల్లో భారత్ మొత్తం 85 పతకాలను సాధించి, పతకాల పట్టికలో నాలుగో స్థానంలో నిలిచింది. ఇందులో 21 స్వర్ణ, 27 రజత మరియు 37 కాంస్య పతకాలు ఉన్నాయి. భారత్ వరుసగా రెండోసారి పతకాల పట్టికలో మొదటి ఐదు స్థానాల్లో ఒకటిగా నిలిచింది. 2023 హాంగ్‌జౌ ఆసియా క్రీడల్లో 106 పతకాలను గెలుచుకున్న భారత్, జపాన్‌లోని ఐచినగోయాలో జరిగిన 2026 ఆసియా క్రీడల్లో 85 పతకాలను సాధించింది. ఈసారి, రికర్వ్ ఆర్చరీలో చారిత్రాత్మక విజయాలు, పురుషుల, మహిళల హాకీ జట్లకు స్వర్ణ పతకాలు, మహిళల ట్రాప్ ఈవెంట్‌లో మొట్టమొదటి స్వర్ణం వంటి ఘనతలు భారత్ ఖాతాలో చేరాయి. భారత అథ్లెట్లు సాఫ్ట్ టెన్నిస్, మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్‌లో కూడా మొదటిసారిగా పతకాలను సాధించారు. అంతేకాకుండా, ఈ క్రీడలలో భారతదేశం 28 ఏళ్ల నిరీక్షణకు తెరదించి వెయిట్‌లిఫ్టింగ్‌లో రజత పతకాన్ని గెలుచుకుంది, 64 ఏళ్లలో మొదటిసారిగా గ్రీకోరోమన్ రెజ్లింగ్‌లో ఒక ఫైనలిస్ట్‌ను అందించింది. ఈ సమావేశానికి క్రీడాకారులు, కోచ్‌లు, సహాయక సిబ్బంది, భారత ఒలింపిక్ సంఘం ప్రతినిధులు, జాతీయ క్రీడా సమాఖ్యల అధికారులు, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ప్రతినిధులు హాజరయ్యారు

## జైలర్ 2 అదుర్స్ రజనీ మ్యాజిక్

**మహా** : సూపర్ స్టార్ రజనీకాంత్ మరోసారి తన వింటేజ్ స్వాగ్‌తో వన్ మ్యాన్ షో చేశారు. విడుదలైన ప్రతీచోటా జైల్ 2 సూపర్ హిట్ టాక్ తెచ్చుకుంది. రజనీ కొత్తగా కష్టపడకపోయినా, జస్ట్ అలా స్టైల్‌గా నడుచుకుంటూ వచ్చి కళ్లజోడు తీసి పెట్టుకుంటే చాలు.. స్క్రీన్ మొత్తం ఊగిపోయేలా తన సిగ్నేచర్ మ్యాజిక్ చూపించారు. ఇక ఫస్టాఫ్‌లో డాన్ మూర్తి పాత్రలో నమో నారాయణ చేసే కామెడీ సినిమాకే మేజర్ హైలైట్‌గా నిలిచింది. పరిస్థితులు తన చేయి దాటిపోయినా సరే, అన్నీ తానే కంట్రోల్ చేస్తున్నట్టు బిల్డప్ ఇచ్చే అతని క్యారెక్టర్, రజనీతో కలిసి చేసే సీన్స్ కడుపుబ్బా నవ్విస్తాయి. జైలర్ 2 పర్ ఫెక్ట్ సీక్వెల్ గా బాక్సాఫీస్ ఎదుట గర్జించింది. ప్రేక్షకులను మెప్పించింది. మొదటి పార్ట్‌తోనే ఆడియన్స్ పల్స్ పట్టేసిన డైరెక్టర్ నెల్సన్, ఈ సీక్వెల్‌లో తనకు బాగా అలవాటైన పిచ్ మీద అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. హీరో క్యారెక్టరైజేషన్, అతని పవర్ ఏంటో ముందే అందరికీ తెలుసు కాబట్టి, లాజిక్స్ గురించి ఆలోచించకుండా పక్కా మాస్ ఎలివేషన్స్‌తో కథనాన్ని పరుగులు పెట్టించాడు. ముఖ్యంగా ఫస్టాఫ్ స్క్రీన్‌ప్లే అయితే నెక్స్ట్ లెవెల్‌లో కుదిరింది. నెల్సన్ తన మార్క్ డార్క్ కామెడీతో నవ్విస్తూనే, ప్రతీ పది నిమిషాలకు ఒక అదిరిపోయే హై మూమెంట్ ఇస్తూ థియేటర్లలో విజిల్స్ పడేలా చేశాడు. ఇంటర్వెల్ బ్లాక్ కూడా గూస్‌బంప్స్ తెప్పించేలా సెట్ అయింది. మొత్తంగా జైలర్ 2 దసరా సీజన్ లో తొలి హిట్ గా దుమ్మురేపింది. తొలి పార్ట్ 600కోట్ల కలెక్షన్లు సాధించగా, ఇది దానిని అధిగమించే అవకాశముందని ట్రేడ్ అంచనా.

## 24 లక్షల ఎకరాల అటవీ భూమి ఏమైంది?

**హైదరాబాద్, మహా** : తెలంగాణలో దాదాపు 24 లక్షల ఎకరాల అటవీ భూమి లెక్కల్లో వ్యత్యాసం కనిపిస్తోందని, ఆ భూమి ఏమైందో ప్రభుత్వం స్పష్టం చేయాలని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో లక్షలాది ఎకరాల ప్రభుత్వ, అసైన్డ్ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని, ప్రముఖ నాయకులే ఈ భూకబ్జాలకు పాల్పడుతున్నారని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో, పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా భూముల అక్రమాలకు సంబంధించిన గణాంకాలను ఆయన వివరించారు. అధికారిక రికార్డుల ప్రకారం రాష్ట్రంలో 66,33,313 ఎకరాల అటవీ భూమి ఉండాల్సి ఉండగా, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కేవలం 42.53 లక్షల ఎకరాలు మాత్రమే ఉన్నట్లు పేర్కొన్నారని మహేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ భారీ వ్యత్యాసంపై ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రభుత్వం అసైన్డ్ భూముల విక్రయానికి సిద్ధమవుతోందని, ఇది పేద ప్రజలకు తీరని అన్యాయం చేయడమేనని ఆయన విమర్శించారు. గతంలోని ధరణి పోర్టల్ నుంచి నేటి భూభారతి వరకు కేవలం పేర్లు మాత్రమే మారాయని, అక్రమాలు మాత్రం యథాతథంగా కొనసాగుతున్నాయని మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. గతంలో న్యాయస్థానం రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేసిన సెక్షన్ 22ఏను, ప్రభుత్వం కొన్ని సవరణలతో నేటికీ కొనసాగించడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిపై సీబీఐ విచారణ జరిపించేందుకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు వెనుకాడుతోందని ఆయన ప్రశ్నించారు.

## తిరుమలలో ఘాట్ రోడ్ లో ద్విచక్ర వాహనాలపై

**తిరుమల, మహా** : తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అక్టోబర్ 16న నిర్వహించనున్న గరుడవాహన సేవకు టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉండటంతో తిరుమలకు వెళ్లే రెండు ఘాట్ రోడ్లలో ద్విచక్ర వాహనాల రాకపోకలను తాత్కాలికంగా నిషేధించింది. అక్టోబర్ 15 రాత్రి 9 గంటల నుంచి అక్టోబర్ 17 ఉదయం 6 గంటల వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయి. శుక్రవారం సాయంత్రం 6.30 గంటలకు శ్రీవారి గరుడవాహన సేవ జరగనుంది. ఈ సేవను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తిరుమలకు చేరుకునే అవకాశం ఉన్ననేపథ్యంలో భద్రత, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. ఘాట్ రోడ్లపై వాహనాల రద్దీని నియంత్రించడంతో పాటు భక్తుల ప్రయాణం సురక్షితంగా సాగేందుకు అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ద్విచక్ర వాహనదారులు తమ వాహనాలను తిరుపతిలోని నిర్దేశిత పార్కింగ్ స్థలాల్లో నిలిపి, అక్కడి నుంచి ఆర్టీసీ బస్సుల్లో తిరుమలకు చేరుకోవాలని తిరుపతి జిల్లా ఎస్పీ సూచించారు.



# వేపపుల్లతో పళ్లు తోమితే నిజంగా ప్రయోజనమా?

**సంప్రదాయ పద్ధతిలో కొన్ని లాభాలు.. దంత వైద్యుల సూచనలు పాటించాలి**

పూర్వం గ్రామీణ ప్రాంతాల్లో వేపపుల్లతో పళ్లు తోముకోవడం సాధారణంగా కనిపించేది. ప్రస్తుతం టూత్‌బ్రష్, టూత్‌పేస్ట్‌ల వినియోగం పెరిగినప్పటికీ, సహజమైన పద్ధతులపై ఆసక్తితో కొందరు మళ్లీ వేపపుల్లను ఉపయోగిస్తున్నారు. అయితే వేపపుల్లతో పళ్లు శుభ్రం చేసుకుంటే దంత సమస్యలు పూర్తిగా దూరమవుతాయా? ఆధునిక దంత వైద్యం దీనిపై ఏమంటోంది? అనే సందేహాలు చాలామందిలో ఉన్నాయి. వేపలో కొన్ని బ్యాక్టీరియాలపై ప్రభావం చూపగల సహజ సమ్మేళనాలు ఉన్నప్పటికీ, వాటి ఆధారంగా అన్ని దంత సమస్యలను నివారించవచ్చని చెప్పలేం.

**వేపలో సహజ గుణాలు**

వేపలో యాంటీబ్యాక్టీరియల్ లక్షణాలు కలిగిన కొన్ని పదార్థాలు ఉన్నట్లు పరిశోధనలు సూచిస్తున్నాయి. వేపపుల్ల చివరను నమిలినప్పుడు ఏర్పడే పీచు దంతాల ఉపరితలాన్ని శుభ్రం చేయడంలో కొంత సహాయపడవచ్చు. అయితే వేపపుల్లతో పళ్లు తోముకోవడం వల్ల పుచ్చుపళ్లు పూర్తిగా నివారించబడతాయని నిర్ధారించే ఆధారాలు పరిమితంగా ఉన్నాయి.

**2. ప్లాక్ తొలగింపులో పరిమితులు**

దంతాలపై బ్యాక్టీరియా, ఆహార అవశేషాలు పేరుకుపోయి ప్లాక్ అనే పొర ఏర్పడుతుంది. దీన్ని సరిగా తొలగించకపోతే చిగుళ్ల వాపు, దంత క్షయం వంటి సమస్యలు రావచ్చు. వేపపుల్లతో కొన్ని ప్రాంతాలు శుభ్రపడినా, దంతాల మధ్య ఇరుక్కున్న పదార్థాలు పూర్తిగా తొలగకపోవచ్చు. దంతాల నొప్పి, చిగుళ్ల నుంచి రక్తస్రావం ఉంటే వైద్యుడిని సంప్రదించాలి.

**3. ఉపయోగించేటప్పుడు జాగ్రత్త**

వేపపుల్లను ఎంచుకునేటప్పుడు శుభ్రంగా, తాజాగా ఉన్నదానికే ప్రాధాన్యం ఇవ్వాలి. దాని చివరను పీచులా మార్చుకుని దంతాలను మృదువుగా శుభ్రం చేయాలి. గట్టిగా రుద్దడం, చిగుళ్లపై ఒత్తిడి పెట్టడం వల్ల గాయాలు ఏర్పడవచ్చు. అపరిశుభ్రమైన పుల్లలను ఉపయోగించకూడదు. ఇప్పటికే చిగుళ్ల సమస్యలు లేదా దంతాల సున్నితత్వం ఉన్నవారు ముందుగా దంత వైద్యుడి సలహా తీసుకోవాలి.

**4. ఫ్లోరైడ్ టూత్‌పేస్ట్ ప్రాధాన్యం**

ఫ్లోరైడ్ ఉన్న టూత్‌పేస్ట్ దంతాల ఎనామెల్‌ను బలపరిచి పుచ్చుపళ్ల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. అందుకే రోజుకు రెండుసార్లు ఫ్లోరైడ్ టూత్‌పేస్ట్‌తో పళ్లు తోముకోవాలని దంత వైద్యులు సూచిస్తారు. వేపపుల్లను ఉపయోగించినప్పటికీ, దానిని టూత్‌పేస్ట్‌కు పూర్తి ప్రత్యామ్నాయంగా భావించకూడదు. దంతాల మధ్య ప్రాంతాలను కూడా తగిన విధంగా శుభ్రం చేసుకోవాలి.

**5. రోజువారీ అలవాట్లే ముఖ్యం**

దంతాల ఆరోగ్యానికి తీపి పదార్థాలు, చక్కెర పానీయాల వినియోగాన్ని తగ్గించాలి. రోజూ రెండుసార్లు పళ్లు తోముకోవడం, దంతాల మధ్య శుభ్రత పాటించడం, క్రమం తప్పకుండా దంత వైద్య పరీక్షలు చేయించుకోవడం అవసరం. పంటి నొప్పి, చిగుళ్ల వాపు లేదా రక్తస్రావం ఉంటే ఇంటి చిట్కాలపై మాత్రమే ఆధారపడకూడదు. సంప్రదాయ పద్ధతులను పాటించినా ఆధునిక వైద్య సూచనలకు ప్రాధాన్యం ఇవ్వాలి. సరైన శుభ్రత, సమతుల్య ఆహారం, క్రమమైన పరీక్షలతో దంతాల ఆరోగ్యాన్ని మెరుగ్గా కాపాడుకోవచ్చు.

# రాజన్న సన్నిధిలో ఏడొద్దులకే బతుకమ్మ

- **వేములవాడలో ప్రత్యేక సంప్రదాయానికి కారణాలేమిటి...?**
- **పుట్టింటి అనుబంధమా.....? మెట్టినింటి ఆచారమా....?**
- **వేములవాడ బతుకమ్మకు ప్రత్యేక స్థానం....**






**వేములవాడ,మహా :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. ప్రకృతిలో లభించే రంగురంగుల పూలను సేకరించి బతుకమ్మలను పేర్చడం, వాటి చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ ఆటపాటలతో సంబరాలు చేసుకోవడం తెలంగాణ ఆడపడుచుల ప్రత్యేకత. సాధారణంగా తొమ్మిది రోజులపాటు నిర్వహించే బతుకమ్మ వేడుకలకు భిన్నంగా, రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడలో మాత్రం ఏడో రోజుకే సద్దుల బతుకమ్మను నిర్వహించడం ప్రత్యేక సంప్రదాయంగా కొనసాగుతోంది. రాజరాజేశ్వర స్వామి కొలువైన ఈ పుణ్యక్షేత్రంలో బతుకమ్మ వేడుకలు ఏడు రోజులకే ముగియడానికి గల కారణాలేమిటి? ఈ ఆచారం వెనుక చారిత్రక నేపథ్యం ఉందా? తరతరాలుగా కొనసాగుతున్న స్థానిక సంప్రదాయమే ఇందుకు కారణమా? అన్న అంశాలు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

**తొమ్మిది రోజులకు భిన్నంగా ఏడో రోజే వేడుకలు...**

తెలంగాణలో బతుకమ్మ పండుగను సాధారణంగా మహాలయ అమావాస్య నుంచి దుర్గాష్టమి వరకు తొమ్మిది రోజులపాటు నిర్వహిస్తారు. మొదటి రోజు ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభమయ్యే వేడుకలు, అటుకుల బతుకమ్మ, ముద్దపప్పు బతుకమ్మ, నానే బియ్యం బతుకమ్మ, అట్ల బతుకమ్మ, అలిగిన బతుకమ్మ, వేపకాయల బతుకమ్మ, వెన్న ముద్దల బతుకమ్మ మీదుగా చివరి రోజైన సద్దుల బతుకమ్మతో ముగుస్తాయి. అయితే వేములవాడలో ఏడో రోజుకే బతుకమ్మ వేడుకలను ముగించే సంప్రదాయం ఉండటం ఈ ప్రాంతానికి ప్రత్యేకతను తీసుకొచ్చింది. ఇతర ప్రాంతాల నుంచి వేములవాడకు వచ్చే వారిలోనూ ఈ ఆచారంపై ఆసక్తి కనిపిస్తోంది. అయితే రాష్ట్రవ్యాప్తంగా పాటించే తొమ్మిది రోజుల సంప్రదాయానికి, వేములవాడలో కొనసాగుతున్న ఏడు రోజుల ఆచారానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని అర్థం చేసుకోవాలంటే స్థానిక చరిత్ర, ఆచార వ్యవహారాలను పరిశీలించాల్సిన అవసరం ఉంది.

**పుట్టింటి అనుబంధం.. మెట్టినింటి సంప్రదాయంతో ముడిపడి ఉందా..?**

బతుకమ్మ పండుగకు మహిళల జీవితాలతో, కుటుంబ సంబంధాలతో విడదీయలేని అనుబంధం ఉంది. పెళ్లయిన ఆడపడుచులు పండుగ సమయాల్లో పుట్టింటికి చేరుకొని తల్లిదండ్రులు, తోబుట్టువులతో కలిసి బతుకమ్మ సంబరాల్లో పాల్గొనడం తెలంగాణలో చాలాచోట్ల కనిపించే సంప్రదాయం. అదే సమయంలో మెట్టినింటి బాధ్యతలు, కుటుంబ ఆచారాలు కూడా మహిళల పండుగ వేడుకల్లో భాగమవుతాయి. ఈ నేపథ్యంలో వేములవాడలో ఏడు రోజులకే బతుకమ్మను నిర్వహించడానికి పుట్టింటి, మెట్టినింటి అనుబంధమే కారణమనే వివరణ స్థానికంగా ప్రచారంలో ఉన్న కథనాల్లో వినిపిస్తుంది. అయితే ఈ కథనం వెనుక ఉన్న చారిత్రక ఆధారాలు, ఆచారాన్ని ప్రారంభించిన కాలం, దీనికి సంబంధించిన నిర్దిష్ట సంఘటనలపై విశ్వసనీయమైన ధ్రువీకరణ అవసరం. అందువల్ల దీనిని నిర్ధారిత చరిత్రగా కాకుండా పరిశీలించాల్సిన స్థానిక కథనంగా చూడాల్సి ఉంటుంది.

**తెలంగాణ సంస్కృతిలో వేములవాడ బతుకమ్మకు ప్రత్యేక స్థానం...**

బతుకమ్మ పండుగ తెలంగాణ మహిళల ఆత్మీయతకు, ప్రకృతితో మానవ సంబంధానికి, కుటుంబ బంధాలకు ప్రతీకగా నిలుస్తోంది. ప్రాంతానికో ప్రత్యేకత, గ్రామానికో ఆచారం ఉన్నప్పటికీ పండుగ వెనుక ఉన్న సాంస్కృతిక భావన మాత్రం ఒక్కటే. వేములవాడలో ఏడో రోజునే సద్దుల బతుకమ్మ నిర్వహించడం ఈ ప్రాంత సంప్రదాయాలపై ఆసక్తిని పెంచుతోంది. ఈ ఆచారం వెనుక ఉన్న కారణాలను చారిత్రక ఆధారాలతో వెలికితీసి ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉంది. స్థానిక సంప్రదాయాలను కాపాడటంతోపాటు వాటి చరిత్రను సేకరించి భవిష్యత్ తరాలకు అందించడం ద్వారా తెలంగాణ సంస్కృతి, వారసత్వాన్ని మరింత బలోపేతం చేయవచ్చు.

**రాజన్న క్షేత్రం.. ప్రత్యేక ఆచారాలకు నిలయం**

వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయం తెలంగాణలో ప్రసిద్ధ శైవ క్షేత్రంగా గుర్తింపు పొందింది. భక్తి, ఆధ్యాత్మికతతోపాటు స్థానిక ఆచారాలు, ఉత్సవాలు ఈ ప్రాంత సాంస్కృతిక జీవితంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఆలయాన్ని కేంద్రంగా చేసుకొని తరతరాలుగా కొనసాగుతున్న పండుగలు, జాతరలు, స్థానిక సంప్రదాయాలు ప్రజల జీవన విధానంతో మమేకమయ్యాయి. ఈ నేపథ్యంలో బతుకమ్మను ఏడు రోజులకే నిర్వహించే ఆచారం కూడా వేములవాడ ప్రాంతీయ సంస్కృతిలో భాగంగా ప్రాధాన్యతను సంతరించుకుంది. అయితే ఈ ఆచారం రాజన్న ఆలయానికి సంబంధించిన నిర్దిష్ట మతపరమైన నియమం వల్ల ఏర్పడిందా, లేక స్థానిక సమాజంలో కాలక్రమేణా స్థిరపడిన సంప్రదాయమా అన్నది తెలుసుకోవాలంటే ఆలయ పత్రాలు, పాత రికార్డులు, స్థానిక చరిత్రకారుల వివరాలను పరిశీలించాలి.

**సప్తమాతృకల ఆరాధనతో సంబంధం ఉందా?**

వేములవాడలో ఏడు రోజుల బతుకమ్మ సంప్రదాయాన్ని వివరిస్తూ కొందరు సప్తమాతృకల ఆరాధనతో సంబంధం ఉండవచ్చనే అభిప్రాయాన్ని ప్రస్తావిస్తుంటారు. బ్రాహ్మీ, మాహేశ్వరి, కౌమారి, వైష్ణవి, వారాహి, ఇంద్రాణి, చాముండి అనే ఏడుగురు మాతృకల ఆరాధన హిందూ సంప్రదాయాల్లో ప్రాధాన్యత కలిగి ఉంది. అయితే సప్తమాతృకల ఆరాధనకు, వేములవాడలో ఏడో రోజుకే బతుకమ్మ నిర్వహించడానికి ప్రత్యక్ష సంబంధం ఉందని నిర్ధారించే ఆధారాలు అందుబాటులో ఉన్నాయని చెప్పలేం. ఈ రెండింటి మధ్య సంబంధం ఉందనే వాదనను ధ్రువీకరించాలంటే ఆలయ చరిత్ర, స్థానిక పూజా విధానాలు, చారిత్రక ఆధారాలపై సమగ్ర పరిశీలన అవసరం.

# చిన్న వయసులోనే గుండెకు ముప్పు.. నిశ్శబ్దంగా పేరుకుపోతున్న కొవ్వు!

**ఆరోగ్యంగా కనిపిస్తున్నా అప్రమత్తత అవసరం.. జీవనశైలిలో మార్పులతోనే గుండెకు రక్షణ**

గుండె జబ్బులు అంటే వయసు పైబడిన వారికే వస్తాయని చాలామంది భావిస్తుంటారు. యువకులు, యువతులు తమకు ఎలాంటి అనారోగ్య సమస్యలు లేవని, రోజువారీ పనులు సజావుగా చేసుకుంటున్నామని నిర్లక్ష్యంగా ఉంటారు. అయితే రక్తనాళాల్లో జరిగే కొన్ని మార్పులు బయటకు ఎలాంటి లక్షణాలు కనిపించకుండానే ప్రారంభమవుతున్నాయని తాజా పరిశోధన వెల్లడిస్తోంది. ప్రముఖ వైద్య పరిశోధనా పత్రిక *ది న్యూ ఇంగ్లాండ్ జర్నల్ ఆఫ్ మెడిసిన్*లో ప్రచురితమైన అధ్యయనం ఈ అంశంపై మరోసారి దృష్టి సారించింది. చిన్న వయసులోనే రక్తనాళాల గోడల్లో కొవ్వు పదార్థాలు పేరుకుపోయే అథెరోస్క్లెరోసిస్ ప్రక్రియ మొదలయ్యే అవకాశం ఉందని పరిశోధకులు గుర్తించారు. దీర్ఘకాలంలో గుండెపోటు, ఇతర గుండె సంబంధిత సమస్యలకు దారితీసే ప్రమాద కారకాలను ముందుగానే గుర్తించడం ఎంత ముఖ్యమో ఈ అధ్యయనం తెలియజేస్తోంది.

**1. లక్షణాలు లేకుండానే రక్తనాళాల్లో మార్పులు**

అథెరోస్క్లెరోసిస్ అనేది రక్తనాళాల లోపలి గోడల్లో కొవ్వు, కొలెస్ట్రాల్, ఇతర పదార్థాలు కలిసి ఫలకాలుగా పేరుకుపోయే ప్రక్రియ. వీటిని ప్లాక్ అని పిలుస్తారు. ఈ నిల్వలు పెరుగుతున్న కొద్దీ రక్తనాళాల గోడల నిర్మాణం మారవచ్చు. కొన్ని సందర్భాల్లో రక్తప్రసరణకు ఆటంకం ఏర్పడే ప్రమాదం ఉంటుంది. అయితే ఈ ప్రక్రియ ప్రారంభ దశలో ఉన్నప్పుడు చాలామందికి ప్రత్యేకమైన లక్షణాలు కనిపించకపోవచ్చు. అందుకే శరీరం ఆరోగ్యంగా ఉన్నట్లు అనిపించినంత మాత్రాన రక్తనాళాల్లో ఎలాంటి సమస్యలు లేవని నిర్ధారించలేం. డెన్మార్క్, స్పెయిన్ దేశాల్లో నిర్వహించిన తాజా పరిశోధనలో 18 నుంచి 70 ఏళ్ల మధ్య వయసున్న 16,808 మందిని పరిశీలించారు. వీరిలో గతంలో గుర్తించిన గుండె సంబంధిత రక్తనాళాల వ్యాధులు లేనివారినే అధ్యయనంలో చేర్చారు. ఆధునిక ఇమేజింగ్ పరీక్షల ద్వారా రక్తనాళాల్లోని మార్పులను పరిశీలించగా, మొత్తం పాల్గొన్నవారిలో 57.1 శాతం మందికి నిశ్శబ్ద అథెరోస్క్లెరోసిస్ లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ ఫలితాలు ప్రతి ఒక్కరికీ గుండెపోటు వస్తుందని సూచించవు. అయితే లక్షణాలు కనిపించకముందే వ్యాధి ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశాన్ని మాత్రం స్పష్టం చేస్తున్నాయి.

**2. యువతలోనూ కనిపిస్తున్న కొవ్వు నిల్వలు**

ఈ పరిశోధనలో 18 నుంచి 29 ఏళ్ల వయసున్న వారిలోనూ రక్తనాళాల్లో కొవ్వు నిల్వలు గుర్తించడం గమనార్హం. ఈ వయసు విభాగంలో పురుషుల్లో 8.7 శాతం మందికి, మహిళల్లో 6.7 శాతం మందికి అథెరోస్క్లెరోసిస్ ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. వయసు పెరుగుతున్న కొద్దీ ఈ సమస్య కనిపించే అవకాశం, రక్తనాళాల్లో పేరుకుపోయే ఫలకాల పరిమాణం కూడా పెరుగుతున్నట్లు అధ్యయనం వెల్లడించింది. యువకుల్లో కనిపించిన మార్పులు చాలావరకు ఒకే ప్రాంతంలోని రక్తనాళాలకు పరిమితమై ఉండగా, వయసు పెరిగే కొద్దీ అనేక రక్తనాళాలకు సంబంధించిన సమస్యలు ఎక్కువగా కనిపించాయి. ఈ గణాంకాలను అర్థం చేసుకునేటప్పుడు ఒక విషయం గుర్తుంచుకోవాలి. అధ్యయనంలో గుర్తించిన రక్తనాళాల మార్పులు ఉన్న ప్రతి వ్యక్తికి భవిష్యత్తులో తప్పనిసరిగా గుండెపోటు వస్తుందని చెప్పలేం. వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితులు, రక్తపోటు, కొలెస్ట్రాల్, మధుమేహం, ధూమపానం, కుటుంబ చరిత్ర వంటి అనేక అంశాలు గుండె సంబంధిత ప్రమాదాన్ని ప్రభావితం చేస్తాయి. అయినప్పటికీ చిన్న వయసు నుంచే ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాల్సిన అవసరాన్ని ఈ ఫలితాలు గుర్తుచేస్తున్నాయి.

**3. చెడు కొలెస్ట్రాల్ పెరిగితే ప్రమాదమే**

శరీరానికి కొలెస్ట్రాల్ అవసరమే. కణాల నిర్మాణం, కొన్ని హార్మోన్ల తయారీ వంటి విధుల్లో ఇది పాత్ర పోషిస్తుంది. అయితే రక్తంలో ఎల్‌డీఎల్ (LDL) అనే చెడు కొలెస్ట్రాల్ అధికంగా ఉంటే రక్తనాళాల గోడల్లో పేరుకుపోయే ప్రమాదం పెరుగుతుంది. ఈ ప్రక్రియ ఒక్క రోజులో జరగదు. అనేక సంవత్సరాల పాటు కొనసాగవచ్చు. రక్తనాళాల గోడల్లో కొవ్వు పదార్థాలు చేరినప్పుడు శరీరంలోని రోగనిరోధక వ్యవస్థ స్పందించడం, అక్కడ వాపు ఏర్పడటం వంటి మార్పులు సంభవించవచ్చు. కాలక్రమేణా ప్లాక్ ఏర్పడి రక్తనాళాల పనితీరుపై ప్రభావం చూపవచ్చు. కొన్నిసార్లు ప్లాక్ చీలిపోవడం వల్ల రక్తం గడ్డకట్టి గుండెకు రక్తాన్ని సరఫరా చేసే ధమనిలో అడ్డంకి ఏర్పడవచ్చు. ఈ పరిస్థితి గుండెపోటుకు కారణమయ్యే అవకాశం ఉంది. కొలెస్ట్రాల్ పెరగడానికి ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం, అధిక బరువు, జన్యుపరమైన అంశాలు తదితరాలు కారణమవుతాయి. అందువల్ల బరువు సాధారణంగా ఉన్నవారు కూడా తమ వ్యక్తిగత ప్రమాద కారకాలను బట్టి వైద్యుల సలహా తీసుకోవడం మంచిది. కొలెస్ట్రాల్ స్థాయిలను పరీక్షల ద్వారా తెలుసుకోవడం, అవసరమైతే వైద్యుల సూచనల మేరకు చికిత్స పొందడం గుండె ఆరోగ్య పరిరక్షణలో కీలకమైన చర్యలు.

**4. ఆహారం, వ్యాయామమే ఆరోగ్యానికి పునాది**

మారుతున్న జీవనశైలిలో ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమకు ప్రాధాన్యం తగ్గిపోవడం ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది. ఎక్కువ సమయం కూర్చుని పనిచేయడం, నడకకు సమయం కేటాయించకపోవడం, అధిక కేలరీల ఆహారం తీసుకోవడం, నిద్రకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం వంటి అలవాట్లు గుండె జబ్బులకు సంబంధించిన ప్రమాద కారకాలను పెంచవచ్చు. ఈ పరిస్థితిని మార్చుకోవడానికి రోజువారీ ఆహారంలో కూరగాయలు, పండ్లు, తృణధాన్యాలు, పప్పుధాన్యాలు, పీచు పదార్థాలు ఉన్న ఆహారానికి ప్రాధాన్యం ఇవ్వాలి. అధికంగా నూనెతో తయారుచేసిన పదార్థాలు, ట్రాన్స్ ఫ్యాట్స్ ఉన్న ఆహారం, ఎక్కువ ఉప్పు, చక్కెర కలిగిన పానీయాలను పరిమితం చేయడం మంచిది. వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితులను బట్టి వైద్యుల సూచనలతో ఆహార ప్రణాళిక రూపొందించుకోవచ్చు. ఆరోగ్యపరమైన పరిమితులు లేని పెద్దలు వారానికి కనీసం 150 నిమిషాల మితమైన శారీరక వ్యాయామం చేయాలని సాధారణంగా సూచిస్తారు. వేగంగా నడవడం, సైకిల్ తొక్కడం, ఈత కొట్టడం వంటి కార్యకలాపాలను ఎంచుకోవచ్చు. ఎక్కువసేపు కూర్చుని పనిచేసేవారు మధ్యమధ్యలో లేచి నడవడం కూడా ఉపయోగకరం. ధూమపానానికి దూరంగా ఉండటం, మద్యపానాన్ని నివారించడం లేదా పరిమితం చేయడం, తగినంత నిద్రపోవడం, ఒత్తిడిని నియంత్రించుకోవడం వంటి అలవాట్లు కూడా గుండె ఆరోగ్యానికి తోడ్పడతాయి.

**5. ముందస్తు పరీక్షలు.. అప్రమత్తతే రక్షణ**

గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో ముందస్తు జాగ్రత్తలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. అధిక రక్తపోటు, మధుమేహం, అధిక కొలెస్ట్రాల్, అధిక బరువు ఉన్నవారు లేదా కుటుంబంలో చిన్న వయసులోనే గుండె జబ్బులు వచ్చిన చరిత్ర ఉన్నవారు వైద్యులను సంప్రదించి తగిన పరీక్షలు చేయించుకోవాలి. అవసరాన్ని బట్టి లిపిడ్ ప్రొఫైల్, రక్తంలో చక్కెర స్థాయిలు, రక్తపోటు వంటి అంశాలను పరిశీలిస్తారు. ప్రతి యువకుడికీ ప్రత్యేకమైన గుండె స్కానింగ్ పరీక్షలు అవసరమని భావించకూడదు. ఎవరికీ ఏ పరీక్ష అవసరమో వారి వయసు, లక్షణాలు, వైద్య చరిత్ర, ప్రమాద కారకాల ఆధారంగా వైద్యులు నిర్ణయిస్తారు. ఛాతీలో ఒత్తిడి లేదా నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, చల్లని చెమటలు, అకస్మాత్తుగా తల తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా అత్యవసర వైద్య సహాయం పొందాలి. ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవడం, క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవడం, వైద్యుల సూచనలు పాటించడం ద్వారా అనేక ప్రమాద కారకాలను నియంత్రించుకోవచ్చు. చిన్న వయసులోనే ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకోవడం భవిష్యత్తులో గుండె ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ఉపయోగపడుతుంది. గుండె జబ్బులు రాకుండా పూర్తిగా హామీ ఇవ్వలేకపోయినా, సరైన జాగ్రత్తలు వాటి ప్రమాదాన్ని తగ్గించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి.





# సీఈఆర్ క్లబ్‌లో ఘనంగా ఫ్యామిలీ డే, బతుకమ్మ సంబరాలు

**మందమర్రి, మహా** : మందమర్రి ఏరియా సింగరేణి సీఈఆర్ క్లబ్‌లో గురువారం ఫ్యామిలీ డే, బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జీఎం ఎన్. రాధాకృష్ణ, సింగరేణి సేవా అధ్యక్షురాలు ఎన్. శ్రీవాణి రాధాకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉద్యోగులు, కుటుంబ సభ్యులు ఒకే వేదికపై కలిసి పండుగ వాతావరణంలో సంబరాలు జరుపుకోవడం ఆనందంగా ఉందని, వృత్తి ఒత్తిడిని మరిచి కుటుంబంతో కులాసాగా గడపడం మరువలేని స్మృతులని అన్నారు. 202526 ఏడాదిలో సింగరేణి సేవా సమితి ద్వారా వృత్తి శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. మహిళలు, దంపతులకు ఆటల పోటీలు, చిన్నారుల గ్రూప్ డ్యాన్సులు ఆకట్టుకున్నాయి. ఉత్తమ బతుకమ్మలకు, ఆటల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. చివరగా మహిళల బతుకమ్మ ఆటపాటలతో వేడుకలు ముగించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం జీఎల్ ప్రసాద్, సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం రఘు కుమార్, సీఎంఓఏ సెక్రటరీ నరేష్, సీనియర్ పీవో సురేందర్, ఏరియా అధికారులు, ఉద్యోగులు, యూనియన్ నాయకులు, సేవా సమితి ప్రతినిధులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పనుల నాణ్యతలో రాజీ పడవద్దు

- రిమ్స్ లో అభివృద్ధి పనుల పరిశీలన
- అధికారులకు పలు ఆదేశాలు



**ఆదిలాబాద్ మహా**: రిమ్స్ ఆసుపత్రిలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులు, రోడ్లు, భవనాల నిర్మాణాలు, మరమ్మతులు అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు. గురువారం రిమ్స్ ఆసుపత్రితో కొనసాగుతున్న అభివృద్ధి పనులను, కొత్తబ్లాక్ నిర్మాణాలను, మరమ్మత్తు పనులను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్ తో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం అధికారులతో రిమ్స్ డైరెక్టర్ చాంబర్లో అధికారులతో సమీక్షించి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. టెండర్లలో బిడ్లు తక్కువకు వేసినప్పటికీ పనుల నాణ్యతలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడేది లేదని తేల్చిచెప్పారు. ఎంబీఎస్ గైడ్‌లైన్స్ ప్రకారం కన్సల్టెంట్ ఇంజనీర్లు పర్యవేక్షించి, నిర్దేశిత 1314 శాతం ప్రాఫిట్ మినహాయించి నాణ్యమైన పనులు జరిగేలా చూడాలని ఆదేశించారు. ఒకవేళ ఎక్కడైనా లోపాలు లేదా గ్యాప్స్ ఉంటే, వాటిని వెంటనే గుర్తించి మరింత పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులను అప్రమత్తం చేశారు. కొత్తబ్లాక్, ఆసుపత్రి పరిసరాల్లో పారిశుద్ధ్యానికి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. అటెండెండ్లు, రోగుల సౌకర్యార్థం వాషింగ్ ఏరియాలు, డస్ట్ బిన్లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని చెప్పారు. డస్ట్ బిన్లు, వాషింగ్ బేసిన్లు సక్రమంగా వాడకపోతే లేదా పరిశుభ్రత లోపిస్తే సంబంధిత ఏజెన్సీలకు, సెక్యూరిటీ గార్డులకు తక్షణమే జరిమానాలు విధించాలని స్పష్టం చేశారు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన బుక్స్ ప్రింట్ అయ్యాయని, త్వరలో క్షేత్రస్థాయిలో జరిమానాల అమలు ప్రారంభమవుతుందని తెలిపారు. ఎసిఎల్‌బి, నావిగేషన్, ఇతర అధికారుల బృందాలు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటించి పనులను పరిశీలిస్తూనే ఉంటాయని, లోపాలుంటే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కొత్తబ్లాక్ ప్రాంతంలో ఇప్పటికే ఎంఎన్‌ఐసీయూ సేవలు ప్రారంభించామని, ఈ బ్లాక్‌కు సంబంధించి శానిటేషన్ అన్ని రకాలుగా మెరుగ్గా ఉండాలని సూచించారు. త్వరలోనే దీనిపై మరోసారి సమీక్షా సమావేశం ఏర్పాటు చేసి తదుపరి స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తామని, పనుల్లో నాణ్యతను పరిశీలించేందుకు అధికారులు నిరంతరం క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని ఆయన పునరుద్ఘాటించారు.ఈ తనిఖీలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, వివిధ విభాగాల వైద్యులు, రోడ్లు భవనల శాఖ ఈఈ రమేష్, పంచాయతీ రాజ్, మున్సిపల్, జి.ఎం.ఎస్.సి.డి ల ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లు, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ ప్రతినిధులు, ఇతర అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.అభివృద్ధి

# అక్రమ బెల్ట్ షాపులపై ప్రశ్నిస్తే బెదిరింపులా..!?

**బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆగ్రహం**

**మందమర్రి, మహా** : మందమర్రిలోని అక్రమ బెల్ట్ షాపులపై మంత్రిని ప్రశ్నిస్తే కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు బెదిరిస్తున్నారని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ మందమర్రి మండల అధ్యక్షులు మేడి రాజు ఆరోపించారు. మందమర్రి మండలంలో పేద, శ్రామిక కుటుంబాలను నాశనం చేస్తున్న బెల్ట్ షాపులపై కార్మిక శాఖ మంత్రిని ప్రజాస్వామ్యబద్ధంగా ప్రశ్నించానని, దీనికి సమాధానం చెప్పకుండా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు మంద తిరుమల్ రెడ్డి ఫోన్ చేసి బెదిరింపులకు దిగడం దుర్మార్గమని ఆయన ఆరోపించారు. వెనుకబడిన, దళిత, గిరిజన వర్గాల తరపున ప్రశ్నించిన జేఏసీ గొంతు నొక్కాలని చూడటం అధికార పక్ష అహంకారానికి నిదర్శనమన్నారు. ఇలాంటి బెదిరింపులకు భయపడేది లేదని, మిమ్మల్ని గెలిపించింది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఓట్లేనని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. అక్రమ బెల్ట్ షాపుల నిర్మూలన, బహుజన హక్కులపై తమ పోరాటం ఆగదని మేడి రాజు స్పష్టం చేశారు.



# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి శిబిరం

**క్యాతనపల్లి -మహా** : క్యాతనపల్లి మున్సిపాలిటీ 17వ వార్డులో గురువారం లయన్స్ క్లబ్ ఆఫ్ రామకృష్ణాపూర్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. బెల్లంపల్లి పి. సత్యనారాయణ లయన్స్ కంటి ఆసుపత్రి సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ గోడిశెల సంధ్యారాణి రాజారమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని కొనియాడారు. డాక్టర్ రాజారమేష్ మాట్లాడుతూ కంటి పరీక్షల్లో సమస్యలు గుర్తించిన వారికి అనుబంధ సంస్థల ద్వారా ఉచితంగా కంటి చికిత్స, ఆపరేషన్లు అందించడం హర్షణీయమన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో ప్రతి 15 రోజులకు ఒకసారి వివిధ వార్డుల్లో శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నులుగొండ సత్యం, కార్యదర్శి ఆశన వేణి సత్యనారాయణ, కోశాధికారి పిల్లి సతీష్, ప్రోగ్రాం చైర్మన్ సుదర్శన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# రావణ దహన ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ చైర్ పర్సన్

**ఆదిలాబాద్ మహా**: విజయదశమి సందర్భంగా నిర్వహించే రావణ దహనం కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్ అధికారులకు సూచించారు. గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని దస్నాపూర్ లో గల మైదానాన్నిమున్సిపల్ కమిషనర్, హిందూ ఉత్సవ సమితి సభ్యులు,వార్డ్ కౌన్సిలర్ మున్సిపల్ సిబ్బంది తో కలిసి పరిశీలించారు. రావణ దహనం మైదానాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో జేసీబీ, బ్లేడ్ ట్రాక్టర్ వంటి యంత్రాల సహాయంతో శుభ్రపరిచే పనులు చేపడతామని తెలిపారు. అలాగే మైదానంలో ప్రజలకు అవసరమైన లైటింగ్, స్టేజ్ ఏర్పాటు, పారిశుద్ధ్య పనులు తదితర సౌకర్యాలను మున్సిపాలిటీ తరపున కల్పిస్తామని స్పష్టం చేశారు. పండుగకు వచ్చే ప్రజలు, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రావణ దహనం కార్యక్రమం ప్రశాంతంగా, విజయవంతంగా జరిగేలా మున్సిపల్ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తారని పేర్కొన్నారు.దసరా పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని, ఈ పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి, అభివృద్ధిని తీసుకురావాలని ఆకాంక్షించారు. ఆదిలాబాద్ జిల్లా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ , వార్డ్ కౌన్సిలర్ చరణ్ గౌడ్ ,హిందు ఉత్సవ సమితి సభ్యులు, మున్సిపల్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# బిజెపి ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా మద్దెర్ల శ్రీనివాస్ నియామకం

**బెల్లంపల్లి ,మహా:** బెల్లంపల్లి పట్టణానికి చెందిన సీనియర్ బిజెపి లీడర్ మద్దర్ల శ్రీనివాసు ను బిజెపి ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా జిల్లా భాజపా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర గౌడ్ నియమించారు. గురువారం రోజు బిజెపి మంచిర్యాల జిల్లా కార్యాలయంలో బిజెపి ఓబీసీ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బెల్లంపల్లి కి చెందిన మద్దెర్ల శ్రీనివాస్ ను జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర గౌడ్, ఓబిసి మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముఖేష్ గౌడ్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు అశోక్ వర్ధన్ చేతుల మీదుగా నియామకం జరిగింది. ఈ సందర్భంగా మద్దెర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలో బిజెపి ఓబీసీ మోర్చా బలోపేతానికి పనిచేస్తానని తెలిపారు.. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పట్టి వెంకటకృష్ణ, జిల్లా కార్యదర్శి రాచర్ల సంతోష్ పాల్గొన్నారు.




# తనిఖీలలో బయట పడిన భారీ పేలుడు పదార్థాలు

- పిప్పర్‌వాడ టోల్ ప్లాజా సమీపం-వలో ఘటన
- 20 లక్షల విలువ గల 20వేల ఎలక్ట్రానిక్ డిటోనేటర్లు, 90 బూస్టర్లు స్వాధీనం

**ఆదిలాబాద్ మహా**: వాహనాల తనిఖీల సమయంలో అక్రమంగా తరలిస్తున్న భారీ పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు.. ఈ కేసులో ఏడుగురు నిందితులను అరెస్ట్ చేయగా, మొత్తం తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.గురువారం జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు.జైనథ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పిప్పర్‌వాడ టోల్ ప్లాజా సమీపంలో పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా, రెండు వాహనాల్లో అనుమానాస్పదంగా పేలుడు పదార్థాలను తరలిస్తున్న ఏడుగురు వ్యక్తులను గుర్తించి అదుపులోకి తీసుకున్నామన్నారు. వాహనాలను తనిఖీ చేయగా భారీ మొత్తంలో ఎలక్ట్రానిక్ డిటోనేటర్లు, బూస్టర్లు బయటపడ్డాయన్నారు.పేలుడు పదార్థాలను అక్రమంగా రవాణా చేయడం, ఎలాంటి అనుమతులు, లైసెన్సులు లేకుండా నిల్వ చేయడం, విక్రయించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.నిందితులు ఉత్తరప్రదేశ్‌కు చెందిన రవికుమార్ అనే వ్యక్తి ద్వారా పేలుడు పదార్థాలను సమకూర్చుకుంటున్నట్లు వెల్లడైందన్నారు. అక్కడి కంపెనీ నుంచి ఇతరుల పేర్లపై బిల్లులు తీసుకొని, బూస్టర్ బాక్సుల్లో ఎలక్ట్రానిక్ డిటోనేటర్లను నింపి తెలంగాణకు తరలిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో గుర్తించామన్నారు. అనంతరం వాటిని క్రషర్లు, క్వారీలు, మైన్స్‌కు అధిక ధరలకు విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసిందన్నారు. 20వేల ఎలక్ట్రానిక్ డిటోనేటర్లు, 90 బూస్టర్లు ,బొలెరో వాహనం , హోండా సిటీ కారు , 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాల మొత్తం అంచనా విలువ సుమారు .20 లక్షల రూపాయలు గా పేర్కొన్నారు.ఈ ఘటనపై జైనథ్ పోలీస్ స్టేషన్‌లో మొత్తం తొమ్మిది మందిపై కేసు నమోదు చేసి, ఏడుగురు నిందితులను అరెస్ట్ చేశారు. మరో ఇద్దరి పాత్రపై దర్యాప్తు కొనసాగుతోంది. పేలుడు పదార్థాలను ఎక్కడి నుంచి సేకరించారు, ఎవరికి సరఫరా చేయాలనుకున్నారు, ఈ అక్రమ రవాణాలో ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉందనే అంశాలపై పోలీసులు లోతుగా విచారణ చేపడుతున్నారు.ప్రజల భద్రతకు విఘాతం కలిగించే అక్రమ కార్యకలాపాలపై పోలీసు శాఖ నిరంతరం నిఘా కొనసాగిస్తుందని జిల్లా ఎస్పీ తెలిపారు.ఈ మీడియా సమావేశంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, జైనథ్ సీఐ జి. శ్రావణ్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్, ఎస్సై పి. గౌతమ్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో రేషన్ కార్డ్ స్మార్ట్ కార్డుల పంపిణీ

- పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్ &
- మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు

**బెల్లంపల్లి ,మహా**: కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు సౌకర్యంగా ఉండేలా రేషన్ కార్డు లను స్మార్ట్ కార్డుల రూపంలో పంపిణీ చేసేందుకు శ్రీకారం చుట్టిందని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్ & మున్సిపల్ చైర్ పర్సన్ దావా స్వాతీ రమేష్ బాబులు సంయుక్తంగా పేర్కొన్నారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆదేశానుసారం ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మక చేపట్టిన రేషన్ కార్డ్ స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా ప్రారంభించి లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి,గత ప్రభుత్వం ఇచ్చింది కేవలం ఒక పేపర్ ముక్క అని.. ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇస్తున్నది ఒక కుటుంబానికి భరోసా కార్డు అని, అదేవిధంగా ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అందజేయడం జరుగుతుందన్నారు .ఈ కార్యక్రమంలో 26వార్డు కౌన్సిలర్ ఇప్ప కుమార్, 27వ వార్డు కౌన్సిలర్ బేతి శ్రావణ్ కుమార్, 34 వార్డు కౌన్సిలర్ కొక్కుల రామ్మూర్తి తోపాటు నాయకులు గెల్లి రాజలింగు యాదవ్, మల్లరపు చిన్నరాజం, దేవసాని ఆనంద్ , దుబాసి వెంకటస్వామి, MD వాజిద్ బాయ్ పట్టణ ఉపాధ్యక్షులు, కంకటి శ్రీనివాస్ మాజీ పట్టణ అధ్యక్షులు, నెల్లి రమేష్,రాముల్ నాయక్ , వాజియార్, పారపెల్లి పరమేష్, బర్రె మధునయ్య, ఎల్తూరి శంకర్, ఆచ్చిన సాయి కిరణ్ పట్టణ కార్యదర్శులు, దాసరి రాజలింగు ,గెల్లి రమాకాంత్, అలీ భాయ్ తదితరులు పాల్గొన్నారు.



# పూల సాగు ఎంతో మేలు

- పరిశీలించిన కలెక్టర్ రాజర్షిషా
- రైతులకు అభినందన

**ఆదిలాబాద్ మహా** : జిల్లాలో ఉద్యాన పంటల సాగుతో రైతులు ఆర్థికంగా బలపడాలని, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు గడించేందుకు పువ్వుల సాగు ఎంతో లాభదాయకమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పిలుపునిచ్చారు. గురువారం మావల మండలం బట్టిసావర్గం, తలమడుగు మండలం కజ్జర్ల గ్రామ శివారులోని పువ్వుల తోట, టమాటా పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పంట కల్టివేషన్ తీరును తిలకించి, రైతులను అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ముందస్తు ప్రణాళికతో చేపట్టిన ఈ పువ్వుల సాగు అభినందనీయమన్నారు. ఈ ఎల్నినో సమయంలో పంట మార్పిడి విధానంపై జూన్, జులై మాసాల్లో గ్రామసభల్లో రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించామని గుర్తుచేశారు. ప్రస్తుతం ఈ తోటలో ఎటువంటి పంట నష్టాలు లేకుండా మంచి దిగుబడి రావడమే కాకుండా, అయోధ్య నుంచి వచ్చిన ప్రత్యేక ఆర్డర్ల మేరకు అక్కడికి ఫార్వర్డ్ లింకేజీ ద్వారా పువ్వులు ఎగుమతి అవుతుండటం విశేషమన్నారు. ఒక ఎకరంలో పువ్వుల సాగుకు కేవలం 35 నుంచి 40 వేల వరకు మాత్రమే ఖర్చు అవుతుందని, మార్కెట్లో విక్రయిస్తే దాదాపు 5 టన్నుల వరకు దిగుబడి వచ్చి రూ. 2 లక్షల వరకు ఆదాయం పొందే అవకాశం ఉందని తెలిపారు. తక్కువ నీటి వినియోగం కోసం స్ప్రింక్లర్లు ఏర్పాటు చేశామని, భవిష్యత్తులో డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం కూడా కల్పిస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుత అక్టోబర్ ఎండల తీవ్రత దృష్ట్యా, సోయాబీన్ హార్వెస్ట్ పూర్తయిన తర్వాత రైతులు వేరుశనగ, మినుము, నువ్వులు వంటి తక్కువ నీరు అవసరమయ్యే స్వల్పకాలిక పంటల వైపు మళ్లాలని సూచించారు. పత్తి తీసిన వెంటనే మళ్లీ జొన్న లేదా పత్తి భూమిలో అదే పద్ధతి కొనసాగిస్తే మార్చి, ఏప్రిల్ వరకు ఇబ్బందులు తలెత్తుతాయని, కాబట్టి ప్రత్యామ్నాయ స్వల్పకాలిక పంటలకే ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సందీప్, తలమడుగు తహసిల్దార్ రాజ్ మోహన్, కజ్జెర్ల, బట్టిసావర్గం సర్పంచులు నారాయణ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మండల ఉద్యానవన అధికారి క్రాంతి, అధికారులు, రైతులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.



# సద్దుల బతుకమ్మ, దసరా ఏర్పాట్లను పరిశీలించిన జీఎం రాధాకృష్ణ

మందమర్రి, మహా : మందమర్రి ఏరియా సింగరేణి పాఠశాల మైదానంలో జరగనున్న సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాల ఏర్పాట్లను జీఎం ఎన్. రాధాకృష్ణ బుధవారం అధికారులతో కలిసి పరిశీలించారు. గ్రౌండ్‌లో జరుగుతున్న పనులను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. బతుకమ్మ రోజున మహిళలకు ఇబ్బంది లేకుండా గ్రౌండ్‌ను చదును చేసి అలంకరించాలని, మెరుగైన లైటింగ్, సౌండ్ సిస్టమ్, తాగునీటి వసతి, బతుకమ్మ కొలను ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు.దసరా వేడుకలకు వేలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున పటిష్టమైన బారికేడ్లు, భద్రత కోసం సెక్యూరిటీ సిబ్బందిని పెంచాలని, ఆకట్టుకునే రంగురంగుల బాణసంచా ప్రదర్శన ఏర్పాటు చేయాలని సూచించారు. సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలంతా పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం జీఎల్ ప్రసాద్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, ఏరియా ఇంజనీర్ బాలాజీ భాగవతి ఝా, డీజీఎం పర్సనల్ అశోక్, ఏజీఎం అకౌంట్స్ ప్రసాద్, సేఫ్టీ ఆఫీసర్ మురళి, డీజీఎం సివిల్ మదీనా భాషా, సెక్యూరిటీ ఆఫీసర్ వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## ఘట్‌కేసర్ సీఐ బాలస్వామి సస్పెండ్ అవినీతి ఆరోపణలపై సీపీ కొరడా

**ఘట్‌కేసర్ ,మహా :** రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్‌లో సీఐగా విధులు నిర్వహిస్తున్న ఎం. బాలస్వామిపై సస్పెన్షన్ వేటు పడింది. ఆయనపై వచ్చిన అవినీతి ఆరోపణలు నిజమని విచారణలో తేలడంతో మల్కాజిగిరి జోన్ సీపీ బి. సుమతి ఈ చర్యలు తీసుకున్నారు.గత కొంతకాలంగా ఘట్‌కేసర్ పీఎస్‌లో సీఐ తీరు సరిగా లేదంటూ పలు ఫిర్యాదులు వస్తున్నాయి. న్యాయం కోసం వచ్చే బాధితుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని, ప్రతి పిటిషన్‌ను డబ్బుల కోణంలోనే చూస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా భూములు, స్థలాల వివాదాలు, ఇతర సివిల్ కేసుల్లో డబ్బులు తీసుకుని నిందితుల వైపు మొగ్గు చూపుతున్నారని బాధితులు వాపోయారు. దీంతో విసిగిపోయిన దాదాపు 12 మందికి పైగా బాధితులు నేరుగా రాచకొండ సీపీని కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. వారి ఫిర్యాదులను సీరియస్‌గా తీసుకున్న ఉన్నతాధికారులు అంతర్గతంగా విచారణ చేపట్టారు. విచారణలో సీఐ అవినీతికి పాల్పడినట్లు స్పష్టమైన ఆధారాలు లభించాయి. నివేదిక ఆధారంగా సీపీ సుమతి బుధవారం ఆయనపై సస్పెన్షన్ చర్యలు తీసుకున్నారు.



## డయాలసిస్ బాధితుడికి మాజీ డిప్యూటీ మేయర్ ఆర్థిక సాయం

**మానవత్వాన్ని చాటుకున్న రెడ్డిశెట్టి శ్రీనివాస్**

**కుషాయిగూడ, మహా :** చంద్రపురి కాలనీ నివాసి డయాలసిస్ తో బాధపడుతున్న సందం సాయికుమార్ కు తన వంతు సహాయంగా మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సాయికుమార్ పరిస్థితిని తెలుసుకున్న వెంటనే స్పందించి అతని ఇంటికి వెళ్లి ఆర్థిక సాయం అందించడంతో పాటు ధైర్యం చెప్పారు. వైద్యానికి ఎలాంటి సహాయం కావాలన్నా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ.. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, సాయికుమార్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కృష్ణ బాబా, శ్రీమన్నారాయణ, మాధవ్, శ్రీనివాస్ గౌడ్, సవిత, మాధవి తదితరులు పాల్గొన్నారు.



## పెండింగ్ కేసులను త్వరగాతిన పరిష్కరించాలి

**రాజేంద్రనగర్ మహా :** షాద్నగర్ జోన్ డిసిపి శిరీష, ఎసిపి లక్ష్మీనారాయణతో కలిసి ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి పెద్దషాపూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. పోలీస్ స్టేషన్ పనితీరును సమీక్షించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి, దర్యాప్తులను వేగవంతం చేయాలి,నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. సిబ్బంది విధులను బాధ్యతాయుతంగా నిర్వహిస్తూ, ప్రజా ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి. శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల నివారణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

# చర్లపల్లి డివిజన్‌లో రూ.3.82 కోట్లతో అభివృద్ధి పనులు

- పలు కాలనీల్లో పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



**కుషాయిగూడ, మహా** : చర్లపల్లి డివిజన్‌లో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా రూ.3 కోట్ల 82 లక్షల 70 వేల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. కాలనీల్లో రహదారులు, డ్రైనేజీ, మురుగునీటి పారుదల వ్యవస్థల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నట్లు ఆయన తెలిపారు. కాలనీల వారీగా నిధుల వివరాలు ఇలా ఉన్నాయి. పెద్ద చర్లపల్లి గ్రామంలో రూ.45 లక్షలు, వీఆర్ కాలనీలో రూ.26 లక్షలు, మింట్ కాలనీ, రెడ్డి కాలనీల్లో రూ.22 లక్షలు, బి.ఎన్.రెడ్డి నగర్‌లో రూ.46 లక్షలు, ఈసీ నగర్‌లో రూ.49 లక్షలు, డాక్టర్స్ కాలనీ, నేతాజీ నగర్‌లో రూ.49 లక్షలు, బి.ఎన్.రెడ్డి నగర్ ఫేజ్ 2లో రూ.49 లక్షలు, ఫేజ్ 1లో రూ.49.70 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. రైల్ విహార్ కాలనీలో ఆర్‌సీసీ పైపులైన్ నిర్మాణం చేపట్టనున్నారు.ఈ పనులు పూర్తయితే ఆయా కాలనీల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు మురుగునీటి పారుదల సమస్యలు తగ్గుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ఉప్పల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కాలనీల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన పనులను దశలవారీగా చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కాలనీల ప్రతినిధులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు. బండారు లక్ష్మారెడ్డి రాకతో చర్లపల్లి డివిజన్ నుండి ఆయా కాలనీల అధ్యక్ష కార్యదర్శులు కాలనీల నాయకులు కాలనీల సభ్యులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.. ఇప్పటికే ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి కోట్లాది రూపాయల నిధులు తెప్పించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.



## స్ఫూర్తి గ్రూపు ప్రచురణలను అభినందించిన ట్రేడ్ యూనియన్ నెత మల్లికార్జున్

**కుషాయిగూడ, మహా:** ట్రేడ్ యూనియన్ నాయకుడు . సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లికార్జున్. కమలానగర్‌లోని కార్యాలయాన్ని సందర్శించిన సందర్భంగా తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూపు ప్రచురించిన పుస్తకాలను ఆయనకు అందజేశారు. స్ఫూర్తి గ్రూపు సభ్యులు రచించిన వివిధ వ్యాసాలతో కూడిన 'మేము సైతం' పుస్తకంతో పాటు, స్ఫూర్తి గ్రూపు బాధ్యుడు గౌడుగు యాదగిరి రావు రచించిన 'నా గమనం' పుస్తకాలను మల్లికార్జున్‌కు అందించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ.. స్ఫూర్తి గ్రూపు పుస్తకాల ప్రచురణకే పరిమితం కాకుండా, అనేక సామాజిక అంశాలపై సెమినార్లు నిర్వహిస్తూ ప్రజల్లో చైతన్యం కలిగించే కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. సమాజాన్ని చైతన్యపరిచే దిశగా కృషి చేస్తున్న స్ఫూర్తి గ్రూపు నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్ఫూర్తి గ్రూపు బాధ్యులు గౌడుగు యాదగిరిరావు, జి. శివరామకృష్ణ, కృష్ణమాచార్యులు పాల్గొన్నారు. మల్లికార్జున్ గత . యు.ట్రేడ్ యు ట్రేడ్ యూనియన్ ను విసరింపజేయడంలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. ఎర్రజెండా నీడ కింద పనిచేస్తూ కార్మిక కర్షక అన్నివర్గాల ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న మల్లికార్జున్... ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర సిఐటియు ఉపాధ్యక్షులుగా మల్లికార్జున్ కొనసాగుతున్నారు... ఆయనతోపాటు ట్రేడ్ యూనియన్ నాయకులు కూడా కుషాయిగూడ సిఐటియు కార్యాలయానికి విచ్చేశారు... కార్మికులను ఉద్దేశించి మల్లికార్జున్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా కార్మిక వర్గంపై తీవ్రమైన దాడి జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచీకరణ సర్లికృత నూతన ఆర్థిక విధానాన్ని కార్మిక వర్గానికి శాపంగా మారాయని అన్నారు.



## అనారోగ్యానికి గురైన బిజెపి నాయకుని పరామర్శించిన ఓబీసీ స్టేట్ సెక్రటరీ బైతి శ్రీధర్

**రాజేంద్రనగర్ మహా ;** అనారోగ్య సమస్యతో బాధపడుతున్న శంషాబాద్ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి వడ్డే చంద్రయ్య ను ఓబీసీ రాష్ట్ర సెక్రటరీ బైతి శ్రీధర్ గురువారం ఆయనను పరామర్శించారు. చంద్రయ్య ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అయిన త్వరగా కోలుకోని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి సాధారణ జీవనం కొనసాగించాలని బైతి శ్రీధర్ ఆకాంక్షించారు.



## స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీలో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

**జయలక్ష్మి దేవిగా దర్శనం..**

**రాజేంద్రనగర్ మహా:** శంషాబాద్ మండలం ముచ్చింతల్ శ్రీరామ్నగర్ లోని ప్రసిద్ధ ఆధ్యాత్మిక క్షేత్రం స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీ'లో దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 5 రోజు అమ్మవారు 'జయలక్ష్మి' అలంకారంలో భక్తులకు దివ్యదర్శనం ప్రసాదించారు. శ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి దివ్య మార్గదర్శకత్వంలో మంగళాశాసనాలతో ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఐదవ రోజు ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలు కన్నులపండువగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణం మార్మోగింది. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తరించారు. అష్టఐశ్వర్యాలను ప్రసాదించే దివ్య స్వరూపిణిగా జయలక్ష్మి అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. ఈ అలంకారంలో అమ్మవారిని పూజిస్తే సకల విజయాలు, కుటుంబంలో సుఖశాంతులు చేకూరుతాయని విశ్వాసం. ఈ పవిత్ర సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అర్చనలు, హోమాలు నిర్వహించారు. ఐదవ రోజు ప్రత్యేకంగా 'భూవరాహ ఇష్టి' అత్యంత నిష్ఠతో నిర్వహించారు. ప్రకృతి అనుగ్రహంకోసం, లోక కల్యాణం నిమిత్తం వేద పండితులు ఈ విశేష యాగ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా పూర్తి చేశారు. ఈ ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు అమ్మవారు ధాన్యలక్ష్మి దేవిగా దర్శనమిస్తారు. ఈ పవిత్రమైన రోజున అమ్మవారికి విశేషంగా లక్ష పుష్పార్చన నిర్వహిస్తారు.





## ప్రజల భద్రత నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర.!

- శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ పడొద్దు...
- అధికారులకు ఆదేశాలు జారీ చేసిన డిసిపి రాజేష్..

**ఆదిభట్ల అక్టోబర్ 15 మహా:** ఆదిభట్ల పోలీస్ స్టేషన్‌ను శంషాబాద్ జోన్ డీసీపీ రాజేష్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న డీసీపీకి, ఏసీపీ ప్రదీప్ కుమార్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ రమేష్ ఆధ్వర్యంలో సిబ్బంది స్వాగతం పలికారు. స్టేషన్‌కు వచ్చిన ఆయన ముందుగా పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటి పచ్చదనం, పరిశుభ్రతను పెంపొందించాలని సూచించారు. అనంతరం రతన్ టాటా పీజీ కాలేజీ అసోసియేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన 20 సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. ప్రజల భద్రత, నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని ఈ సందర్భంగా డీసీపీ పేర్కొన్నారు. సీసీ కెమెరాల ప్రారంభం అనంతరం పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఆయా సెక్టర్ల పరిధిలో పని చేస్తున్న ఎస్ఐల ఆధ్వర్యంలో నమోదైన వివిధ రకాల కేసుల దస్త్రాలు, పెండింగ్ కేసులు, నేరాల నమోదు తీరును అడిగి తెలుసుకున్నారు. బాధితులకు తక్షణ న్యాయం అందేలా సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని, శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ పడొద్దని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు వెంకటేష్, సైదయ్య, సత్యనారాయణ, సుందరయ్య, నోయెల్ రాజ్, సోమయ్య తదితర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సక్సెషన్ కోసం రూ.5 లక్షలు డిమాండ్

**రూ.2.50 లక్షలు తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన రెవెన్యూ అధికారులు.**

**కుషాయిగూడ, మహా:** కీసర తహసిల్దార్ కార్యాలయంలో సక్సెషన్ కోసం రూ.5 లక్షలు డిమాండ్ చేశారనే ఆరోపణలకు రూ.2.50 లక్షలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నరు.వివరాల్లోకి వెళ్తే ఇటీవల కీసరకు చెందిన పన్నుల పన్నాల బుచ్చి రెడ్డి భార్య పన్నాల సుశీల మృతి చెందడంతో పన్నాల గిరిధర్ రెడ్డి అనే వ్యక్తి తన తల్లి పేరు మీద ఉన్న సర్వే నెంబర్ 183,184లో ఉన్న 300 ఎకరాల భూమిని సక్సెషన్ కోసం సంబంధిత కార్యాలయాన్ని సంప్రదించడు.ఏసీబీ డీసీపీ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ అయితే ఇట్టి భూమి 22A లో ఉంది అని ఈ సక్సెషన్ పూర్తి చేసేందుకు సందీప్ రెడ్డి సుమారు రూ.5 లక్షలు డిమాండ్ చేశారు.22A లో నుండి తీయాలి అంటే తహసిల్దార్ కి ఆర్డీఓ ఆఫీసులో సైతం డబ్బులు ఇవ్వాలి అని బాధితుడికి చెప్పడం జరిగింది.ఈ నేపథ్యంలో పన్నాల గిరిధర్ రెడ్డి రూ 2.50 లక్షలను మొదటగా ఎంఆర్ఓ కార్యాలయంలో విజయ్ కుమార్ రెడ్డికి అందజేసినట్లు సమాచారం. అనంతరం విజయ్ కుమార్ ఆ నగదును కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్ గా పేర్కొంటున్న బాలకృష్ణకు ఇచ్చినట్లు తెలిసింది.బాలకృష్ణ ఆ నగదును డిప్యూటీ తహసిల్దార్ సందీప్ రెడ్డి గదిలోకి తీసుకెళ్లి అతని బ్యాగ్‌లో పెడుతున్న సమయంలో ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నరు. ఈ ఘటనతో సంబంధిత కార్యాలయంలో కలకలం నెలకొంది.సక్సెషన్ వంటి కీలకమైన ప్రభుత్వ సేవల కోసం లంచం డిమాండ్ చేశారనే ఆరోపణలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి.



## చర్లపల్లి లో ఘనంగా కార్మిక బతుకమ్మ సంబరాలు

**కుషాయిగూడ, మహా** : చర్లపల్లి పారిశ్రామిక ప్రాంతంలో సిఐటియు ఆధ్వర్యంలో కార్మిక బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి సిఐటియు రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ తెలంగాణలో దసరా పండుగను పెద్ద ఎత్తున సాంప్రదాయం పద్ధతిలో ఘనంగా జరుపుకుంటారని అన్నారు ముఖ్యంగా మహిళలు తొమ్మిది రోజులపాటు వివిధ రూపాలలో పేర్లతో బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో సంతోషంగా నిర్వహిస్తారని అన్నారు. పూలను పూజించే సమాజం ఆడపిల్ల పుట్టినప్పుడు వివక్ష చూపడం బాధాకరమని అన్నారు. బతుకమ్మ అంటే బతుకు అమ్మ అని అర్థం వస్తుందని అన్నారు. అందుకే ఆడపిల్లను పుట్టనిద్దాం బ్రతకనిద్దాం ఎదగనిద్దామన్నారు. మహిళా హక్కులకై మహిళల వేధింపులపై పని ప్రదేశంలో లైంగిక హింసకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరు పోరాడాలని అన్నారు. మహిళలకు సమాజంలో సమాన హక్కులు కల్పించాలని వివక్షలేని సమాజం నిర్మాణం కోసం అందరం కలిసి పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఏ అశోక్ చర్లపల్లి ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు బివి సత్యనారాయణ జి శ్రీనివాసులు జిల్లా కోశాధికారి పి గణేష్, మేడ్చల్ జిల్లా ఆశ వర్కర్స్ ప్రధాన కార్యదర్శి రేవతి, వివిధ యూనియన్ల ప్రధాన కార్యదర్శిలు ఎస్ ఎస్ మణికంఠ టి నరసింహ కే బాలరాజు, టి రవీందర్ రెడ్డి, ఆదామ్, సంతోష్, శ్రీనివాస్, రాంబాబు, మన్మధరావు, చారి, సుబ్రహ్మణ్యం, నరసమ్మ మరియమ్మ,లావణ్య, మోక్ష,లక్ష్మి, పద్మ, అనిత విజయ తదితరులు పాల్గొన్నారు.




## వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల సమ్మెకు బిజెపి మద్దతు...

- ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలి...
- రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి..

**రాజేంద్రనగర్ మహా ;** తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజిగిరి, హైదరాబాద్, సంగారెడ్డి జిల్లా ఉద్యోగుల నిరావధిక సమ్మెకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి

గురువారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం నిరంతరం కష్టపడుతున్న నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వైద్య ఆరోగ్యశాఖలో కీలక పాత్ర పోషిస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు, వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని జీవో 60 & 1195 ప్రకారం పెరిగిన వేతనాలను తక్షణమే అమలు చేయాలన్నారు. 2022 సంవత్సరం నుంచి పెండింగ్‌లో ఉన్న 5 శాతం వార్షిక ఇంక్రిమెంట్, 8 శాతం లయబిలిటీ బోనస్ అందించాలన్నారు. మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులు మంజూరు చేయాలి. ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి వారి భవిష్యత్తుకు భరోసా ఇవ్వాలన్నారు. సమాన పనికి సమాన వేతనంసూత్రాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఉద్యోగుల సేవలు ఎంతో కీలకమని, అలాంటి ఉద్యోగులు తమ హక్కుల కోసం సమ్మె చేయాల్సిన పరిస్థితి రావడం విచారకరమని అన్నారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి, జేఏసీ ప్రతినిధులతో చర్చలు జరిపి వారి డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ఈకార్యక్రమం లో డాక్టర్లుసంగీత, దినేష్, శంకర్, సాయి కిరణ్, చేతన్, అనూప్, రాము నాయక్ గిరిజన సంఘం అధ్యక్షులు,అమిత్,బిజెపి నాయకులు బత్కు శ్రీనివాస్ యాదవ్, శంకర్ రెడ్డి తదితరులు పాల్గొనారు.



## కమిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

**ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కి కాలనీవాసుల వినతులు...**

**రాజేంద్రనగర్ మహా ;** గ్రేటర్ శంషాబాద్ పరిధిలోని రుద్ర కాలనీలో కమిటీ హాల్ నిర్మాణం చేపట్టాలని కోరుతూ, రుద్ర కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె వై ప్రణయ్ ఆధ్వర్యంలో కాలనీవాసులు గురువారం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ, రుద్ర కాలనీలో కమిటీ హాల్ నిర్మాణం చాలా కాలంగా పెండింగ్‌లో ఉంది. స్థలం లేకపోవడంతో నిర్మాణం నిలిపివేశారు. ప్రస్తుతం కమిటీ హాల్ నిర్మాణానికి సంబంధించిన స్థలం రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయింది. కావున, కాలనీవాసుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని సంబంధిత స్థలంలో కమిటీ హాల్ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేసి, పనులను వీలైనంత త్వరగా ప్రారంభించాలని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సంజయ్ యాదవ్, మాజీ ఎంపీటీసీ జ్ఞానేశ్వర్ యాదవ్,ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ యాదవ్, ప్రసాద్ బాబు, పి ప్రేమ్ కుమార్, శ్రీకాంత్, సోహైల్, రాచమల్ల కిషోర్, జాన్, అనిల్, రాజు, సుధీర్ బాబు, జాషువా పాల్, రాచమల్ల కిరణ్, ఇజ్రాయిల్, ప్రజమాన్, పవన్, రుద్రాక్ష అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలుగా ఎంగరెడ్డి కమలమ్మ

**రాజేంద్రనగర్ మహా :** బీజేపీ మహిళా మోర్చా రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షురాలుగా శంషాబాద్ కు చెందిన సీనియర్ నాయకురాలు ఎంగరెడ్డి కమలమ్మ నియమితులయ్యారు . ఈనెల 12 వ తేదీన 31 మందితో మహిళ మోర్చా నూతన కార్యవర్గాన్ని మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి, రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షులు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్ ప్రకటించారు. గురువారంఆమె శంషాబాద్ లో మాట్లాడుతూ తనపై నమ్మకంతో మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలుగా నియమించిన రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షులు రాజ్ భూపాల్ గౌడ్, చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు మమతారెడ్డి , మైలార్దేవ్ పల్లి మాజీ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి పార్టీ బాధ్యతలను అప్పగించిన రాష్ట్ర అధిష్టానానికి కృతజ్ఞతలు తెలియజేశారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు.



# పది రోజులుగా నిలిచిపోయిన ఇంటింటి చెత్త సేకరణ

- **రహదారులపై పేరుకుపోయిన వ్యర్థాలు.. కమ్మేస్తున్న దుర్వాసన**
- **జవహర్ నగర్.. సర్వం చెత్తమయం**

**జవహర్ నగర్, మహా :** జవహర్ నగర్ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారయిందని ప్రజలు వాపోతున్నారు. చెత్త నిర్వహణను గాలికొది లేయడంతో అధికారులు నిద్రమత్తులో తూగుతుంటే ఇక్కడి ప్రజలు మాత్రం చెత్తాచెదారం మధ్య నరకయాతన అనుభవిస్తున్నారు. గత పది రోజులుగా కాలనీల్లో మున్సిపల్ చెత్త బండి ముఖం చాటేయడంతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయి వీధులన్నీ వ్యర్థాల కుప్పలుగా మారిపోగా, రోడ్ల పక్కన కొండల్లా పేరుకుపోయిన ఈ చెత్త వల్ల చుట్టుపక్కల ప్రాంతాల్లో విపరీతమైన దుర్వాసన వస్తూ ప్రజలు ముక్కు మూసుకొని గడపాల్సిన దారుణమైన దుస్థితి ఏర్పడింది. ఈ చెత్త కుప్పల వద్ద దోమలు, ఈగలు విపరీతంగా పెరిగిపోయి డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని కాలనీవాసులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తుండగా, వీధి కుక్కలు పశువులు ఈ వ్యర్థాలను రోడ్డుపైకి లాగి పడేస్తుండటంతో పాదచారులు, వాహనదారులు ప్రయాణించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జవహర్ నగర్ నివాసితులలో ఎక్కువ మంది రోజు కూలి పనులు చేసుకుంటే గానీ ఇల్లు గడవని నిరుపేదలు కావడం, ఇక్కడి నుండి కీసరలోని మున్సిపల్ కమిషనర్ కార్యాలయానికి ఏకంగా 15 కిలోమీటర్ల దూరం ఉండటంతో పనిపాట వదులుకుని అంత దూరం వెళ్లలేక, సమస్య చెప్పుకుందామంటే స్పందించే నాథుడే కరువయ్యాడని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోకపోవడంపై నిరసన వ్యక్తంచేస్తూ, ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి పేరుకుపోయిన చెత్తను తొలగించి రోజూ మున్సిపల్ వాహనం వచ్చేలా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



# విద్యుత్ సబ్ స్టేషన్లో రక్షణ చర్యలు ముఖ్యం

- **హై వోల్టేజీ పనుల్లో జాగ్రత్తలు పాటించాలని**
- **డైరెక్టర్ ఆఫ్ మైన్ సేఫ్టీ(ఎలక్ట్రికల్)**
- **కె.మహేశ్వర్ రెడ్డి సూచించారు.**
- **132 కేవీ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ భద్రతా తనిఖీ**

**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: సబ్ స్టేషన్లలో హై వోల్టేజీ పనుల్లో భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని డైరెక్టర్ ఆఫ్ మైన్ సేఫ్టీ (ఎలక్ట్రికల్) కె.మహేశ్వర్ రెడ్డి సూచించారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేట్ పరిధిలోని 132 కేవీ సబ్‌స్టేషన్‌ను గురువారం డైరెక్టర్ ఆఫ్ మైన్ సేఫ్టీ ఎలక్ట్రికల్ కె.మహేశ్వర్ రెడ్డి సందర్శించి విద్యుత్ భద్రతా ప్రమాణాల అమలుపై తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న అధికారులు సిబ్బందిని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ హై వోల్టేజీ విద్యుత్ పరికరాల వద్ద పనిచేసే సమయంలో తగిన రక్షణ చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాలను నివారించేందుకు షట్‌డౌన్ విధానాన్ని కచ్చితంగా పాటించాలని సరైన ఐసోలేషన్ ఎర్తింగ్ అనుమతి పత్రాల ప్రక్రియలను అనుసరించిన తర్వాతే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. ఎత్తయిన ప్రదేశాల్లో పనిచేసేటప్పుడు నాణ్యమైన సేఫ్టీ బెల్ట్ లేదా ఫుల్ బాడీ హార్నెస్‌ను తప్పనిసరిగా ధరించాలని సూచించారు. విద్యుత్ పనుల సమయంలో రక్షణాత్మక హ్యాండ్ గ్లోవ్స్, ఎలక్ట్రికల్ ఇన్సులేటింగ్ షూస్ తగిన ఆర్క్ ఫ్లాష్ ప్రొటెక్షన్ కిట్ వంటి వ్యక్తిగత రక్షణ పరికరాలను వినియోగించాలని తెలిపారు. సబ్‌స్టేషన్‌లో పనిచేసే ప్రతి ఉద్యోగి భద్రతకు ప్రాధాన్యతనిస్తూ నిర్దేశిత భద్రతా నియమాలు ఆపరేటింగ్ విధానాలను కచ్చితంగా పాటించాలని ఆయన స్పష్టం చేశారు. ప్రమాదరహిత వాతావరణంలో విధులు నిర్వహిస్తూ సబ్‌స్టేషన్‌ను భద్రతా ప్రమాణాల్లో ప్రథమ శ్రేణిలో నిలపాలని అధికారులకు సిబ్బందికి సూచించారు. డైరెక్టర్ ఆఫ్ మైన్ సేఫ్టీ(ఎలక్ట్రికల్)కె.మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ భద్రతా తనిఖీలో డిడిఎంఎస్ షేక్ నాగుల్ మీరా, డిడిఎంఎస్ దేవ్ కిషన్ శర్మ, జనరల్ మేనేజర్(ఈ అండ్‌ఎం) సెంట్రల్ వర్క్ షాప్ కె.రామ్మోహన్, జనరల్ మేనేజర్(ఈ అండ్‌ఎం) వర్క్ షాప్ అండ్ ఎనర్జీ మేనేజ్‌మెంట్ వై.విజయ శేఖర్ బాబు, సబ్‌స్టేషన్ డిజిఎం కె.వేలాద్రి, ఎస్ఈ(ఈ అండ్ ఎం) వి.నరేంద్ర కుమార్, డివైఎస్ఈ ఎం.డి. ఫరూక్, జేఈ(ఈ అండ్‌ఎం) కోట శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



# అక్రమ నిర్మాణాలకు 111 జివోలో అడ్డుకట్ట ఏది

- **అక్రమ నిర్మాణాల జోరు.. అధికారుల మౌనం.. ఎవరి అండతో ఈ దందా**
- **జీవో 111 పరిధిలో నిబంధనల ఉల్లంఘన జరుగుతున్నా, అధికారులు నిద్రపోతున్నారా**

**మొయినాబాద్ మహా**: మున్సిపాలిటీ హిమాయత్ నగర్ జీవో 111 పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం పై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ నిర్మాణాల పై మున్సిపల్ కమిషనర్‌కు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదులు అందినా అధికారులు ఎందుకు స్పందించడం లేదు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించడానికి అడ్డంకి ఏమిటి అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా హిమాయత్‌నగర్ వార్డు కౌన్సిలర్ ఈ వ్యవహారంపై మౌనం వహించడం పలు అనుమానాలకు తావిస్తోందని స్థానికులు అంటున్నారు. ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సిన ప్రజాప్రతినిధి ఎందుకు స్పందించడం లేదని నిలదీస్తున్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నిర్మాణాలపై అధికారులు చర్యలు తీసుకోకపోవడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయా అక్రమ నిర్మాణదారులకు ఎవరైనా అండగా నిలుస్తున్నారా లేక అధికారుల పర్యవేక్షణ లోపమే కారణమా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులే మౌనం వహిస్తే ప్రజలు ఎవరిని ఆశ్రయించాలి?l ఫిర్యాదులకు విలువ లేకపోతే మున్సిపల్ వ్యవస్థ ఉన్నది ఎందుకు అంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి, క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నిర్మాణాలకు అనుమతులు ఉన్నాయా జీవో 111కు సంబంధించిన ప్రస్తుతం వర్తించే నిబంధనలను పాటిస్తున్నారా అనే అంశాలను పరిశీలించి, ఉల్లంఘనలు నిర్ధారణ అయితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అదేవిధంగా ఫిర్యాదులపై ఇప్పటివరకు తీసుకున్న చర్యలను బహిర్గతం చేయాలని, నిర్లక్ష్యం నిర్ధారణ అయితే బాధ్యులైన అధికారులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

# భూ రీ సర్వేను పారదర్శకంగా నిర్వహించాలి

- **భూ హద్దులను ఖచ్చితంగా నిర్ధారించాలి**
- **భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్**
- **కరకగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్**
- **విధుల పట్ల నిర్లక్ష్యంపై చర్యలు**
- **మెడికల్ ఆఫీసర్‌కు ఛార్జ్ మెమో జారీకి ఆదేశం**



**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: భూ రీ సర్వేను పారదర్శకంగా నిర్వహించడంతోపాటుగా భూ హద్దులను ఖచ్చితంగా నిర్ధారించాలని భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం కరకగూడెం మండలంలో పర్యటించి ముందుగా బట్టుపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూ రీ సర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం కరకగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి వైద్య సేవలు సిబ్బంది హాజరు రోగులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. బట్టుపల్లి రెవెన్యూ పరిధిలో సుమారు 1,160 ఎకరాల విస్తీర్ణంలో చేపడుతున్న భూ రీ సర్వే పనుల పురోగతిని కలెక్టర్ సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆధునిక డీజీపీఎస్, జీఎన్ఎస్ఎస్ రోవర్ పరికరాల సహాయంతో భూముల సరిహద్దులను ఖచ్చితంగా గుర్తిస్తూ సర్వే నిర్వహిస్తున్నట్లు అధికారులు వివరించారు. సర్వే నంబర్ల వారీగా భూముల హద్దులను పరిశీలిస్తూ అటవీ భూములు రైతుల పట్టా భూముల మధ్య ఉన్న సరిహద్దు రాళ్లను గుర్తించి వాటి వివరాలను సాంకేతిక పరికరాల ద్వారా నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో మాట్లాడి వారి పట్టా పుస్తకాలను పరిశీలించారు. క్షేత్రస్థాయిలో చేపడుతున్న కొలతలను రెవెన్యూ రికార్డులు పట్టా వివరాలతో సరిపోల్చి భూముల హక్కులు సరిహద్దులను నిర్ధారించాలని అధికారులకు సూచించారు. కొండ ప్రాంతాలు దట్టమైన చెట్ల కారణంగా కొన్నిచోట్ల శాటిలైట్ సిగ్నల్ సమస్యలు ఎదురవుతున్న నేపథ్యంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ సరిహద్దు బిందువులను ఖచ్చితంగా నమోదు చేయాలని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ భూ రీ సర్వేను పకడ్బందీగా పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రైతుల భూముల హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా రెవెన్యూ రికార్డులు పట్టా వివరాలు క్షేత్రస్థాయి కొలతలను సమగ్రంగా పరిశీలించిన అనంతరం భూముల సరిహద్దులను నిర్ధారించాలని స్పష్టం చేశారు. అటవీ భూములు పట్టా భూముల మధ్య సరిహద్దుల నిర్ధారణలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సర్వే సందర్భంగా రైతులకు ఎదురయ్యే సందేహాలు సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ సర్వే అటవీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సర్వే పనులను వేగవంతంగా పూర్తి చేయాలని భూముల హద్దులపై స్పష్టత తీసుకువచ్చి భవిష్యత్తులో భూ వివాదాలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ కరకగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి మెడికల్ ఆఫీసర్ రవితేజ అందుబాటులో లేకపోవడానికి గల కారణాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ విషయంపై సిబ్బంది పొంతన లేని సమాధానాలు ఇవ్వడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. మెడికల్ ఆఫీసర్‌కు ఛార్జ్ మెమో జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా మెడికల్ ఆఫీసర్ గైర్హాజరుపై సరైన సమాచారం ఇవ్వకుండా తప్పుడు సమాధానాలు అందించిన ఇద్దరు అవుట్‌సోర్సింగ్ జీఎన్ఎంలను విధుల నుంచి తొలగించాలని ఆదేశించారు.

ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చిన రోగులతో కలెక్టర్ మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందించడం వైద్యులు సిబ్బంది ప్రధాన బాధ్యత అని స్పష్టం చేశారు. వైద్యులు సిబ్బంది విధులకు సమయానికి హాజరై తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని రోగులకు వైద్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని ఆదేశించారు. ఆసుపత్రిలో వైద్య సేవలు రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ కాంతయ్య, సర్వేయర్ సందీప్, బట్టుపల్లి సర్పంచ్ తోలేం రమాదేవి, సంబంధిత వైద్య సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ సంతాన లక్ష్మీదేవి అలంకరణలో అమ్మవారు

- **పెద్దమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు**
- **అమ్మవారిని దర్శించుకున్న భక్తజనం**

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** శ్రీ దేవి శరన్నవరాత్రుల మహోత్సవ కార్యక్రమాలలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైటర్ బస్తి ఏరియా సింగరేణి సెంట్రల్ వర్క్ షాప్ ఆవరణలో ఉన్న శ్రీ శ్రీ శ్రీ పెద్దమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. దసరా ఉత్సవాలలో భాగంగా గురువారం శ్రీ సంతానలక్ష్మి దేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. పూజలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కుంకుమార్చన కూడా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు ఎల్ వి త్యాగరాజ శర్మ, అర్చకులు ఎల్వి పవన్ శర్మలు గోత్రనామాలు చదివిన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. దేవాలయాన్ని విద్యుత్ లైట్లతో అలంకరించారు. దీంతో ఆలయం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటుంది.



## లైసెన్స్ లేని వ్యాపారులపై చట్టపరమైన చర్యలు

**జిల్లా మార్కెటింగ్ అధికారి ఎంఏ అలీమ్**

కారేపల్లి, మహా: లైసెన్స్ లేని వ్యాపారులపై దాడులు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని భద్రాద్రికొత్తగూడెం జిల్లా మార్కెటింగ్ అధికారి ఎంఏ అలీమ్ గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఇల్లందు మార్కెటింగ్ పరిధిలో సింగరేణి మండలం వస్తుందని సింగరేణి మండల పత్తి, ధాన్యం, మొక్కజొన్న, మిర్చి వంటి పంట ఉత్పత్తులను కొనుగోలుకు తప్పసరిగా వ్యాపారులు లైసెన్స్ తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు చేయదలిచిన వ్యాపారులు ,మార్కెట్ కమిటీ నుండి లైసెన్స్ పొందిన తర్వాతనే ఉత్పత్తుల కొనుగోలు, నిల్వలు చేసుకోవాలని తెలిపారు. లైసెన్స్ లేకుండా పంట ఉత్పత్తులు కొనుగోలు చేసే వ్యాపారులపై తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులు, పశువుల మార్కెట్ల చట్టం 1966 ప్రకారం శిక్షార్హులన్నారు. లైసెన్స్ కోసం మార్కెట్ కమిటీ కార్యదర్శి సంప్రదించాలని కోరారు.



# ఆరోగ్య కేంద్రాలు పరిశుభ్రంగా ఉండాలి

- **శ్రమదానంతో మంచి వాతావరణం**
- **డీఎంహెచ్ఓ డాక్టర్ తుకారామ్ రాథోడ్**

**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: ఆరోగ్య కేంద్రాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటుగా శ్రమదానం నిర్వహించి వ్యర్థ పదార్థాలను నిబంధనల ప్రకారం తొలగించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ తుకారామ్ రాథోడ్ సూచించారు. గురువారం ఆయన జగన్నాధపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వెంగళరావు నగర్ ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహిస్తున్న రికార్డులు రిజిస్టర్లు ఇతర సంబంధిత పత్రాలను పరిశీలించి వైద్య సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. ఆరోగ్య కేంద్రాల పరిసరాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండాలని రోగులకు ఆహ్లాదకరమైన ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించాలని డీఎంహెచ్ఓ సూచించారు. ఇందులో భాగంగా ప్రతి ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది సమన్వయంతో శ్రమదానం నిర్వహించాలని ఆదేశించారు. శ్రమదానానికి ముందు అనంతరం తీసిన ఫొటోలను సంబంధిత అధికారులకు పంపించాలని స్పష్టం చేశారు. ఆసుపత్రి ప్రాంగణాలు రోగులు వేచి ఉండే ప్రదేశాలు గదులు పరిసరాల్లో చెత్త పేరుకుపోకుండా తగిన చర్యలు తీసుకోవాలని పరిశుభ్రత విషయంలో నిర్లక్ష్యం వహించరాదని సిబ్బందికి సూచించారు. ఆరోగ్య కేంద్రాల్లో చాలాకాలంగా ఉపయోగించకుండా ఉన్న నిరుపయోగ వస్తువులు వ్యర్థ పదార్థాలను గుర్తించి వాటి వివరాలతో కూడిన జాబితాను సిద్ధం చేయాలని డీఎంహెచ్ఓ ఆదేశించారు. అటువంటి వస్తువులను సంబంధిత నిబంధనలు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అవసరమైన అనుమతులు తీసుకుని వ్యర్థ పదార్థాల నిర్వహణ కమిటీ ద్వారా పారదర్శకంగా విక్రయించడం లేదా తొలగించడం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన వస్తువులను క్రమబద్ధంగా అమర్చుకోవాలని వినియోగంలో లేని వస్తువుల వల్ల స్థలం వృథా కాకుండా చూడాలని తెలిపారు. రికార్డుల నిర్వహణతో పాటు పరిసరాల పరిశుభ్రత వ్యర్థాల నిర్వహణపై కూడా సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని పేర్కొన్నారు. అనంతరం డీఎంహెచ్ఓ డాక్టర్ తుకారామ్ రాథోడ్ వెంగళరావు నగర్‌లోని నూతన సబ్ సెంటర్ భవనాన్ని పరిశీలించారు. భవనానికి చేరుకునే దారి (అప్రోచ్ రోడ్డు) స్థితిగతులపై సంబంధిత సిబ్బందితో చర్చించారు. ప్రజలకు ముఖ్యంగా గర్భిణులు చిన్నపిల్లలు వృద్ధులు ఇతర వైద్య సేవలు పొందేందుకు వచ్చే రోగులకు ఉపకేంద్రానికి చేరుకోవడంలో ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ సమస్య పరిష్కారానికి స్థానిక ప్రజాప్రతినిధులు నాయకులు కార్పొరేటర్‌తో సమన్వయం చేసుకుని భవనానికి సరైన రాకపోకల మార్గం ఏర్పాటు చేసే దిశగా కృషి చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు ప్రభుత్వ ఆరోగ్య సంస్థల్లో మౌలిక సదుపాయాలు పరిశుభ్రత రికార్డుల నిర్వహణ వ్యర్థ పదార్థాల క్రమబద్ధమైన తొలగింపు వంటి అంశాలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని డీఎంహెచ్ఓ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల సిబ్బంది ఈ సూచనలను పాటిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ తుకారామ్ రాథోడ్ సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మెహర్ ఉన్నిషా ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



## నక్క కనకయ్య మృతదేహానికి నివాళులర్పించిన

**బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష**

**పెద్దపల్లి మహా :** పెద్దపల్లి మండలం గౌరెడ్డిపేట గ్రామానికి చెందిన నక్క కనకయ్య మృతి విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష, బి ఆర్ ఎస్ నాయకులు ఆయన అంతిమయాత్రలో పాల్గొన్నారు. కనకయ్య భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.

# ఎన్ హెచ్‌ఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి

- **మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్**
- **నిరసనకు మద్దతు తెలిపిన నన్నపునేని**

**పోచమ్మ మైదాన్, మహా :** తెలంగాణ రాష్ట్రంలో ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న 17000 మంది ఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలని గ్రేటర్ వరంగల్ తొలి మేయర్, వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పోచమ్మ మైదాన్ జంక్షన్ వద్ద వరంగల్ జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం చేపట్టిన నిరవధిక నిరసన కార్యక్రమంలో వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ పాల్గొని సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు వైద్య సేవలు అందించడంలో నిరంతరం శ్రమిస్తున్నారని ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు, వారి సేవలకు తగిన గుర్తింపు, గౌరవం లభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా వారి ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఈ సందర్భంగా నరేందర్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ హెచ్ ఎం జేఏసీ స్టేట్ ప్రెసిడెంట్, ఫౌండర్ డాక్టర్ మహేందర్ రావు, స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ భరత్ కుమార్, స్టేట్ జనరల్ సెక్రటరీ డాక్టర్ రుకుముద్దీన్, వరంగల్ జిల్లా జేఏసీ నాయకులుఅనిల్, అంజి, నితిన్, డా రవీందర్, యశస్విని, డా రమ్య, డా హరి కృష్ణ, డా. హారిక, జ్యోతి, నర్మద, జ్యోతి, గీత, వైకుంఠం, తదితరులు పాల్గొన్నారు.



# గర్భిణులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి..

- **మణుగూరు పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు..**
- **చేతుల పరిశుభ్రతపై అవగాహన**

**మణుగూరు, మహా** : గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకుంటూ తల్లీబిడ్డల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ ఉమాదేవి సూచించారు. గురువారం మణుగూరు పీహెచ్‌సీలో ఆమె ఆధ్వర్యంలో గర్భిణులకు ప్రత్యేక ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా అవసరమైన రక్త పరీక్షలు నిర్వహించి, గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పోషక విలువలతో కూడిన సమతుల ఆహారం తీసుకోవాలని, వైద్యుల సూచనల మేరకు తేలికపాటి వ్యాయామాలు చేయాలని సూచించారు. సురక్షిత ప్రసవం కోసం ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలని అవగాహన కల్పించారు. అనంతరం ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని చేతులు శుభ్రంగా ఉంచుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. సబ్బుతో చేతులు కడుక్కోవడం ద్వారా అనేక అంటువ్యాధులను నివారించవచ్చని డాక్టర్ ఉమాదేవి తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యకరమైన జీవనం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో మణుగూరు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## చైతన్య డీమ్డ్ టు బి యూనివర్సిటీలో ఘనంగా బతుకమ్మ, గర్బా, దాండియా నృత్యాలు

**మొయినాబాద్ మహా**: మొయినాబాద్ మున్సిపాలిటీ హిమాయత్‌నగర్ లోగల చైతన్య డీమ్డ్ టు బి యూనివర్సిటీలో బతుకమ్మ పండుగ, గర్బా, దాండియా నృత్యాలు మరియు అంతర్జాతీయ విద్యార్థుల దినోత్సవ వేడుకలను ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగతో పాటు, భారతీయ సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రతిబింబించే గర్బా, దాండియా నృత్యాలు ఈ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు తమ సంప్రదాయాలను చాటుతూ, పరస్పర సాంస్కృతిక ఐక్యతను ప్రతిబింబించేలా కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి, రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, తెలంగాణ జానపద గీతాల నడుమ బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం గుజరాతీ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలైన గర్బా, దాండియా నృత్యాలను ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. సంప్రదాయ సంగీతం, కళాత్మక నృత్యాలు, విద్యార్థుల ఉత్సాహంతో విశ్వవిద్యాలయ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. అంతర్జాతీయ విద్యార్థుల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థుల ప్రతిభ, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, సాంస్కృతిక ఐక్యత ప్రాధాన్యతను వివరించారు. విద్య అనేది కేవలం పాఠ్య పుస్తకాలకే పరిమితం కాకుండా, వివిధ సంస్కృతులు, సంప్రదాయాల పట్ల గౌరవం, పరస్పర అవగాహన, సహనం, సహకార భావనలను పెంపొందించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. విభిన్న నేపథ్యాలకు చెందిన విద్యార్థులు ఒకే వేదికపై కలిసి వేడుకలు జరుపుకోవడం ద్వారా స్నేహభావం, ఐకమత్యం, జాతీయ సమైక్యత మరింత బలపడతాయని తెలిపారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వ్యవస్థాపకులు, ఛాన్సలర్ డాక్టర్ సిహెచ్.వి. పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు జీవన ప్రతీకగా నిలుస్తుంది. మన సంస్కృతి, వారసత్వ సంపదను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత. విద్యార్థులు విద్యతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించుకోవాలి. అంతర్జాతీయ విద్యార్థుల దినోత్సవం విద్యార్థుల శక్తిసామర్థ్యాలు, ఆశయాలు, భవిష్యత్తు లక్ష్యాలను గుర్తుచేసే సందర్భం. నేటి విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్తుకు మార్గదర్శకులు. విభిన్న సంస్కృతులను గౌరవిస్తూ, ఐకమత్యంతో ముందుకు సాగినప్పుడే సమాజంలో సౌభ్రాతృత్వం, సామరస్యం, సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతాయి అన్నారు. అనంతరం విశ్వవిద్యాలయ డైరెక్టర్ & చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సి.హెచ్. సాత్విక రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల సమగ్ర వికాసంలో విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, కళలు, క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఇలాంటి వేడుకలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, బృంద స్ఫూర్తి, పరస్పర గౌరవాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. వివిధ ప్రాంతాలు, భాషలు, సంప్రదాయాలకు చెందిన విద్యార్థులు ఒకే వేదికపై కలిసి వేడుకలు జరుపుకోవడం భారతీయ సంస్కృతిలోని భిన్నత్వంలో ఏకత్వానికి నిదర్శనమని అన్నారు. విద్యార్థులు తమ విద్యా, వృత్తిపరమైన లక్ష్యాలను సాధించడంతో పాటు, సమాజం పట్ల బాధ్యత కలిగిన ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య జి. శంకర్ లింగం, రిజిస్ట్రార్ ఆచార్య ఎం. రవీందర్, వివిధ విభాగాల డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ & పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ గాదె రాంబాబు రెడ్డి, తదితరులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.



## క్రీడా పోటీలు ప్రారంభించిన ఎస్సై శ్రీకాంత్ రెడ్డి

**వలిగొండ అక్టోబర్ 15 మహా న్యూస్ :** మండల పరిధిలోని వెలువర్తి గ్రామంలో వెలువర్తి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయదశమి సందర్భంగా నిర్వహిస్తున్న క్రీడోత్సవాలను గ్రామంలోని ప్రొఫెసర్ జయశంకర్ మినీ స్టేడియంలో గురువారం ప్రారంభించారు. క్రీడా ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎస్సై శ్రీకాంత్ రెడ్డి పాల్గొని క్రీడలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం శారీరిక దారుఢ్యం ఏర్పడతాయని పోటీలలో గెలుపోటములు సహజమని ఓటమిలను విజయానికి మలుపుగా మలుచుకొని జీవితంలో ఎదగాలని ఆయన క్రీడాకారులకు సూచించారు. అనంతరం క్రీడాకారులతో పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అనిత నర్సింగ్ యాదవ్, యూత్ అసోసియేషన్ అధ్యక్షులు కూచిమల్ల సుధాకర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి గిరిబాబు, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు ఉక్కుర్తి స్వామి, ఎడవెల్లి మల్లేశం, మాజీ అధ్యక్షులు బైరు సైదులు, కలుకూరి మహేష్, వర్కింగ్ ప్రెసిడెంట్లు నాగిళ్ళ రాము, బూడిద రాజు, ఉపాధ్యక్షులు పరకాల దశరథ, మల్లం ఉపేందర్, చెవ్వ పవన్, సూరబోయిన దయాకర్, కోశాధికారి మల్లం సాయి, ప్రధాన కార్యదర్శులు బోదాసు రాజు, క్రీడ కార్యదర్శులు పరకాల కిషోర్, మల్లం చంద్రమౌళి, ఎడవెల్లి వెంకటేశం, తక్కల్ల సురేష్, కార్యదర్శులు బద్దుల ప్రశాంత్, సలహాదారు ఇంజమూరి శేఖర్, ఎడవల్లి విజయ్, పిట్టల నరేష్, నిమ్మల శేఖర్, కూచిమల్ల రాము, యూత్ సభ్యులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు భరోసా.. రూ.1.40 కోట్ల చెక్కుల పంపిణీ

**140 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందజేసిన ప్రభుత్వ విప్ విజయ రమణారావు**

**పెద్దపల్లి మహా :** సుల్తానాబాద్: అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక భరోసాలో భాగంగా కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద 140 మంది లబ్ధిదారులకు రూ.1,40,16,240 విలువైన చెక్కులను ప్రభుత్వ విప్ విజయ రమణారావు పంపిణీ చేశారు. గురువారం సుల్తానాబాద్ పట్టణంలోని ఎస్వీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. సుల్తానాబాద్ పట్టణం, సుల్తానాబాద్ మండలం, ఎలిగేడు మండలాలకు చెందిన లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా సుల్తానాబాద్ మున్సిపల్ కార్మికులకు దుస్తులను పంపిణీ చేశారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా అర్హులైన కుటుంబాలకు ఆర్థిక సహాయం అందుతుండగా, మున్సిపల్ కార్మికులకు దుస్తుల పంపిణీ కార్యక్రమం కూడా నిర్వహించడం విశేషం. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపే మనందరి లక్ష్యం

- ఓటర్ల నమోదు ప్రక్రియ మరింత వేగవంతం చేయాలి
- పట్టభద్రులు సరైన అభ్యర్థిని ఎన్నుకోవాలి
- బూత్ స్థాయి నుంచి సమన్వయంతో పనిచేయాలి
- పార్టీ శ్రేణులకు డీసీసీ అధ్యక్షుడు ఇనగాల పిలుపు



**హనుమకొండ మహా** : వరంగల్‌ఖమ్మం నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా గురువారం హనుమకొండ జిల్లా లోని మడికొండ లో ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని భారీ మెజారిటీ తో గెలిపించడమే మనందరి లక్ష్యంగా పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పిలుపునిచ్చారు. మడికొండ లోని సత్యసాయి కన్వెన్షన్‌లో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థికి పట్టభద్రులు భారీ మెజారిటీ అందించారని గుర్తుచేశారు. అదే విజయ పరంపరను రాబోయే ఎన్నికల్లోనూ కొనసాగించాలని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం చేపడుతున్న ఉద్యోగ నియామకాలు, సంక్షేమ పథకాలు, విద్యా, ఉపాధి రంగాల్లో సాధిస్తున్న ప్రగతిని పట్టభద్రుల కు వివరించాలని సూచించారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడిని గుర్తించి ఓటరుగా నమోదు చేయించడంతోపాటు, పోలింగ్ బూత్ స్థాయి నుంచి సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసి ప్రచారాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కోరారు. ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని, ఈ ఎన్నికల్లోనూ పార్టీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

**ఓటర్ల నమోదు పై ప్రత్యేక దృష్టి**

ఈ సమావేశంలో పాల్గొన్న ఎంపీలు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, నిరుద్యోగులకు కల్పిస్తున్న ఉద్యోగ అవకాశాలను పట్టభద్రులకు వివరించాలని సూచించారు. నవంబర్ 6వ తేదీలోగా అర్హులైన ప్రతి పట్టభద్రుడిని గుర్తించి ఫారం18 ద్వారా ఓటరుగా నమోదు చేయించే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేస్తూ ఓటర్ల నమోదు ప్రక్రియను పూర్తి స్థాయిలో పర్యవేక్షించాలని తెలిపారు.

**సమన్వయంతో పనిచేయాలి**

అనంతరం ఈ సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గం, మండలం, గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పోలింగ్ బూత్ స్థాయి నుంచి ప్రచార కార్యక్రమాలను నిర్వహించి, కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. పట్టభద్రుల సమస్యలను శాసనమండలిలో వినిపించే నాయకుడిగా ఆయనను గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ధనసరి అనసూయ (సీతక్క), రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ఎంపీలు బలరాం నాయక్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, శంకర్ నాయక్, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, దొంతి మాధవరెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ రావు, కె.ఆర్. నాగరాజు, యశస్విని రెడ్డి, జాటోత్ రాంచంద్రు నాయక్, డాక్టర్ భూక్య మురళి నాయక్, డిసిసి అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్, తదితర ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, జిల్లా కమిటీలు పాల్గొన్నారు.



## మత్స్యగిరి బయో గ్యాస్ కంపెనీ కి భూమి పూజ నిర్వహించిన అతిరత్ గ్రూప్

**వలిగొండ అక్టోబర్ 15 మహా న్యూస్** : మండల పరిధిలోని నర్సాపురం గ్రామ పంచాయితీ ఆవాస గ్రామమైన పిసరి వారి గూడెంలో గురువారం అతిరద్ గ్రూప్ ప్రైవేట్ లిమిటెడ్ సౌజన్యంతో నెలకొల్పబడిన మత్స్యగిరి బయోగ్యాస్ కంపెనీకి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ బాలకృష్ణ మాట్లాడుతూ బయోగ్యాస్ కంపెనీని గ్రామీణ ప్రాంతంలో నెలకొల్పబడడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తుందని దీని ద్వారా ఎంతో మంది రైతులకు లబ్ధి చేకూరడంతో పాటు గ్రామీణ యువతకు పట్టణాలకు వెళ్లకుండా ఉపాధి అవకాశాలు దొరుకుతాయని అన్నారు. ఈ యొక్క బయోగ్యాస్ కంపెనీలు తెలంగాణలో 25 ఆంధ్రాలో 25 నెలకొల్పేందుకు శ్రీకారం చుట్టామని మొట్టమొదటి బయోగ్యాస్ కంపెనీ మత్స్యాద్రి పుణ్యక్షేత్ర పరిధిలో ప్రారంభించడం శుభ సూచకమని అన్నారు. ఈ కార్యక్రమంలో భూమి యజమాని పిసరి వెంకట్ రెడ్డి, సాయికుమార్ , బాలకృష్ణ కేశవ్, సర్పంచ్‌లు కావటి మంజుల ఉప్పలయ్య, సామ సరస్వతి రామ్ రెడ్డి, గ్రామ ప్రజలు యువత తదితరులు పాల్గొన్నారు.



## తండ్రి బాటలోనే తనయులు

- శానిటేషన్ సిబ్బందికి దుస్తుల పంపిణీ
- కార్పొరేటర్ యెలగం శ్రీనివాస్ కుమారులు

**పోచమ్మ మైదానం మహా** ; వరంగల్ తూర్పు నియోజకవర్గం 23వ డివిజన్ కొత్తవాడకు చెందిన మాజీ కార్పొరేటర్, కుడా డైరెక్టర్ కీర్తిశేషులు యెలుగం శ్రీనివాస్ జ్ఞాపకార్థం వారి కుమారులు యెలుగం రాకేష్, రాజేష్ మున్సిపల్ శానిటేషన్ సిబ్బందికి దుస్తులు పంపిణీ చేసి తండ్రికి తగ్గ తనయులుగా చరిత్రలో నిలిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గత 22 సంవత్సరాల నుండి మా తండ్రి యెలుగం శ్రీనివాస్ డివిజన్ లోని పేద ప్రజలకు, శానిటేషన్ సిబ్బందికి, దుస్తులు పంపిణీ చేయడం జరిగిందని అలాగే మా నాన్న ఆశయాలను సేవలను ముందుకు తీసుకువెళ్లాలనే సదుద్దేశంతో ఆయన లాగే ప్రజలకు సంపూర్ణమైన సేవలు అందిస్తామని డివిజన్ ప్రజలకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యెలుగం రాజేష్, శ్రీకాంత్, శ్రీనాథ్, 22 వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి, 23వ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ చిప్ప వెంకటేశ్వర్లు, మాజీ కార్పొరేటర్ దామెర సర్వేశ్, ఎస్సీ సెల్ మాజీ సిటీ కన్వీనర్ జన్ను ప్రమోద్, దువ్వాళ రాజేందర్, కటకం విజయ్ కుమార్ తో పాటు మున్సిపల్ జవాన్లు కుమార్, సాంబయ్య, మహిళా కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.




## ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

- హెవీ వెహికల్స్ ఇష్టారీతిన పార్కింగ్ చేస్తే కఠిన చర్యలు
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్
- ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి రోడ్డు భద్రతా కమిటీ సమావేశం

**హనుమకొండ, మహా ;** రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో రోడ్లు, భవనాలు శాఖ ఆధ్వర్యంలో... జిల్లా స్థాయి రోడ్డు భద్రతా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో రోడ్డు భద్రత సంబంధించి చేపట్టిన చర్యల గురించి ఆర్ అండ్ బి ఈఈ దేవిక వివరించారు. కోమటి పల్లి పరిధిలో ఉన్న ఎన్ హెచ్ రోడ్డు పై ట్రక్ లే బై ఏర్పాటుకు చర్యలు , వంగపహాడ్ వద్ద రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ఎన్ హెచ్ అధికారులు కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ.. రోడ్డు భద్రతా నియమాలకు విరుద్ధంగా హెవీ వాహనాలు, ప్రైవేట్ టాక్సీలు రోడ్ల పక్కన నిలిపి ఉంచడం వలన ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతాయని, రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని అన్నారు.రహదారులపై లైన్ మార్కింగ్ సరిగ్గా ఉండాలన్నారు. నూతనంగా బీటీ రోడ్డు వేసిన హసన్ పర్తి వైపు లైన్ మార్కింగ్, స్టడ్స్ ఏర్పాటు చేయాలని ఎన్ హెచ్ అధికారులను ఆదేశించారు. వంగపహాడ్ వద్ద రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్న బ్లాక్ స్పాట్స్ ను గుర్తించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశం లో అదనపు కలెక్టర్ ఎన్. రవి, ట్రాఫిక్ అదనపు డీసీపీ ప్రభాకర్ రావు, ఎన్ హెచ్ మేనేజర్ లింగయ్య, హనుమకొండ ఏసీపీ నరసింహారావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నర్సంపేట పగ్గాలు పోచంపల్లి కే తుది నిర్ణయం పై బీఆర్ఎస్ లో ఉత్కంఠ

నర్సంపేట, మహా : వరంగల్ జిల్లా నర్సంపేట బీఆర్ఎస్ రాజకీయాల్లో నాయకత్వం పై నెల కొన్న ఉత్కంఠకు తెరపడనుంది. దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మరణంతో ఖాళీ అయిన నియోజకవర్గ బాధ్యతలను ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసరెడ్డికి తాత్కాలికంగా అప్పగించాలని పార్టీ అధిష్ఠానం నిర్ణయించినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ మేరకు గురువారం ఉదయం తెలంగాణ భవన్‌లో వరంగల్ జిల్లా బీఆర్ఎస్ నేతలతో జరగనున్న సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. పెద్ది సతీమణి స్వప్న సుదర్శన్‌రెడ్డికి ఇప్పటికిప్పుడు పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించకుండా, పార్టీ వ్యవహారాలను సమన్వయం చేసేందుకు మరో నేతను ముందుకు తీసుకురావాలని పార్టీ పెద్దలు యోచిస్తున్నట్లు తెలుస్తోంది.



## చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

- ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్
- రాష్ట్రస్థాయి పాఠశాలల టెన్నిస్ పోటీలకు ఘనంగా శ్రీకారం

**హనుమకొండ, మహా;** హనుమకొండ లోని జేఎన్ఎస్ స్టేడియం వేదికగా 70వ తెలంగాణ రాష్ట్రస్థాయి పాఠశాల క్రీడా సమాఖ్య లాన్ టెన్నిస్ టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్ గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. హనుమకొండ జిల్లా విద్యాశాఖ అధికారి గిరిరాజు గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు టెన్నిస్ ఆడి పోటీలను ప్రారంభించి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. అక్టోబర్ 15 నుంచి 17వ తేదీ వరకు మూడు రోజులపాటు నిర్వహించే ఈ పోటీల్లో అండర్ 17, అండర్ 19 విభాగాల్లో బాలబాలికలు పాల్గొంటున్నారు.రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను తదుపరి స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహమ్మద్ అజీజ్ ఖాన్, అండర్ 19, అండర్ 17 పాఠశాలల క్రీడా కార్యదర్శులు శ్రీధర్, వాసుదేవరావు, హనుమకొండ డిస్ట్రిక్ట్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, క్రీడా నిర్వాహకులు, అధికారులు, కోచ్‌లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి వరంగల్ జిల్లా జేఏసీ చైర్మన్‌గా ఎమ్మార్వో ఇక్బాల్

**ఉద్యోగులతో ముఖాముఖి సమావేశం విజయవంతం కావడంలో కీలక పాత్ర**

వరంగల్,బ్యూరో మహా ; ఉమ్మడి వరంగల్ జిల్లా జేఏసీ చైర్మన్‌గా తహసీల్దార్ ఇక్బాల్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు ఉద్యోగులు, పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల ఉమ్మడి వరంగల్ జిల్లాలో నిర్వహించిన ఉద్యోగుల ముఖాముఖి సమావేశానికి అధిక సంఖ్యలో ఉద్యోగులు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయడంలో ఎమ్మార్వో ఇక్బాల్ కీలక పాత్ర పోషించారని పలువురు అధికారులు అభినందించారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంతో పాటు వారి హక్కుల సాధనకు జేఏసీ వేదికగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఇక్బాల్ నాయకత్వంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మరిన్ని కార్యక్రమాలు చేపట్టి, ఉద్యోగుల ఐక్యతను బలోపేతం చేయాలని కోరారు. జేఏసీ చైర్మన్ గా నియమితులైన ఇక్బాల్ కు అధికారులు, శ్రేయోభిలాషులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## ఎన్.హెచ్.ఎం. ఉద్యోగుల ధర్నాకు బీజేపీ మద్దతు

- మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్ గౌడ్

**మంచిర్యాల, మహా ప్రతినిధి** : సమాన పనికి సమాన వేతనం నినాదంతో గత మూడు రోజులుగా మంచిర్యాల కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న ఎన్.హెచ్.ఎం. ఉద్యోగులకు బీజేపీ మద్దతు తెలిపింది. గురువారం బీజేపీ జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు ధర్నా శిబిరానికి వెళ్లి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ, సమాన పనికి సమాన వేతనంతో పాటు ఎన్.హెచ్.ఎం. ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. మహారాష్ట్ర, అరుణాచల్ ప్రదేశ్, హర్యానా, రాజస్థాన్, పంజాబ్ వంటి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎన్.హెచ్.ఎం. ఉద్యోగులకు సమాన వేతనం ఇచ్చి పర్మినెంట్ చేశారని, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా చిత్తశుద్ధితో వారి డిమాండ్లను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మంచిర్యాల కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ ముఖేష్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు కమలాకర్ రావు, పట్టి వెంకటకృష్ణ, జిల్లా కార్యదర్శి రాచర్ల సంతోష్, నస్పూర్ జోన్ అధ్యక్షులు కుర్ర చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



## పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా ఫోటోగ్రఫీ, షార్ట్ ఫిలిమ్స్ పోటీలు

- పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల యువతకు అవకాశం
- ఈ నెల 23వ తేదీలోగా ఎంట్రీలు సమర్పించాలి
- సీపీ అంబర్ కిషోర్ ఝా



**పెద్దపల్లి మహా** : రామగుండం: పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల యువత, ఔత్సాహిక ఫోటోగ్రాఫర్లకు ఫోటోగ్రఫీ, షార్ట్ ఫిలిమ్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో, ప్రజల రక్షణలో విధులు నిర్వహిస్తూ ప్రాణత్యాగం చేసిన అమర పోలీసుల సేవలు, త్యాగాలను స్మరించుకుంటూ అక్టోబర్ 21న నిర్వహించే పోలీస్ ఫ్లాగ్ డేను పురస్కరించుకుని ఈ పోటీలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పోలీసుల సేవలు, త్యాగాలు, విధి నిర్వహణలో వారి అంకితభావాన్ని ప్రతిబింబించేలా ఫోటోలు, షార్ట్ ఫిలిమ్స్ రూపొందించాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు పోలీసులకు సంబంధించిన అంశాలపై చిత్రీకరించిన మూడు ఫోటోలు, మూడు నిమిషాలకు మించని ఒక షార్ట్ ఫిలింను ఈ నెల 23వ తేదీ సాయంత్రంలోగా రామగుండం పోలీస్ కమిషనరేట్‌లోని స్పెషల్ బ్రాంచ్ (ఎస్ఐబీ) కార్యాలయంలో సమర్పించాలి. ఫోటోలు 10×8 అంగుళాల పరిమాణంలో ఉండాలి. షార్ట్ ఫిలింను పెన్‌డ్రైవ్‌లో, పూర్తి వ్యక్తిగత వివరాలతో అందజేయాలి. కమిషనరేట్ స్థాయిలో ఎంపిక చేసిన మూడు ఉత్తమ ఫోటోలు, మూడు ఉత్తమ షార్ట్ ఫిలిమ్స్‌ను రాష్ట్రస్థాయి పోటీలకు హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయానికి పంపించనున్నట్లు సీపీ వెల్లడించారు. యువత, ఔత్సాహిక ఫోటోగ్రాఫర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, పోలీసుల సేవలు, త్యాగాలను ప్రజలకు చాటిచెప్పేలా తమ సృజనాత్మక ప్రతిభను ప్రదర్శించాలని కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పిలుపునిచ్చారు.



## బతుకమ్మ పండుగకు పాలకుర్తిలో ప్రత్యేక ఏర్పాట్లు.

- చెరువు పరిసరాల శుభ్రతకు గ్రామపంచాయతీ చర్యలు

**పాలకుర్తి, 15 అక్టోబర్ మహా** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం పాలకుర్తి మండల కేంద్రంలో చెరువు వద్ద గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. పండుగ సందర్భంగా మహిళలకు, గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చెరువు పరిసర ప్రాంతాలను శుభ్రం చేయించారు. మహిళలు సంతోషంగా, సౌకర్యవంతంగా బతుకమ్మ వేడుకల్లో పాల్గొనేలా పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. పండుగకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చెరువు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు గ్రామపంచాయతీ సిబ్బంది సహకారంతో శుభ్రత పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి గ్రామ సర్పంచ్ పెద్దపల్లి తిరుమల, ఎంపీఓ సుదర్శన్, గ్రామపంచాయతీ కార్యదర్శి సిలగాని శ్రీధర్‌తో పాటు గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.




## ప్రకృతి ఆరాధనకు ప్రతీక బతుకమ్మ పండుగ

- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక
- ఇంచార్జి కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి ఐఏఎస్

**ఇబ్రహీంపట్నం అక్టోబర్ 15 మహా**: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ ప్రకృతిని ఆరాధిస్తూ, మానవాళిని ప్రకృతికి దగ్గర చేసే గొప్ప వేడుక అని ఇంచార్జీ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి అన్నారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) ఆవరణలో మహిళా శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, మెప్మా, అడల్ట్ ఎడ్యుకేషన్ తదితర శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఇంచార్జీ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి పాల్గొని పూజలు నిర్వహించి వేడుకలను ప్రారంభించారు. అనంతరం మహిళా ఉద్యోగులతో కలిసి బతుకమ్మ ఆడి సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంచార్జీ కలెక్టర్ మాట్లాడుతూ... ప్రకృతిలో లభించే వివిధ రకాల పూలతో బతుకమ్మను అందంగా పేర్చి పూజించడం ఈ పండుగ ప్రత్యేకత అని తెలిపారు. మహిళలకు ఎంతో ప్రత్యేకమైన బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబంగా నిలుస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రానికే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఈ పండుగ తెలంగాణ ప్రజల సాంస్కృతిక వైభవాన్ని చాటిచెబుతోందని అన్నారు. మహిళలంతా ఒకచోట చేరి తొమ్మిది రోజులపాటు ఆనందోత్సాహాలతో బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకుంటారని తెలిపారు. ప్రకృతిని గౌరవిస్తూ, మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేలా ప్రతి ఒక్కరూ పండుగలను సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి శాంతిశ్రీ, అడల్ట్ ఎడ్యుకేషన్ అధికారి అనిత, వైద్య ఆరోగ్య శాఖ, మెప్మా, రెవెన్యూ తదితర శాఖలకు చెందిన మహిళా అధికారులు, సిడిపిఒలు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## విద్యుత్ సంక్షోభానికి ప్రభుత్వ ప్రణాళికా లోపాలే కారణం

**సురేష్ సస్పెన్షన్ అన్యాయం..**

**అధికారులను బలిపశువులను చేయొద్దు**

**హైదరాబాద్, మహా:** తెలంగాణలో విద్యుత్, నీటి సంక్షోభానికి ప్రభుత్వ ప్రణాళికా లోపాలే కారణమని టీఎన్జీవో మాజీ అధ్యక్షుడు దేవీప్రసాద్ విమర్శించారు. బొగ్గు సరఫరాలో వైఫల్యాలను సరిదిద్దకుండా వైటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ సురేష్‌ను సస్పెండ్ చేయడం అన్యాయమన్నారు. విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన బొగ్గును సమయానికి సరఫరా చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు సంబంధిత యాజమాన్యాలపై ఉందని పేర్కొన్నారు. ముడిసరుకు అందుబాటులో లేకపోతే అధికారులు ఉత్పత్తి లక్ష్యాలను ఎలా చేరుకుంటారని ప్రశ్నించారు. వైటీపీఎస్ స్టేజ్ 1లో లోపాలపై చర్యలు తీసుకున్నప్పుడు స్టేజ్ 2 పరిస్థితుల పైనా సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ఉత్పత్తి తగ్గడానికి గల కారణాలను నిష్పక్షపాతంగా పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. గోదావరిలో నీటి లభ్యత ఉన్నప్పటికీ ఎత్తిపోతలలో వైఫల్యాల కారణంగా నీటి కొరత ఏర్పడుతోందని ఆరోపించారు. వ్యవస్థాగత లోపాలకు క్షేత్రస్థాయి అధికారులను బలిపశువులను చేయకుండా, ప్రభుత్వ ప్రణాళికలను సమీక్షించి విద్యుత్ సంస్థల పనితీరుపై సమగ్ర విచారణ జరపాలని దేవీప్రసాద్ కోరారు.

## పేదలకు కార్పొరేట్ వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- సూపర్ స్పెషాలిటీ లో 20 నుంచి పరిమిత వైద్య సేవలు ప్రారంభం
- డిసెంబర్ నెలాఖరుకల్లా పూర్తి స్థాయి వైద్య సేవలు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**వరంగల్, మహా ;** ప్రైవేట్ ఆసుపత్రులకు దీటుగా పేద ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను అందించడమే రాష్ట్ర ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. వైద్య ఖర్చుల భారం కారణంగా పేదలు ఇబ్బందులు పడకూడదని, ప్రతి ఒక్కరికీ నాణ్యమైన ఉచిత వైద్యం అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. గురువారం వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ధనసరి అనసూయ సీతక్క, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, పరకాల శాసన సభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి,వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య తో పాటు తెలంగాణా రాష్ట్ర వైద్యం ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డా. క్రిస్టినా జెడ్ చొంగ్తు, కూడా చైర్మెన్ గుండు సుధారాణి, వరంగల్, హన్మకొండ జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, చాహత్ బాజ్ పాయి, ఎన్పిడిసిఎల్ సిఎండి వరుణ్ రెడ్డి సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. అనంతరం నిర్వహించిన ప్రెస్‌మీట్ లో ఇంచార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ఉత్తర తెలంగాణ ప్రజలు అత్యాధునిక వైద్య చికిత్సల కోసం హైదరాబాద్ కు వెళ్లాల్సిన అవసరాన్ని తగ్గించి, వరంగల్ లోనే మెరుగైన వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో పేదలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు అవసరమైన వైద్య పరికరాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఇతర మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఎలా ఉన్నప్పటికీ పేదల ఉచిత వైద్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు.వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లో దసరా సందర్భంగా ఈనెల 20 నుండి పరిమిత వైద్య సేవలను ప్రారంభించనున్నట్లు మంత్రి వెల్లడించారు. అలాగే నవంబర్ లో మరిన్ని వైద్య సేవలు అంధుబాటులోకి తీసుకువచ్చి డిసెంబర్ నెల చివరికల్లా పూర్తి స్థాయిలో వైద్య సేవలను అందిస్తామన్నారు . ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలే కాకుండా ఖమ్మం, వరంగల్,నల్గొండ, ఆదిలాబాద్, మహబూబాబాద్, మెదక్ జిల్లాల ప్రజలు ఎంజిఎం లో నాణ్యమైన వైద్య అందుతుందని నమ్మకంతో వస్తున్నారని,ఆ నమ్మకాన్ని మరింత బలపడేలా ఉండేందుకు ఈ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని కార్పొరేట్ వైద్యానికి దీటుగా ఈ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మించడం జరిగిందని నిర్మాణం తుది దశకు చేరుకుందని వారు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం విద్యకు వైద్యానికి పెద్ద పీట వేస్తుందన్నారు. గిరిజన, గురిజనేతరులకు కార్పొరేట్ స్థాయిలో ఉచిత వైద్యం అందించడం ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రస్తుతం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో రోజుకు సుమారు మూడు వేల మందికి పైగా రోగులకు వైద్య సేవలు అందిస్తున్నామన్నామని మంత్రి తెలిపారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే రోజుకు నాలుగు నుంచి ఐదు వేల మందికి వైద్య సేవలు అందించే సామర్థ్యం పెరుగుతుందని వివరించారు.ఈ పరిశీలనలో డీఎంఈ డాక్టర్ వాణి, డా విమల థామస్,అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్ కిషోర్ కుమార్, బల్దియా కమిషనర్ వెంకన్న,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు రాజా రెడ్డి,ఎంజీఎం సూపరింటెండెంట్ డా. రాంకుమార్, ఆర్ఎంఒ డా. అశ్విన్ తో పాటు వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సుమా, ఉమారాణి పాటు ఆరోగ్య, వైద్య, ఇంజినీరింగ్ ఉన్నతాధికారులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## దొంగలున్నారుజాగ్రత్త!కరపత్రంవిడుదల..

- దొంగతనాలు దోపిడీలపై ప్రయాణికులకు అవగాహన..
- అనుమానితుల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- డయల్ 112: సర్కిల్ ఇన్ స్పెక్టర్ మహేందర్ రెడ్డి




**ఇబ్రహీంపట్నం అక్టోబర్ 15 మహా**: అనుమానిత వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే వెంటనే 112 నెంబర్ కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని, ఇబ్రహీంపట్నం ఇన్ స్పెక్టర్ మహేందర్ రెడ్డి, ప్రయాణికులకు సూచిస్తూ, దొంగలున్నారు జాగ్రత్త! అనే శీర్షికతో కరపత్రాన్ని విడుదల చేశారు.. ఇబ్రహీంపట్నం బస్ స్టాండ్ లో గురువారం ఏసిపి కెపివి రాజు నేతృత్యంలో, సర్కిల్ ఇన్ స్పెక్టర్ మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో, బస్ స్టేషన్ల లో జరుగుతున్న దొంగతనాలు, దోపిడీల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు, ఇబ్రహీంపట్నం పోలీసులు ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజల అవగాహన కోసం రూపొందించిన ప్రత్యేక అవగాహన కల్పిస్తూ, దొంగలున్నారు జాగ్రత్త !అనే శీర్షికతో కరపత్రాన్ని విడుదల చేశారు. సిఐ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రజల భద్రతే మన లక్ష్యమని దొంగతనాల నివారణలో ప్రజల భాగస్వామ్యం కీలకమని ఆయన అన్నారు. ప్రజలు బస్టాండ్లో బస్సులు ఎక్కి దిగే సమయంలో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అనుమానిత వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే వెంటనే 112 నెంబర్ కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని ఆయన ప్రయాణికులకు సూచించారు.

## అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్ట్ ను వేగవంతం చేయాలి

- మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యదర్శి డాక్టర్ టి.కె. శ్రీదేవి



**కార్పొరేషన్, మహా** : వరంగల్ నగరంలో ప్రతిపాదిత అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్టు పురోగతి పై మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యదర్శి, సీడీఎంఏ డాక్టర్ టి.కె. శ్రీదేవి గురువారం హైదరాబాద్ నుంచి కేఎఫ్‌డబ్ల్యూ సంస్థ ప్రతినిధులు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు.

ఈ సందర్భంగా జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న తన క్యాంపు కార్యాలయం నుంచి వీసీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్, టెండర్ ప్రక్రియ, తదితర కీలక అంశాలపై చర్చించి, పనులను ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన చర్యలను సమీక్షించారు.

ఈ సందర్భంగా డాక్టర్ టి.కె. శ్రీదేవి మాట్లాడుతూ, వరంగల్ నగరంలో భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ అభివృద్ధి ప్రజారోగ్య పరిరక్షణకు, పారిశుధ్య మెరుగుదలకు ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక, పరిపాలనా అంశాలను సమన్వయంతో పరిష్కరిస్తూ, టెండర్ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ టి. వెంకన్న మాట్లాడుతూ, వరంగల్ నగరంలో సమగ్ర అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు ద్వారా మురుగునీటి నిర్వహణను మెరుగుపరచడంతోపాటు, నగర ప్రజలకు మెరుగైన పారిశుధ్య సదుపాయాలు కల్పించేందుకు ప్రాజెక్టు దోహదపడుతుందని తెలిపారు. సంబంధిత శాఖలు, కేఎఫ్‌డబ్ల్యూ ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ ప్రాజెక్టుకు సంబంధించిన తదుపరి చర్యలను వేగవంతం చేస్తామని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పబ్లిక్ హెల్త్ శాఖ ఇంజినీర్ఇన్‌చీఫ్ సాయప్ప రెడ్డి , పబ్లిక్ హెల్త్ ఎస్ ఈ రంజిత్, బల్దియా ఈఈ మహేందర్, డిఈ కార్తీక్ రెడ్డి, కేఎఫ్‌డబ్ల్యూ సంస్థ ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో బతుకమ్మ సంబరాలు

**ఆటపాటలతో సందడి చేసిన వరంగల్ సీపి, సెంట్రల్ జోన్ డీసీపీ**



**హనుమకొండ, మహా ;** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీసు కానిస్టేబుళ్ల నుంచి మొదలుకొని ఉన్నతాధికారుల కోసం గురువారం సాయంత్రం హనుమకొండ పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్, సెంట్రల్ జోన్ డీసీపీ దార కవితతో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు. పోలీస్ కమిషనర్, సెంట్రల్ జోన్ డీసీపీ లు స్వయంగా సంప్రదాయ పాటలను ఆలపిస్తూ, మహిళా సిబ్బందితో కలిసి నృత్యాలు చేస్తూ మహిళా పోలీసు సిబ్బందిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ మనం ఎంత ఆధునిక జీవనశైలికి అలవాటు పడినా, మన మూలాలను, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ఎట్టి పరిస్థితుల్లోనూ మరచి పోకూడదని పేర్కొన్నారు. విధి నిర్వహణలో నిర్విరామంగా బాధ్యతలు నిర్వర్తించే పోలీసు సిబ్బందికి ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఆహ్లాదాన్ని, మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని, హైదరాబాద్ వంటి మహానగరాల తో పోలిస్తే వరంగల్ లోనే బతుకమ్మ ఉత్సవాలను ఎంతో ఘనంగా, సంప్రదాయబద్ధంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. బతుకమ్మ ఉత్సవాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటుతూ ఎంతో ఉత్సాహాన్ని కలిగిస్తున్నాయని పోలీస్ కమిషనర్ అన్నారు. ఉత్తమ బతుకమ్మ లకు బహుమతుల ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వివిధ రకాల సహజసిద్ధ పూలతో ఆకర్షణీయంగా బతుకమ్మను తయారు చేసిన భరోసా సెంటర్ సిబ్బంది కి మొదటి బహుమతిని ఇస్తూ అలాగే బతుకమ్మ పాటలను పాడిన సుబేదారి పోలీస్ స్టేషన్కు చెందిన మహిళా కానిస్టేబుల్ స్వప్నను కమిషనర్ అబినందిస్తూ, ఆమెకు ప్రత్యేక బహుమతి ప్రధానం చేశారు. సంప్రదాయానికి అనుగుణంగా, వినూత్న రీతిలో పోలీస్ హెడ్క్వార్టర్స్ లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నీటి కొలనులో మహిళా సిబ్బంది తమ బతుకమ్మలను భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన పోలీస్ కమిషనర్ యన్. శ్వేత ఐపిఎస్ కు, సెంట్రల్ జోన్ డిసిపి దార కవిత కు అడిషనల్ డిసిపి (పరిపాలన) రాయల ప్రభాకర్ రావు, అడిషనల్ డిసిపి (ఎఆర్) సురేష్ , అడిషనల్ డిసిపి (ఎఆర్) వేముల శ్రీనివాస్, అడ్మిన్ ఆర్ఐ స్పర్జన్ రాజ్, వెల్ఫేర్ ఆర్ఐ సతీష్, యం.టి ఆర్ఐ శ్రీదర్, ఆర్ ఎస్సై శ్రావణ్, తో పాటు మిగతా సిబ్బందికి మహిళా సిబ్బంది ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## పాలకుర్తిలో రేపు మహాలక్ష్మి అవతార పూజలు

- భక్త వీరాంజనేయ స్వామి ఆలయంలో కుంకుమార్చన, అన్నప్రసాద వితరణ

**పాలకుర్తి మహా 15 అక్టోబర్** పాలకుర్తి గ్రామంలోని భక్త వీరాంజనేయ స్వామి దేవాలయంలో గత తొమ్మిదేళ్లుగా ఆనవాయితీగా నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రేపు మహాలక్ష్మి అవతార పూజలను వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనతో పాటు అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కావున పాలకుర్తి గ్రామ ప్రజలు, భక్తులు, పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

## యాదాద్రి థర్మల్ ప్లాంట్ వద్ద ఐఏఎస్ అధికారుల క్యాంపు

- ఐదుగురు అధికారులను నియమించిన ప్రభుత్వం
- ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్

**హైదరాబాద్, మహా** : నల్గొండ జిల్లా దామరచర్ల లోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ లో విద్యుత్ ఉత్పత్తి, బొగ్గు వినియోగంపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. థర్మల్ పవర్ ప్లాంట్ లో క్షేత్రస్థాయి పరిశీలన చేసి సమస్యలను అధిగమించేందుకు ప్రత్యేక చొరవ చూపుతుంది. అందుకు సంబంధించి ఐదుగురు ఐఏఎస్ అధికారులను నియమించింది. పవర్ ప్లాంట్ వద్ద విడతల వారీగా విధులు నిర్వహిస్తూ పరిశీలన చేయాల్సిందిగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. అక్టోబర్ 15వ తేదీ నుంచి 30 వ తేదీ వరకు 15 రోజులపాటు ఈ సీనియర్ అధికారులు పవర్ ప్లాంట్ వద్దనే ఉండి పరిశీలించనున్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఐఏఎస్ అధికారులు హరి కిరణ్ అక్టోబర్ 15 నుంచి 17వ తేదీ వరకు, వెంకటేష్, దోత్రి అక్టోబర్ 18,19 తేదీలలో, రాహుల్ రాజ్ అక్టోబర్ 22 నుంచి 24వ తేదీ వరకు, జెండేజ్ హనుమంతు కొండిబ అక్టోబర్ 25 నుంచి 27వ తేదీ వరకు, కిల్లు శివకుమార్ నాయుడు అక్టోబర్ 28 నుంచి 30వ తేదీ వరకు క్యాంపు నిర్వహించి పవర్ ప్లాంట్ వద్ద ప్రత్యేకంగా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ప్లాంటుకు సంబంధించిన బొగ్గు స్ట్రీమ్ లు పనిచేస్తున్నాయా..? ఏవైనా అంతరాయాలు ఉన్నాయా..? గ్రేడ్ కు తగినట్టుగా విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందా..? లేదా..? బొగ్గు సరఫరా నిరంతరాయంగా సాగుతుందా..? ఆటంకాలు ఏమైనా ఉన్నాయా.? అనే విషయంపై ఈ ఐదుగురు ఐఏఎస్ అధికారులు ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదిక అందజేయాల్సి ఉంది.

## పోలీస్ అధికారులపై అవినీతి కేసులు క్లోజ్

**హైదరాబాద్, మహా:** తెలంగాణలో పోలీసు అధికారులపై నమోదైన రెండు అవినీతి కేసులను మూసివేయడానికి నాంపల్లి ఏసీబీ కోర్టు అనుమతించింది. 2023 నుంచి ఇప్పటివరకు ప్రభుత్వ అధికారులకు సంబంధించిన సుమారు 22 అవినీతి కేసులు మూసివేత దశకు చేరినట్లు సమాచారం. తాజాగా ముగిసిన కేసుల్లో ఒకటి ఆదాయానికి మించిన ఆస్తులకు సంబంధించినది కాగా, మరొకటి పబ్ యజమాని నుంచి లంచం డిమాండ్ చేశారనే ఆరోపణలకు సంబంధించినది. ప్రభుత్వ నిర్ణయం మేరకు నిందితులపై క్రిమినల్ ప్రాసిక్యూషన్‌కు బదులుగా శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఏసీబీ కోర్టును ఆశ్రయించింది. ఈ రెండు కేసుల క్లోజర్ నివేదికలకు అక్టోబర్ 8, 9 తేదీల్లో కోర్టు ఆమోదం తెలిపింది. అవినీతి ఆరోపణలపై క్రిమినల్ చర్యలకు బదులుగా శాఖాపరమైన చర్యలకే పరిమితం కావడంపై చర్చ మొదలైంది.

## మళ్లీ వాయిదా పడిన 'ఆదర్శ కుటుంబం'.. కొత్త రిలీజ్ డేట్ ఎప్పుడో?

మ హా : విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో రూపొందుతున్న 'ఆదర్శ కుటుంబం హౌస్ నంబర్ 47' సినిమా విడుదల కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే ఈ చిత్రానికి వరుసగా విడుదల తేదీలు మారుతుండటంతో ప్రేక్షకుల్లో ఉత్కంఠ నెలకొంది. అక్టోబర్ 9న థియేటర్లలోకి రావాల్సిన ఈ సినిమా మరోసారి వాయిదా పడటంతో కొత్త విడుదల తేదీపై చర్చ మొదలైంది. వెంకటేశ్‌ను త్రివిక్రమ్ తనదైన కథ, సంభాషణలతో ఎలా చూపించబోతున్నారనే ఆసక్తి మొదటి నుంచీ ఉంది. కుటుంబ కథాంశాలు, వినోదాత్మక సన్నివేశాలతో ప్రేక్షకులను ఆకట్టుకునే వెంకటేశ్‌కు త్రివిక్రమ్ దర్శకత్వం తోడవడంతో ఈ ప్రాజెక్టుపై అంచనాలు పెరిగాయి. ఈ నేపథ్యంలో సినిమా విడుదల కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. తొలుత ఆగస్టులో విడుదల చేయాలనే ఆలోచన ఉండగా, ఆ తర్వాత అక్టోబర్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్రబృందం నిర్ణయించింది. అక్టోబర్ 2 తేదీని పరిశీలించిన అనంతరం అక్టోబర్ 9న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. అయితే చివరి దశలో విడుదల వాయిదా పడటంతో అభిమానులకు నిరాశ ఎదురైంది. సినిమా పనులు పూర్తయినప్పటికీ, తుది అవుట్‌పుట్ విషయంలో ఎక్కడా రాజీ పడకూడదనే ఉద్దేశంతో మరింత సమయం తీసుకోవాలని నిర్మాతలు భావించినట్లు నిర్మాత నాగవంశీ వెల్లడించిన వివరాలను బట్టి తెలుస్తోంది. ముఖ్యంగా సాంకేతిక నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తూ, ప్రేక్షకులకు మెరుగైన సినిమా అందించాలన్నది చిత్రబృందం ఆలోచనగా కనిపిస్తోంది. ఈ వాయిదా వెనుక ఓటీటీ ఒప్పందానికి సంబంధించిన సమస్య లేదని కూడా నిర్మాత స్పష్టం చేసినట్లు వార్తలు వచ్చాయి. ఇదిలా ఉండగా, అక్టోబర్ 30న సినిమా విడుదల కావచ్చంటూ గతంలో ప్రచారం జరిగింది. సంగీత దర్శకుడు తమన్ కూడా ఈ తేదీకి సంబంధించి సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టి తొలగించినట్లు వార్తలు వెలువడ్డాయి. అయితే అక్టోబర్ 30 తేదీపై అధికారిక ప్రకటన రాకపోవడంతో దాన్ని ఖరారైన విడుదల తేదీగా పరిగణించలేని పరిస్థితి ఉంది. మరోవైపు, సినిమా ప్రచారానికి సంబంధించిన అంశాలపై సోషల్ మీడియాలో జరుగుతున్న చర్చ కూడా ఆసక్తిని పెంచుతోంది. తుది చిత్రాన్ని అత్యుత్తమ సాంకేతిక ప్రమాణాలతో అందించాలనే లక్ష్యంతోనే ఆలస్యం చేస్తున్నట్లు చిత్రబృందం చెబుతోంది. వెంకటేశ్, సురేశ్‌బాబు తిరిగి వచ్చిన తర్వాత కొత్త విడుదల తేదీపై చర్చించి ప్రకటించే అవకాశం ఉందని నిర్మాత నాగవంశీ గతంలో తెలిపారు. ప్రస్తుతం 'ఆదర్శ కుటుంబం' కొత్త విడుదల తేదీపై స్పష్టత కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. వెంకటేశ్-త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రం ఎప్పుడు థియేటర్లలోకి వస్తుంది? వాయిదాలకు తెరదించి చిత్రబృందం ఎప్పుడు అధికారిక ప్రకటన చేస్తుంది? అన్నది ఆసక్తికరంగా మారింది. అప్పటివరకు కొత్త తేదీపై వస్తున్న ప్రచారాన్ని అధికారిక ప్రకటనగా భావించకపోవడమే మంచిది.





## బీచ్‌లో స్టైలిష్ లుక్‌తో ..

మహా : క్షిణాది ప్రేక్షకులకు సుపరిచితమైన నటి జ్యోతి పూర్వాజ్ మరోసారి తన ఫ్యాషన్ స్టైల్‌తో అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నారు. సముద్రతీరంలో ఆమె చేసిన ఫొటోషూట్‌కు సంబంధించిన చిత్రాలు ప్రస్తుతం సినీ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. ముఖ్యంగా నలుపు రంగు లేస్ దుస్తుల్లో ఆమె కనిపించిన తీరు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. సముద్రపు అలలు, ప్రకృతి అందాల మధ్య సాగిన ఈ ఫొటోషూట్‌లో జ్యోతి పూర్వాజ్ ఆధునిక ఫ్యాషన్‌కు తగినట్లుగా తనదైన శైలిని ప్రదర్శించారు. నలుపు రంగు పారదర్శక లేస్ కవర్‌అప్ దుస్తులు, స్టైలిష్ సన్‌గ్లాసెస్, గాలికి కదులుతున్న కేశాలు ఆమె లుక్‌కు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చాయి. సాధారణంగా కనిపించే బీచ్ ఫొటోషూట్‌ను తన ప్రత్యేకమైన స్టైలింగ్‌తో ఆకర్షణీయంగా మార్చారు. సంప్రదాయ దుస్తులతో పాటు ఆధునిక ఫ్యాషన్‌లోనూ తనకు మంచి అభిరుచి ఉందని ఈ చిత్రాల ద్వారా తెలియజేస్తున్నారు. జ్యోతి పూర్వాజ్‌కు తెలుగు బుల్లితెరపై ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ప్రముఖ సీరియల్ 'గుప్పెడంత మనసు'లో జగతి పాత్ర ద్వారా ఆమె తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరయ్యారు. అంతకుముందు కన్నడ టెలివిజన్‌లోనూ పలు ధారావాహికల్లో నటించి మంచి పేరు సంపాదించారు. బుల్లితెరపై భావోద్వేగభరితమైన పాత్రలతో గుర్తింపు పొందిన ఆమె, సినిమాల్లోనూ తన ప్రతిభను చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు. టెలివిజన్‌తో పాటు సినిమా రంగంలోనూ అవకాశాలను అందిపుచ్చుకుంటూ తన కెరీర్‌ను విస్తరించుకుంటున్నారు. నటనకు ప్రాధాన్యమిచ్చే పాత్రలతో పాటు ఫొటోషూట్లు, ఫ్యాషన్‌కు సంబంధించిన చిత్రాల ద్వారా కూడా అభిమానులతో అనుబంధాన్ని కొనసాగిస్తున్నారు. సంప్రదాయంగా కనిపించే పాత్రల నుంచి ఆధునిక రూపాల్లో కనిపించే ఫొటోషూట్ల వరకు భిన్నమైన శైలులను ప్రయత్నించడం ఆమె ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. ప్రస్తుతం జ్యోతి పూర్వాజ్ బీచ్ ఫొటోషూట్‌లోని నలుపు రంగు లేస్ డ్రెస్ లుక్ ఫ్యాషన్ ప్రియులను ఆకట్టుకుంటోంది. అయితే ఈ చిత్రాలకు అభిమానుల నుంచి వచ్చిన స్పందనకు సంబంధించి నిర్దిష్ట గణాంకాలు అందుబాటులో లేవు. తనదైన స్టైల్‌తో కొత్త రూపాల్లో కనిపిస్తూ సినీ, టెలివిజన్ ప్రేక్షకుల దృష్టినీ ఆకర్షించడం మాత్రం ఆమెకు కొత్తేమీ కాదు.

## హైదరాబాద్‌లో సొంతింటి కల నెరవేర్చుకుంటున్న అనుపమ పరమేశ్వరన్!

**తెలుగు ప్రేక్షకుల ఆదరణే హైదరాబాద్‌తో అనుబంధానికి కారణం**

మహా సినిమా: దక్షిణాది సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నటి అనుపమ పరమేశ్వరన్ హైదరాబాద్‌లో సొంత ఇంటిని నిర్మించుకుంటున్నారు. తెలుగు సినిమాలతో ప్రేక్షకులకు మరింత దగ్గరైన ఈ ముద్దుగుమ్మ, నగరంలో తనకంటూ ఓ నివాసం ఏర్పాటు చేసుకోవడం విశేషంగా మారింది. ప్రస్తుతం ఇంటి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, త్వరలోనే అవి పూర్తవుతాయని ఆమె వెల్లడించారు. ఇటీవల మీడియాతో మాట్లాడిన అనుపమ తన కొత్త ఇంటి గురించి ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. హైదరాబాద్‌లో సొంత ఇల్లు ఉందా? అనే ప్రశ్నకు సమాధానమిస్తూ, ప్రస్తుతం తన ఇల్లు నిర్మాణ దశలో ఉందని తెలిపారు. నిర్మాణం పూర్తయిన తర్వాత అందరినీ ఇంటికి ఆహ్వానిస్తానని సరదాగా చెప్పారు. దీంతో ఆమె అభిమానుల్లో ఈ విషయం ఆసక్తిని రేకెత్తిస్తోంది. తెలుగు చిత్ర పరిశ్రమలో అనుపమ ప్రయాణం 'అ ఆ' సినిమాతో ప్రారంభమైంది. మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో నితిన్ హీరోగా వచ్చిన ఈ చిత్రంలో ఆమె కీలక పాత్ర పోషించారు. తొలి సినిమాతోనే తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన అనుపమ, ఆ తర్వాత పలు విజయవంతమైన చిత్రాల్లో నటిస్తూ తనకంటూ ప్రత్యేక అభిమాన వర్గాన్ని సంపాదించుకున్నారు. 'ప్రేమమ్', 'శతమానం భవతి', 'ఉన్నది ఒకటే జిందగీ', 'హలో గురు ప్రేమ కోసమే', 'కార్తికేయ 2', 'టిల్లు స్క్వేర్' వంటి సినిమాలతో ఆమెకు మంచి గుర్తింపు లభించింది. విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ నటిగా తన పరిధిని విస్తరించుకుంటున్నారు. ముఖ్యంగా యువతలో ఆమెకు మంచి క్రేజ్ ఉంది. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి తెలుగు చిత్ర పరిశ్రమలో స్థిరపడే నటీనటులు హైదరాబాద్‌లో నివాసాలు ఏర్పాటు చేసుకోవడం కొత్తేమీ కాదు. సినిమా షూటింగులు, సమావేశాలు, ఇతర వృత్తిపరమైన కార్యక్రమాల కోసం హైదరాబాద్‌లో ఎక్కువ సమయం గడపాల్సి రావడంతో చాలామంది ఇక్కడే సొంత ఇళ్లను నిర్మించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో అనుపమ కూడా నగరంలో ఇల్లు నిర్మించుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. తెలుగు ప్రేక్షకులు తనపై చూపిస్తున్న ప్రేమాభిమానాలే హైదరాబాద్‌ను తనకు సొంత ఊరిలా మార్చాయని అనుపమ సంతోషం వ్యక్తం చేశారు. ప్రేక్షకుల ఆదరణ, సినీ పరిశ్రమతో ఏర్పడిన అనుబంధం తనకు ఎంతో ప్రత్యేకమని ఆమె మాటల్లో స్పష్టమవుతోంది.

ప్రస్తుతం అనుపమ పరమేశ్వరన్ 'క్రేజీ కల్యాణం' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమయ్యారు. బద్రప్ప గాజుల దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో ఆమె కీలక పాత్ర పోషించారు. అక్టోబర్ 16న విడుదల కానున్న ఈ సినిమా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా తన కొత్త ఇంటి విషయాన్ని వెల్లడించడంతో ఆమె వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఈ ఆసక్తికరమైన వార్త సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత గృహప్రవేశం ఎప్పుడు నిర్వహిస్తారు? అభిమానులను ఎప్పుడు ఆహ్వానిస్తారు? అనే విషయాలు తెలియాల్సి ఉంది. ఏదేమైనా, తెలుగు చిత్ర పరిశ్రమతో తన అనుబంధాన్ని మరింత బలపరుచుకుంటూ హైదరాబాద్‌లో సొంత ఇంటి కలను నిజం చేసుకుంటున్న అనుపమకు అభిమానులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.



## 400 పేద కుటుంబాలకు రష్మిక అండ..

**'అన్నపూర్ణ' కార్యక్రమంతో పేదలకు నిత్యావసర సరుకులు.. ఏడాది పాటు సాయం అందించేందుకు నిర్ణయం**



మహా సినిమా : నేషనల్ క్రష్ రష్మిక మందన్న తన మంచి మనసును చాటుకున్నారు. వెండితెరపై విభిన్న పాత్రలతో ప్రేక్షకులను అలరిస్తున్న ఈ నటి, నిజ జీవితంలోనూ సామాజిక బాధ్యతను గుర్తుచేసే నిర్ణయం తీసుకున్నారు. తన తాజా చిత్రం 'రణబాలి'లో పోషించిన జయమ్మ పాత్ర నుంచి స్ఫూర్తి పొందిన ఆమె, 400 పేద కుటుంబాలకు అండగా నిలిచేందుకు ముందుకొచ్చారు. ఈ కుటుంబాలకు నిత్యావసర సరుకులను అందిస్తూ, వారి రోజువారీ ఖర్చుల భారాన్ని తగ్గించాలనే లక్ష్యంతో ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించారు. రష్మిక చేపట్టిన ఈ సేవా కార్యక్రమానికి 'ప్రాజెక్ట్ అన్నపూర్ణ'గా పేరు పెట్టారు. దక్షిణ భారతదేశంలోని ఎనిమిది ప్రాంతాల్లో ఉన్న 400 కుటుంబాలకు ఈ కార్యక్రమం ద్వారా సహాయం అందించనున్నారు. ఒక్కో కుటుంబానికి మూడు నెలలకు సరిపడా నిత్యావసర వస్తువులను పంపిణీ చేయాలని నిర్ణయించారు. బియ్యం, గోధుమ పిండి, పప్పులు, వంట నూనె తదితర రోజువారీ అవసరాలకు ఉపయోగపడే సరుకులను అందించేలా ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఒక్క విడతతో ముగించకుండా, వచ్చే ఏడాది పాటు ప్రతి మూడు నెలలకు ఒకసారి కొనసాగించాలని ఆమె భావిస్తున్నారు. సినిమాల్లోని పాత్రలు నటీనటుల ఆలోచనలపై ప్రభావం చూపుతుంటాయి. రష్మిక విషయంలోనూ 'రణబాలి'లోని జయమ్మ పాత్ర అలాంటి స్ఫూర్తిని కలిగించినట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో జయమ్మగా నటిస్తున్న ఆమె, ఆ పాత్రలోని మానవత్వం, ఇతరుల పట్ల బాధ్యత వంటి అంశాలను తన నిజ జీవితంలోని సేవా కార్యక్రమంతో ముడిపెట్టారు. అయితే పేదలకు సహాయం చేయడం తనకు కొత్తగా మొదలైన పని కాదని, ఇంతకుముందు కూడా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ వాటిని ప్రచారంలోకి తీసుకురావడానికి ఆసక్తి చూపలేదని ఆమె వెల్లడించారు. తనపై అభిమానులు చూపిస్తున్న ప్రేమకు కృతజ్ఞతగా సమాజానికి తిరిగి ఏదైనా చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు రష్మిక పేర్కొన్నారు. ఈ విషయాన్ని బయటకు వెల్లడించడం వెనుక మరో ముఖ్యమైన కారణం ఉందని ఆమె తెలిపారు. తన చర్య ద్వారా కనీసం మరికొంతమందైనా స్ఫూర్తి పొంది, తమకు సాధ్యమైనంత మేర ఇతరులకు సహాయం చేస్తే సంతోషంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. చిన్న సహాయం కూడా ఒక కుటుంబానికి ఎంతో ఉపయోగపడుతుందని, సేవ చేయడానికి పెద్ద మొత్తంలో డబ్బు అవసరం లేదని ఆమె సందేశమిచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా లబ్ధి పొందే కుటుంబాలు నిత్యావసర సరుకుల కోసం ఖర్చు చేయాల్సిన డబ్బును పొదుపు చేసుకునే అవకాశం ఉంటుందని రష్మిక ఆశిస్తున్నారు. ఆ మొత్తాన్ని పిల్లల చదువులు, వైద్య అవసరాలు, భవిష్యత్తు ప్రణాళికలు వంటి ఇతర ముఖ్యమైన అవసరాలకు ఉపయోగించుకోవచ్చని భావిస్తున్నారు. కేవలం ఒకసారి సరుకులు అందించడమే కాకుండా, నిర్దిష్ట వ్యవధిలో సహాయాన్ని కొనసాగించడం ద్వారా కుటుంబాలకు కొంత ఆర్థిక వెసులుబాటు కల్పించాలన్నది ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం.

## సినిమా ప్రారంభోత్సవం కాదు.. ఆఫీస్ ఓపెనింగ్ మాత్రమే!

**రామ్ చరణ్–సుకుమార్ 'RC 17'పై క్లారిటీ**

మహా : మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, దర్శకుడు సుకుమార్ కలయికలో తెరకెక్కనున్న 'RC 17' సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా హైదరాబాద్‌లో ఈ చిత్ర కార్యాలయాన్ని ప్రారంభించడంతో సినిమా పూజా కార్యక్రమాలు కూడా పూర్తయ్యాయంటూ ప్రచారం జరిగింది. అయితే ఇది సినిమా ప్రారంభోత్సవం కాదని, కేవలం కార్యాలయ ప్రారంభ కార్యక్రమమేనని సమాచారం. ఈ కార్యక్రమానికి సుకుమార్, ఆయన సతీమణి తబిత, నిర్మాతలు, చిత్రబృంద సభ్యులు హాజరయ్యారు. సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులను వేగవంతం చేసేందుకు కార్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. కథకు తుది మెరుగులు దిద్దడం, నటీనటుల ఎంపిక, షూటింగ్ ప్రణాళికలు రూపొందించడం వంటి పనులు ఇక్కడి నుంచి కొనసాగనున్నాయి. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించనున్నాయి. గతంలో 'రంగస్థలం'తో విజయాన్ని అందుకున్న ఈ కాంబినేషన్‌పై మరోసారి ఆసక్తి పెరిగింది. సినిమాలో రామ్ చరణ్ పాత్ర, కథాంశంపై అభిమానులు ఎదురుచూస్తున్నారు. సినిమా పూజా కార్యక్రమాలు, రెగ్యులర్ షూటింగ్ తేదీలపై చిత్రబృందం అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com